# గణగణ మోగిన గంట

నవల

- కొమ్మూరి సాంబశివరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 230

కౌముది మాసపత్రికలో

మార్చ్ 2017 సంచిక నుంచి ఫిబ్రవరి 2018 సంచిక వరకూ

వచ్చిన నవల

"**ఏమండీ!** ఏమండోయ్!" తగ్గు స్థాయిలోనే భర్తను పిలిచింది సావిత్రి.

కృష్ణమూర్తి కదలలేదు. ఏడుస్తున్న పిల్లాడి నోట్లో పాలబుడ్డి పీక పెట్టి, తల్లి వొళ్ళో పడుకోబెట్టుకోగానే పిల్లాడు ఏడుపు మానేశాడు. పిల్లాడి ఏడుపు ఆగిపోగానే ఉయ్యాలబల్ల కీచు కీచుమనడం ఎక్కువైంది. సావిత్రి రెండు నిమిషాలపాటు శ్రద్ధగా ఆ చప్పుడు విన్నది.

"ఏమండీ! మిమ్మల్నే. ఒకసారి లేవండి" అని భర్తని భుజం పట్టి వూపింది.

కృష్ణమూర్తి ఉలిక్కిపడి లేచి కూర్చుని కళ్ళు నలుపుకుని భార్యనీ, భార్య వొళ్ళోవున్న పిల్లాణ్ణి చూసి "ఏమిటి? ఏమైంది?" అంటూ పక్కకి చూశాడు. మూడేళ్ళ చిట్టి నోట్లో వేలు పెట్టుకుని నిద్రపోతోంది.

"ఆ ఉయ్యాల బల్లండీ! ఎవరో ఊగుతున్నారు. కీచుకీచుమంటూ శబ్దం. ఆ చప్పుడికి పిల్లాడు నిద్రలేచాడు" అన్నది సావిత్రి.

"అయితే నన్నేం చేయమంటావు?" అన్నాడు కృష్ణమూర్తి విసుగ్గా.

"వెళ్ళి ఆపమని చెప్పండి. అలా కీచుకీచుమంటుంటే వీడు నిద్రపోడు. నన్ను నిద్రపోనివ్వడు" అన్నది సావిత్రి దీనంగా.

కృష్ణమూర్తికి అప్పటికి పూర్తిగా నిద్రమత్తుపోయింది. లేచి అలమారు దగ్గరికి వెళ్ళి సిగరెట్ తీసుకుని వెలిగించి, అలమారులో వున్న రిస్టువాచీ చూశాడు. రెండు గంటల పదినిమిషాలయింది.

గది తలుపు తెరుచుకుని నడవాలోకి వెళ్ళాడు. నడవా అంతా చీకటిగా వుంది. ఆ చీకటి కృష్ణమూర్తిని బాధించలేదు. ఆ యింట్లో పెరిగాడు. ప్రతిగోడ, గోడలమీద వున్న ప్రతి మరకా తెలుసు. చకచకా నడిచి నడవాదాటి పూజ గది పక్కనించి ఉయ్యాల బల్ల వుండే పెద్ద గదిలోకి వెళ్ళాడు. ఉయ్యాలబల్ల వూగుతోంది. కీచుమంటోంది. ఆ గదికూడా చీకటిగా వుంది.

"ఎవరది ఉయ్యాల బల్లమీద?" అడిగాడు కృష్ణమూర్తి గుమ్మం దగ్గర నిలుచుని. జవాబులేదు.

మంచి నిద్రలోంచి లేచాడేమో విసుగ్గా వున్నాడు. తను నిద్రలేవడానికి యీ ఉయ్యాల బల్లే కారణం కనక ఆ ఉయ్యాల బల్లమీద కోపంగా ఉన్నాడు. ఊగుతూ ఉయ్యాల బల్ల గుమ్మం దగ్గరికి వచ్చినపుడు గొలుసు పట్టుకుని ఆపాడు.

"ఎవరది? అర్ధరాత్రివేళ ఊగడమేమిటి?" అడిగాడు. మళ్ళీ జవాబులేదు.

ఉయ్యాల బల్లమీద చూశాడు. తెల్లగా ఏదో ఉంది. ఎవరో నిద్రపోతున్నారనుకుని తట్టి లేపడానికి చెయ్యి చాపాడు. అతని చేతికి ఓ బట్ట మాత్రం తగిలింది. ఉయ్యల బల్లమీద తెల్లని పంచ మాత్రం పరిచి ఉంది. ఎవరూ లేరు. ఎవరో ఉయ్యాల బల్లమీద కాసేపు పడుకుని, ఊగి, ఆపకుండా వెళ్ళిపోయారనుకుని ఆ మనిషిని లోలోన తిట్టుకుంటూ కృష్ణమూర్తి ఉయ్యాల బల్ల ఊగకుండా ఆపి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

"అర్ధరాత్రి ఊగుతున్నది ఎవరండీ?" అడిగిందిసావిత్రి భర్త రాగానే.

"ఎవరో! ఎవరూ లేరు అక్కడ" అన్నాడు కృష్ణమూర్తి పడుకుంటూ.

"అదేమిటండీ ఎవరూ లేకుండా ఉయ్యాలబల్ల దానంతట అదే ఎలా ఊగుతుందండీ" అడిగింది సావిత్రి.

"ఈ అర్ధరాత్రి నీ చొప్పదంటు ప్రశ్నలకి జవాబులు చెప్పేందుకు నాకు ఓపికలేదు. ఎవరో ఊగి, ఆపకుండా వెళ్ళిపోయారు" అని చిట్టివైపు తిరిగి కళ్ళు మూసుకున్నాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తికి ముప్పయి నాలుగేళ్ళు. వకీలు. బెజవాడలో ప్రాక్టీసు చేస్తున్నాడు. అతని భార్య సావిత్రికి ఇరవైనాలుగేళ్ళు. స్కూల్ ఫైనల్ వరకూ చదువుకుంది. ఇద్దరు పిల్లల తల్లి. పిల్లాడికి యింకా ఏడాది నిండలేదు.

పాలబుడ్డిలో పాలు అయిపోయినా పీక చీకిచీకి కళ్ళు మూశాడు పిల్లాడు. సావిత్రి పిల్లాణ్ణి నెమ్మదిగా పరుపుమీద పడుకోబెట్టి, లేచి వెళ్ళి గోడనున్న బుడ్డి దీపం తగ్గించి వచ్చి పిల్లాడి పక్కన పడుకున్నది. పడుకున్నదో లేదో మళ్ళీ ఉయ్యాల బల్ల కీచుకీచుమని చప్పుడు చెయ్యడం ప్రారంభించింది. పిల్లాడు ఉలిక్కిపడి లేచి పీకకోసం వెతుక్కుని ఏడ్వడం ప్రారంభించాడు.

"డామిట్ ఎవరది? బ్రూట్స్ అర్ధరాత్రివేళ ఉయ్యాల ఊగడం ఏమిటి? అంతగా ఊగాలనుకుంటే చప్పుడు చెయ్యకుండా నూనె వెయ్యలేరూ?" అంటూ కోపంతో కృష్ణమూర్తి లేచాడు.

"ఏమండోయ్. మంచిగా చెప్పండి. అనవసరంగా పోట్లాడకండి" అన్నది సావిత్రి. కృష్ణమూర్తి దురుసు మనిషి, నోటికి ఎంత వస్తే అంత అనేస్తాడు. అతని నైజం సావిత్రికి బాగా తెలుసు.

కృష్ణమూర్తి గబగబా ఉయ్యాల బల్ల ఉన్న గదిలోకి వెళ్ళి గొలుసు పట్టుకుని ఉయ్యాలని ఆపి "ఎవరది అర్ధరాత్రి ఊగుతున్నది?" అడిగాడు కోపంగా.

ఎవరూ జవాబు చెప్పలేదు. అంతకుముందు ఉయ్యాల బల్లమీద పరిచి ఉండడం గమనించాడు. కృష్ణమూర్తి వెనక్కి తిరిగి తన గదిలోకి వెళ్ళాడు. అలమారులోంచి టార్చిలైటు తీసుకుని మళ్ళీ ఉయ్యాల వున్న గదిలోకి వెళ్ళి ఉయ్యాల బల్ల ఆపేసి టార్చి వెలుగులో ఆ పంచని పరీక్షగా చూశాడు. అది తన తండ్రి పంచ. దాన్ని తీసుకుని తన గదిలోకి వెళ్ళాడు.

"ఎవరండీ?" అడిగింది సావిత్రి. పాలబుడ్డి పీక చీకుతూ పిల్లాడు తండ్రి చేతిలో టార్చిలైటుని కళ్ళార్పకుండా చూస్తున్నాడు.

"నాన్నగారు" అన్నాడు కృష్ణమూర్తి అదో రకంగా నవ్వుతూ.

"అబ్బ! పరిహాసాలాడకండి. ఎవరో చెప్పండి" అన్నది సావిత్రి.

అక్కడ ఎవరూ లేరనీ, ఆ పంచ మాత్రం ఉయ్యాల బల్లమీద ఉన్నదనీ కృష్ణమూర్తి భార్యకి చెప్పాడు.

సావిత్రి కళ్ళు పెద్దవిచేసి, నోరు తెరుచుకుని చూసింది. పిల్లాణ్ణి గట్టిగా రొమ్ముకి అదిమిపెట్టుకుని "నిజంగానా?" అడిగింది.

సావిత్రి అడుగుతుండగానే ఉయ్యాల బల్ల మళ్ళీ వూగడం, కీచుకీచుమంటూ శబ్దం చెయ్యడం ప్రారంభమైంది.

"నాకు భయంగా వుందండీ" అన్నది సావిత్రి భర్త దగ్గరికి జరుగుతూ.

కృష్ణమూర్తి దీర్ఘాలోచనలో పడ్డాడు. అతనికి మూఢ నమ్మకాలు లేవు. క్లబ్బులో ఎవరయినా దెయ్యాల కథలు చెపితే చిరునవ్వుతో వినేవాడు కాని కొంచెం కూడా నమ్మేవాడు కాదు.

తండ్రికి చాలా జబ్బుగా ఉందంటే భార్యనీ, పిల్లలనీ వెంట పెట్టుకుని వచ్చాడు. తను వచ్చిన మర్నాడే తండ్రిపోయాడు. ఆ ముసలాయనకి అరవై ఎనిమిదేళ్ళు. కన్ను మూసే సమయాన నలుగురు కొడుకులూ, నలుగురు కోడళ్ళూ, నలుగురు కూతుళ్ళూ, ముగ్గురు అల్లుళ్ళూ, మనవలు, మనవరాళ్ళు, భార్య అంతా దగ్గిరే ఉన్నారు. పోయేముందు ఎక్కువ బాధపడలేదు. రెండు రోజులు తీవ్రంగా జ్వరం కాసింది. మూడోరోజు కన్ను మూశాడు.

కృష్ణమూర్తి తండ్రి పంచను పరీక్షగా చూశాడు. అతను పిరికివాడు కాదు. తన తండ్రి దెయ్యమై వచ్చి, తనకి హాని చేస్తాడనే భీతిలేదు. నలుగురు కొడుకులలోనూ తనంటే ఆ ముసలాయనకి ఎక్కువ యిష్టం అని కృష్ణమూర్తికి తెలుసు. ఆ పంచ మడిచి దిండు కిందపెట్టాడు కృష్ణమూర్తి. తర్వాత హోల్డాలు బెల్టు తీశాడు.

"మీ అన్నయ్యనీ వాళ్ళనీ లేపి చెప్పండి" అన్నది సావిత్రి.

"పాపం. వాళ్ళని లేపడం ఎందుకు?" అంటూ తలుపు దగ్గరకి వెళ్ళాడు కృష్ణమూర్తి.

"నన్ను ఒంటరిగా ఒదిలి వెళతారా! చచ్చినా నేనొక్కదాన్నీ ఉండను" అన్నది సావిత్రి లేచి నిలబడి.

భార్య కళ్ళల్లో బెదురు చూసి కృష్ణమూర్తి చిన్నగా నవ్వుతూ "క్షణంలో వచ్చేస్తాను. ఆ ఉయ్యాలని తలుపుకేసి కట్టేసి వస్తాను" అన్నాడు.

"నేనూ వస్తాను" అన్నది సావిత్రి మొండిగా.

"చిట్టినీ, చంటివాణ్ణీ ఏం చేస్తావ్?"

సావిత్రి నిద్రపోతున్న మూడేళ్ళ చిట్టివైపు చూసి "పోనీ ఊగితే ఊగనివ్వండి. మీరు మాత్రం వెళ్ళకండి" అన్నది.

"ఛీ! మరీ చిన్నపిల్లమల్లే మొండితనం చెయ్యక" అనేసి చటుక్కున కృష్ణమూర్తి వెళ్ళిపోయాడు. ఊగుతున్న ఉయ్యాలని పట్టుకుని గొలుసుని హోల్డాలు బెల్టు ఒక కొసతో కట్టి, రెండో కొస తలుపు గొళ్ళానికి బిగించాడు. ఒకసారి ఉయ్యాలని కదిల్చి చూశాడు. కదలలేదు. గట్టిగా వుందని నిర్ధారన చేసుకుని తన గదిలోకి వెళ్ళాడు.

ఇద్దరు పిల్లలనీ చెరో పక్కనా పడుకోబెట్టుకుని యిద్దరి మీదా చేతులు వేసి, దిండులో మొహం దాచుకుని పడుకున్న సావిత్రిని చూసి నవ్వుకుని, దీపం తగ్గించి "నీ పక్కన చోటు చెయ్యినాకు" అన్నాడు కృష్ణమూర్తి.

ఆమె కదిలింది.

"పల్లెటూరి గబ్బిలాయిలా నువ్వు యిలా భయపడితే నీ చదువు ఎందుకు చెప్పు?" అంటూ భార్య నడుం చుట్టూ చెయ్యివేశాడు కృష్ణమూర్తి.

"బాగానే వుంది. భయం అందరికీ వుంటుంది" అన్నది ఆమె భర్త మీద చెయ్యివేసి దగ్గరికి జరుగుతూ.

కీచుకీచుమంటూ శబ్దం మళ్ళీ ప్రారంభం అయింది.

ఉయ్యాల బల్ల మళ్ళీ ఊగుతోంది.

భార్యాభర్తలిద్దరూ చటుక్కున లేచి కూర్చున్నారు.

## 2

"ఏమండోయ్! కొంచెం నిద్రలేవండి. మీ తమ్ముడు కృష్ణమూర్తి పిలుస్తున్నాడు" అంటూ కమల భర్తని భుజం పట్టుకుని కదిపింది.

శ్రీనివాసరావు చటుక్కున లేచి కూర్చుని "ఎవరు?" అడిగాడు నిద్రమత్తులో.

"కృష్ణమూర్తి అండీ!" కమల అంటుండగానే "అన్నయ్యా!" అని పిలుపు వినపడింది తలుపు అవతల నించి.

శ్రీనివాసరావు మంచం దిగి, గబగబా వెళ్ళి తలుపు తెరిచి "ఏమిటి?" అడిగాడు ఆదుర్దాగా కమల ఆలోగా గోడకున్న బుడ్డి దీపం పెద్దది చేసి తనూ తలుపు దగ్గరికి వచ్చింది.

"నీతో మాట్లాడాలి. ఓ మాటు ఇలారా!" అన్నాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి చిట్టిని ఎత్తుకు రావడం, అతని వెనక సావిత్రి చంటి పిల్లాణ్ణి ఎత్తుకుని నిలబడి ఉండడం చూసి శ్రీనివాసరావు నిర్ఘాంతపోయి "ఏమిటిరా! మీరిద్దరూ పోట్లాడుకున్నారా ఏమిటి?" అడిగాడు.

భార్యని చూసి "నువ్వు వెళ్ళి వదిన దగ్గర కూర్చో" అన్నాడు కృష్ణమూర్తి శ్రీనివాసరావు ప్రశ్నకి జవాబు చెప్పకుండా. లోపలికి వెళ్ళి చిట్టిని మంచం మీద పడుకోబెట్టి "అన్నయ్యా! రా" అన్నాడు.

శ్రీనివాసరావుకి నలభై రెండేళ్ళు. అతను డాక్టర్. మద్రాసులో ప్రాక్టీసు చేస్తున్నాడు. ముగ్గురు పిల్లలు. పెద్దవాడు అయిదో ఫారం చదువుతున్నాడు. రెండో పిల్ల పదేళ్ళది. మూడో పిల్ల నాలుగేళ్ళది. తండ్రికి జబ్బుగా ఉందనీ, ప్రమాద స్థితిలో ఉన్నాడనీ ఉత్తరం రాగానే తన ప్రాక్టీసు యింకో డాక్టర్‌కి అప్పచెప్పి హుటాహుటిని బయలుదేరి వచ్చాడు. శ్రీనివాసరావే పెద్దకొడుకు.

అన్నదమ్ములిద్దరూ బయటికి వెళ్ళగానే కమల తోడికోడల్ని ప్రశ్నార్థకంగా చూస్తూ "సావిత్రీ ఏమిటీ గొడవ?" అడిగింది.

కమలకి ముప్పయినాలుగేళ్ళు. జుట్టు కొంచెం నెరిసింది. లావుగా పొట్టిగా వున్నా కళకళలాడుతూ వుండే పచ్చని శరీరం. మెడనిండా నగలు, చేతులకి అరడజను బంగారం గాజులు, రవ్వల కమ్మలు, ఇద్దరు పిల్లల్ని కనికూడా అందం కాపాడుకుంటున్న సావిత్రిని చూస్తే కొద్దిగా యీర్ష్య ఆమెకి.

ఉయ్యాల బల్ల ఊగడం విషయం సావిత్రి కమలకి చెప్పింది. "నేను పిల్లల్ని పెట్టుకుని ఒంటిగా ఆ గదిలో ఉండనన్నాను. ఆయన చిట్టిని ఎత్తుకున్నారు. నేను పిల్లాడ్ని చంకనేసుకున్నాను. వెళ్ళి చూశాం. హోల్డాలు బెల్టుతో సహా ఉయ్యాల ఊగుతోంది. తలుపు గొళ్ళానికి బిగించిన బెల్టు ఎలా ఊడిందో" అన్నది సావిత్రి.

"ఉయ్యాల కీచుమనడం నాకూ వినిపించింది. ఆయనకి చెప్పాను. ఎవరో నిద్రపట్టక ఊగుతుంటారని అన్నారు. అర్ధరాత్రి ఊగటం ఏమిటి, వెళ్ళి ఆపమని చెప్పమంటే బావుండదు అన్నారు" అన్నది కమల.

అన్నతమ్ములిద్దరూ మెట్లు దిగి కింద ఉయ్యాల బల్ల ఉన్న పెద్ద గదిలోకి వెళ్ళారు. ఉయ్యాలబల్ల ఊగుతూనే ఉంది. తమ్ముడు చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు శ్రీనివాసరావు. హోల్డాలు బెల్టు పరీక్ష చేసి చూశాడు.

"ఇంతకీ ఏమంటావ్?" అడిగాడు శ్రీనివాసరావు తమ్ముణ్ణి.

"ఏమో! నాకేం తెలియడంలేదు. అందుకే నిన్ను లేపాను. మాన్ ఆఫ్ సైన్స్‌వి కదా! ఏం చెపుతావో అని" అన్నాడు కృష్ణమూర్తి బలవంతాన నవ్వు తెచ్చి పెట్టుకుంటూ.

"మనింట్లోనే ఎవరో సరదాకి చేస్తూ వుండి వుండాలి. నాకు దెయ్యమంటే నమ్మకం లేదు" అన్నాడు శ్రీనివాసరావు.

"నాకూ నమ్మకం లేదు. ఈ పనిచేస్తున్న వాళ్ళ సెన్స్ ఆఫ్ హ్యూమర్ చాలా విచిత్రమైనది" అన్నాడు కృష్ణమూర్తి.

"ఆడవాళ్ళు యిద్దరూ భయపడుతుంటారు. నువ్వు వెళ్ళి వాళ్ళకి తోడుండు. నేనీ రాత్రి యీ ఉయ్యాల బల్లమీద పడుకుంటాను" అన్నాడు శ్రీనివాసరావు.

"నువ్వెందుకు? నేనే పడుకుంటాను. నువ్వు వెళ్ళు" అన్నాడు కృష్ణమూర్తి.

శ్రీనివాసరావు తమ్ముడి భుజం మీద తట్టి "నాకు యిదేదో కనుక్కోవాలని వుంది. ఆ టార్చిలైటు నాకిచ్చి వెళ్ళు" అన్నాడు.

కృష్ణమూర్తి ఒంటిగా గదిలోకి రాగానే "ఆయన ఏరీ?" మరిదిని అడిగింది కమల.

"ఈ రాత్రికి ఉయ్యాల బల్లమీద పడుకుంటాడట" అన్నాడు కృష్ణమూర్తి.

"అయ్యయ్యో ఒంటిగానా! మొండి మనిషి. మా నాయనవు కదూ! నువ్వు వెళ్ళి ఆయనకి తోడుండు బాబూ!" అంది కమల.

"ఆ ఉయ్యాల బల్ల సంగతి పొద్దున్న ఆరా తీయవచ్చు. ఇద్దరూ వచ్చి యిక్కడే పడుకోండి" అన్నది సావిత్రి.

"మీ బావగారు యింకొకరి మాట వింటే యింకేం" అన్నది కమల.

"నేనూ వెళ్ళి ఉయ్యాల బల్లమీద పడుకుంటాను. మీరిద్దరూ యీ గదిలో పడుకోగలరా?" అడిగాడు కృష్ణమూర్తి.

ఇద్దరు స్త్రీలూ తలలు ఊపారు. కృష్ణమూర్తి వెళ్ళిపోయాడు.

"ఎవరది?" అడిగాడు శ్రీనివాసరావు.

"నేనే అన్నయ్యా!"

"మళ్ళీ ఎందుకు వచ్చావ్?"

కృష్ణమూర్తి నవ్వి "నిన్ను ఒంటరిగా ఇక్కడ పడుకోనివ్వడానికి వీల్లేదని వదిన ఆర్డర్ వేసింది" అన్నాడు.

అన్నదమ్ములిద్దరూ ఉయ్యాల బల్లమీద పడుకున్నారు. భయమనేది యిద్దరికీ తెలియదు. దెయ్యాల్లో యిద్దరికీ నమ్మకంలేదు. కాసేపట్లో ఇద్దరూ నిద్రపోయారు.

కృష్ణమూర్తి ఉలిక్కిపడి నిద్రలేచాడు. తనెక్కడున్నదీ తెలుసుకునేందుకు రెండు క్షణాలు పట్టింది అతనికి. కటిక నేలమీద పడున్నాడు. ఉయ్యాల బల్లమీదనించి కిందపడ్డాడు. అందుకే మెలుకువ వచ్చింది.

"అన్నయ్యా!" అంటూ లేచాడు కృష్ణమూర్తి. తలకి ఊగుతూ వచ్చిన ఉయ్యాల బల్ల దభీమని కొట్టుకుంది. కృష్ణమూర్తి ఒక్కకేక పెట్టాడు.

శ్రీనివాసరావుకూడా నేలమీద పడున్నాడు. తమ్ముడి కేక విని ఉయ్యాల బల్ల తగిలి ఉండాలని గ్రహించి, ఆ బల్ల తన వైపుకి రాగనే పట్టుకుని ఆపాడు. తర్వాత లేచి టార్చిలైటు కోసం వెతికాడు. టార్చిలైటు కూడా కిందపడి వుంది. తీసి స్విచ్ నొక్కాడు. వెలగలేదు. కిందపడడంవల్ల చెడిపోయింది.

"ఎవరది? ఏమిటాగొడవ?" వెంకటరత్నం తలుపు దగ్గర నిలబడి అడిగాడు.

"నేనే, శ్రీనివాసరావుని. వెంటనే దీపం తీసుకురా" అన్నాడు శ్రీనివాసరావు.

"ఏం జరిగింది? కేక పెట్టింది ఎవరు?" అడిగాడు వెంకటరత్నం.

"ప్రశ్నలు తర్వాత వేద్దువుగాని, ముందు దీపం తీసుకురా" విసుగ్గా చెప్పాడు శ్రీనివాసరావు.

వెంకటరత్నం బుడ్డి దీపం తీసుకుని క్షణంలో తిరిగి వచ్చాడు. అతని వెనకే ఆయన భార్య అహల్య వచ్చింది.

"ఏమిటి అన్నయ్యా! ఏం జరిగింది?" అడిగింది అహల్య శ్రీనివాసరావుని అని చెల్లెలికి చెప్పాడు శ్రీనివాసరావు. నేలమీద పడున్న కృష్ణమూర్తిని సమీపించి మోకాళ్ళ మీదికి ఒంగి పరీక్ష చేసి "మేడమీదికి వెళ్ళి మీ వదిన నడిగి నా బాగ్ తీసుకురా" అన్నాడు.

"నేనా? ఉహూ! భయంతో చస్తున్నాను" అన్నది ఆమె.

"పోనీ నువ్వు వెళ్ళు బావా! అహల్యా నువ్వు ఆ ఉయ్యాల బల్ల కదలకుండా పట్టుకో" అన్నాడు శ్రీనివాసరావు. వెంకటరత్నం మేడమీదికి వెళ్ళాడు.

"ఉయ్యాల బల్ల పట్టుకోవడం దేనికి?" అడిగింది అహల్య ఉయ్యాలని పట్టుకుంటూ.

"తర్వాత చెపుతాను" అన్నాడు శ్రీనివాసరావు. ఉయ్యాల బల్ల తనంతట అదే కదులుతోందని అప్పటికీ శ్రీనివాసరావుకి నమ్మకం లేదు. కానీ జాగ్రత్తపడుతున్నాడు.

"చెల్లాయ్! చెల్లాయ్" అని తలుపు తట్టాడు వెంకటరత్నం. ఆ తోడికోడళ్ళిద్దరూ నిద్రపోలేదు. మెలుకువగానే పడుకున్నారు. దభీమన్న చప్పుడూ, కేకా విన్నారు. ఇద్దరి ప్రాణాలూ ఎగిరిపోయాయి. ఒకర్ని ఒకరు గట్టిగా కావలించుకున్నారు. గజగజా వొణుకుతున్నారు.

వెంకటరత్నం కంఠస్వరం వినగానే యిద్దరికీ ప్రాణాలు లేచి వచ్చాయి. ఇద్దరూ వెళ్ళి తలుపు తీశారు.

"బావ తన బాగ్ తెమ్మన్నాడు" అన్నాడు వెంకటరత్నం.

"ఏమైంది? ఎవరా కేక పెట్టింది?" అడిగింది కమల.

"కృష్ణమూర్తికి దెబ్బ తగిలిందనుకుంటాను" అన్నాడు వెంకటరత్నం.

"అయ్యో, అయ్యో! అన్నయ్యా! నేను కూడా వస్తాను. అక్కయ్యా! పిల్లల్ని కొంచెం చూసుకో" అన్నది సావిత్రి.

"ప్రాణం పోయినా నేను ఒంటిగా ఉండను" అన్నది కమల.

"ఏమిటర్రా! ఇంట్లో దెయ్యాలున్నట్లు మీకెందుకీ భయం. నేను పిల్లల్ని చూస్తుంటాను. మీరిద్దరూ త్వరగా వెళ్ళండి. బావకి బాగ్ కావాలిట" అన్నాడు వెంకటరత్నం.

కమల బల్లమీదున్న బాగ్ తీసుకుంది. తలుపు వరకూ వెళ్ళి బైట చీకటిగా ఉండటం చూసి తటపటాయించింది.

"ఈ దీపం తీసుకువెళ్ళండి" అన్నాడు వెంకటరత్నం నవ్వుతూ.

"నువ్వు చీకట్లో పిల్లలతో అన్నది కమల.

"ఫర్వాలేదులే. పిల్లల్ని ఎవరూ ఎత్తుకుపోరు" అన్నాడు వెంకటరత్నం.

సావిత్రి దీపం పుచ్చుకుని, కమల బాగ్ పుచ్చుకుని మెట్లు దిగారు.

## 3

"పెద్ద దెబ్బ తగలలేదు. ఇంకో అయిదు నిమిషాలలో తెలివి వస్తుంది. దెబ్బకన్నా షాక్ ఎక్కువ" అన్నాడు శ్రీనివాసరావు.

అప్పటికి యింట్లో వాళ్ళందరూ ఉయ్యాల బల్ల వున్న పెద్ద గదిలో గుమికూడారు. గదిలో ఒక పక్కగా చాపపరిచి పిల్లల్ని పడుకోపెట్టారు. నిద్రలేచిన పిల్లలు యీ గొడవంతా ఏమిటో అర్థంకాక కళ్ళు పెద్దవి చేసి చూస్తున్నారు పెద్దవాళ్ళని. వెంకటరత్నం కూడా వచ్చాడు.

"ఇంతకీ యిది దెయ్యం పనేనంటావా అన్నయ్యా! నాన్నగారు దెయ్యమై వచ్చారంటావా?" అడిగాడు వ్యంగ్యంగా ఆఖరి తమ్ముడు సుధాకర్ శ్రీనివాసరావుని.

సుధాకర్‌కి యిరవై ఎనిమిదేళ్ళు. సన్నగా, పొడుగ్గా ఉంటాడు. ఒక దినపత్రిక కార్యాలయంలో సబ్ ఎడిటర్. అతని భార్య సీతకి యిరవై ఏళ్ళు. బి.ఎ పాసయింది. ఒక వార పత్రికలో స్త్రీల ప్రత్యేక శీర్షిక నిర్వహిస్తోంది. వాళ్ళకి పిల్లలు లేరు. కృష్ణమూర్తి తర్వాత వాడూ, సుధాకర్ కన్నా పెద్దవాడూ అయిన ప్రభాకరరావు తమ్ముణ్ణి కోపంగా చూశాడు.

"దెయ్యమో కాదో నాకు తెలియదు. జరిగిన విషయాలు చెప్పాను" అన్నాడు శ్రీనివాసరావు.

శ్రీనివాసరావు రెండో చెల్లెలు వసంత. ఆమె భర్త సుందరరావు జేబులోంచి సిగిరెట్ తీసి వెలిగించి "అదికాదు బావా! మీరిద్దరూ ఆ ఉయ్యాల బల్లమీద ఎందుకు పడుకున్నారు? ఎవరూ లేనిదే అది అలా ఊగుతూ కీచుకీచుమంటూంటే బల్లని గొలుసులనించి ఊడతీసేసి కింద పెడితే సరిపొయ్యేదికదా!" అన్నాడు. సుందరరావు నెల్లూరులో ఒక కాలేజీలో లెక్చరర్. అతనికి ముప్పయినాలుగేళ్ళు.

శ్రీనివాసరావు చిన్నగా నవ్వి "నిజానికి అది మాకు స్ఫురించలేదు. హోల్డాలు బెల్టుతో తలుపుకి కట్టేస్తే, ఊడదీసుకుని ఊగిన ఉయ్యాల బల్ల గొలుసులు ఊడతీసి కింద పెడితేమటుకు గొలుసు తగిలించుకుని మళ్ళీ ఊగదని నిర్ధారణ ఏమిటి? అయిన అదీ చూద్దాం. ఆ బల్ల ఊడదీసి అవతల పెట్టెయ్యండి" అన్నాడు.

వెంటనే మూడో చెల్లెలు దుర్గ భర్త రామచంద్రరావూ, సుందరరావూ కలిసి ఉయ్యాలబల్లని గొలుసుల నించి ఊడతీసి గోడకి ఆనించి పెట్టారు. ఆడవాళ్ళు ఆ బల్లకి వీలయినంత దూరంగా జరిగారు.

"నేను నమ్మను. ఆయన దెయ్యమై రావడం ఏమిటి కిష్టిగాడిని తలమీద అంత దెబ్బకొట్టడమేమిటి?" అన్నది ఆ ఎనిమిది మందినీ కన్నతల్లి అరవైరెండేళ్ళ మహలక్ష్మమ్మ.

వంటావిడ సుబ్బమ్మ, దాసీది లచ్చి, పనివాడు వీరయ్యకూడా తలుపుకి అవతల నిలబడ్డారి.

"ఏమోనమ్మా! ఏం చెపుతాం? వెనక తెనాలిలో గుడిపాటి వారింట్లో యిలాగే జరిగిందట. అర్ధరాత్రి వేళ - అని ఆమె యింకా ఏమో చెప్పబోతుంటే "చాలు, చాలు. పిల్లలు దడుచుకుంటారు" అని గదమాయించింది కమల.

సరిగా ఆ సమయానికి కృష్ణమూర్తి కళ్ళు తెరిచాడు. పక్కనే కూర్చుని విసురుతున్న సావిత్రి "లేచారండీ భావగారూ!" అన్నది శ్రీనివాసరావుని ఉద్దేశించి.

వెంటనే శ్రీనివాసరావు తమ్ముడి దగ్గరికి వచ్చి నాడి పరీక్ష చేసి "యు ఆర్ ఆల్ రైట్" అన్నాడు తమ్ముడితో.

"ఏం జరిగింది?" అడిగాడు కృష్ణమూర్తి.

"ఇద్దరం ఉయ్యాలమీంచి కింద పడ్డాం. నువ్వు లేచావు. ఉయ్యాలబల్ల నీ తలకి తగిలింది. అంతే" అన్నాడు శ్రీనివాసరావు.

"మీరిద్దరూ పడుకునుండగా ఉయ్యాల బల్ల కదిలి ఉండాలి" అన్నాడు సుధాకర్.

"అసలు ఎట్లా పడ్డారు? ఎందుకు పడ్డారు?" అడిగాడు ప్రభాకరరావు.

"పక్కకి దొర్లి వుంటారు" అన్నాడు సుందరరావు.

"ఒకరు దొర్లి కిందపడితే పడవచ్చు. కానీ ఎవరో తోసినట్లు యిద్దరూ ఒకేసారి ఎందుకు పడతారు?" అడిగాడు వెంకటరత్నం.

"ఒకరు పడినపుడు ఉయ్యాల బల్ల అటువైపు ఒదిగి ఉంటుంది. వెంటనే బాలన్స్ పోయి రెండవ వైపుకి ఒరిగి అవతల పడుకున్న మనిషీ పడుండాలి. అంతే" అన్నాడు సుధాకర్.

"అలాగే జరిగిందనుకున్నా ఉయ్యాల బల్ల ఊగి వచ్చి కృష్ణమూర్తికి ఎలా తగిలింది?" అడిగాడు ప్రభాకరరావు.

"సింపుల్. ఉయ్యాల బల్లమీదనించి నువ్వు దిగితే ఆ కదలికకి ఉయ్యాల బల్ల ఊగుతుందా లేదా! అలాగే యిద్దరూ పడగానే ఆ కుదుపుకి ఉయ్యాల బల్ల ఊగింది" అన్నాడు సుందరరావు.

"అటువంటి సమాధానాలు తెలివిగా కల్పించవచ్చుగానీ అవి సరిపోవు. ఈ రాత్రి జరిగిన సంఘటనలకి రెండే సమాధానాలున్నాయి. ఒకటి మానవాతీతమైన శక్తి ఏదో, దెయ్యమే అను, భూతమే అను, దేవతే అను అదేదో యీ పని చేసి ఉండాలి. లేదా యీ యింట్లో ఉన్న వాళ్ళల్లో ఎవరో ఒకరు చేసి ఉండాలి" అన్నాడు శ్రీనివాసరావు.

"అదేమిట్రా శీనూ! ఈ యింట్లో ఉన్నవాళ్ళు ఎందుకు చేస్తారు? విచిత్రంగా మాట్లాడుతున్నావే" అన్నది మహలక్ష్మమ్మ.

"ఎవరు చేశారు? మనిషా? దెయ్యమా అనేది అంత సులభంగా తేలదు. ఇంకా కనిపెట్టాలి. ఇప్పుడు చర్చించి ప్రయోజనం లేదు" అని చేతి గడియారం చూసుకుని "నాలుగయింది. ఉయ్యాల బల్ల ఊడతీశాం కనుక యీ రాత్రికి యిక ఊగదని ఆశిద్దాం. మనం వెళ్ళి కాసేపయినా నిద్రపోతే పొద్దున్నే విచారించవచ్చు" అన్నాడు శ్రీనివాసరావు.

అందరూ వాళ్ళ వాళ్ళ గదుల్లోకి వెళ్ళిపోయారు. కృష్ణమూర్తినీ, అతని భార్యనీ, పిల్లలనీ ఆ రాత్రికి తన గదిలో పడుకోమన్నాడు శ్రీనివాసరావు.

# 4

''**కాఫీ** అయిందా సుబ్బమ్మా?'' అంటూ రాధ వంట యింట్లోకి వెళ్ళింది.

వేడి నీళ్ళు ఫిల్టర్లో పోస్తున్న సుబ్బమ్మ తలెత్తి రాధని చూసి ''ఇంత తెల్లారే లేచావేం అమ్మా! సామాన్యంగా బాగా పొద్దెక్కితే కానీ నిద్రలేవవు'' అన్నది నవ్వుతూ.

''రాత్రి జరిగిన గొడవ తర్వాత నిద్రపడితేగా'' అంటూ పీట లాక్కుని కూర్చున్నది రాధ.

రాధకి యిరవై ఏళ్ళు. హైదరాబాదులో మెడిసిన్ చదువుతోంది. తండ్రికి చాలా ప్రమాదంగా వుందని ఉత్తరం రాగానే బయలుదేరి వచ్చింది. సుబ్బమ్మకి రాధని చూస్తే చాలా ముద్దు. ఆమె కళ్ళకి రాధ ఇంకా చంటిపిల్లే. సుబ్బమ్మ ఆ యింట్లో వంట చెయ్యడానికి యిరవై ఏళ్ళ క్రితం రావడం, రాధ పుట్టడం అంతా వారం రోజుల తేడాలో జరిగింది. రాధ ఎక్కువగా సుబ్బమ్మ దగ్గరే పెరిగింది.

రాధ ఎర్ర అంచు తెల్ల మిల్లు చీర కట్టుకుని, గులాబీ రంగు జాకెట్టు వేసుకున్నది. చెదిరిన జుట్టు, గోధుమరంగు ఒళ్ళు. అందమైన విగ్రహం. కళకళలాడే మొహం.

''రాత్రి జరిగిన విషయం గురించి నువ్వేమంటావు సుబ్బమ్మా?'' అడిగింది రాధ కాఫీ గ్లాసు అందుకుంటూ.

''ఏమోనమ్మా! పట్నవాసం వాళ్ళు, చదువుకున్న వాళ్ళు మీకు తెలియాలిగాని నాకేం తెలుస్తుంది'' అన్నది సుబ్బమ్మ.

''దెయ్యమని నేను నమ్మను. ఒకవేళ దెయ్యాలున్నాయని ఒప్పుకున్నా నాన్నగారు దెయ్యమై ఎందుకు వస్తారు? వచ్చినా అమ్మ అన్నట్టు కిట్టు అన్నయ్యని ఎందుకు అంత దెబ్బ కొడతారు? వాడంటే చాలా యిష్టం నాన్నకి'' అన్నది రాధ.

''ఆ మహారాజు కళ్ళు మూసే సమయానికి పక్కన లేకుండా క్రిష్ణమూర్తి పెళ్ళాంతో కీచులాడుతూ తన గదిలో వున్నాడుగదా!'' అన్నది సుబ్బమ్మ మరి కాసిని నీళ్ళు పొయ్యి మీద పెడుతూ.

అప్పటికి బాగా తెల్లవారింది. యేడాది పిల్లవాణ్ణి చంకనేసుకుని వంట యింట్లోకి వచ్చింది వసంత.

''ఏమే రాధా! అప్పుడే లేచావ్ రాత్రంతా నిద్రలేదుకదా! నా కయితే తప్పదు. వీడు లేచి ఏడ్వడం ప్రారంభించాడు. కాసిని పాలు కాచియ్యి సుబ్బమ్మా!'' అంటూ వసంత యింకో పీట లాక్కుని కూర్చున్నది.

అంతలో గణగణమంటూ గంట మోగింది. చెవులు చిల్లులు పడేటట్లు మోగడం ప్రారంభించింది. ఆ అక్కచెల్లెళ్ళిద్దరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. స్వర్గస్తులైన వాళ్ళ తండ్రి పూజా సమయం అది. ఆయన బతికుండగా సరిగా ఆ సమయానికి పూజ గదిలో అలాగే గంట మోగేది.

''ఎవరు పూజ చేస్తున్నది?'' అన్నది వసంత.

''సుందరం బావేమో..'' అన్నది రాధ కొంటెగా నవ్వుతూ.

సుందరరావు నాస్తికుడనీ, కమ్యూనిస్టు సిద్ధాంతాల ప్రభావానికి గురి అయిన వాడనీ తెలుసు ఆమెకి.

''ఆయనా!? సరి సరి. కృశ్చేవ్ వచ్చినా కాఫీ తాగందే కదలరు'' అన్నది వసంత.

''ఎవరో వెళ్ళి చూద్దాం పద'' అన్నది రాధ.

''నేను రాను. నువ్వు వెళ్ళి చూడు ధైర్యముంటే.''

''అంత పిరికిదానివేమిటి?'' అంటూ రాధ లేచి వెళ్ళింది.

రాధ వెళ్ళగానే గంట మోగడం ఆగిపోయింది. రెండు నిముషాల తర్వాత రాధ తిరిగి వచ్చింది.

"ఎవరు?" అడిగింది వసంత రాధని.

"పూజ గదిలో ఎవరూ లేరు" అన్నది రాధ కూర్చుంటూ.

రాధ కూర్చున్నదో లేదో గంట మళ్ళీ గణగణ మోగడం ప్రారంభం అయింది.

"పూజ గదిలో కాదేమో!" అన్నది వసంత పిల్లాడికి పాలు పడుతూ.

"శబ్దం అటునించేగా వస్తున్నది?" అంటూ రాధ చివాలున లేచి పరిగెత్తింది. వంట యింటి గుమ్మం దాటిందో లేదో గంట మోగడం మళ్ళీ ఆగిపోయింది. మునిపళ్ళతో కింది పెదిమ కొరికి పట్టుకుని, అడుగులో అడుగు వేసుకుంటూ నడిచింది రాధ. వంట గది, భోజనాల గది దాటి నడవాలోంచి వెళితే అవతల వుంది పూజ గది. పూజ గది కిటికీలు వేసి ఉన్నాయి. తలుపు దగ్గరికి వేసి వుంది. రాధ తలుపు తెరిచింది. లోపల చీకటిగా వుంది. కిటికీ తెరిచింది. గదిలోకి కొంచెం వెలుగు వచ్చింది. తిన్నగా పూజామందిరం దగ్గరికి వెళ్ళింది. దేవుడి విగ్రహానికి పక్కగా వున్న గంటని పరీక్షగా చూసింది. ఓసారి గదంతా కలయ చూసింది. ఆ గంట తీసుకుని గదిలోంచి బయటికి వచ్చింది. తలుపు దగ్గరకు వేసి కిటికీ మూసి వంట యింటివైపు నడిచింది.

రాధని ప్రశ్నార్థకంగా చూశారు సుబ్బమ్మా, వసంతా.

రాధ నవ్వుతూ "ఎవరూ లేరు. గంట తెచ్చేశాను" అన్నది గంట పీట మీద పెట్టి, కూర్చుని.

మళ్ళీ గంట గణగణ మోగడం వినిపించింది.

ఉలిక్కిపడి ముగ్గురూ పీటమీద వున్న గంటని చూశారు. పెట్టినది పెట్టినట్లే వున్నది. మోగడం లేదు. దూరాన్నించి, పూజా మందిరంవైపు గంట గణగణ మోగుతున్నది.

అంత ధైర్యస్తురాలయిన రాధకి కూడా అనిర్వచనీయమయిన భీతి ఏదో కలిగింది. ఆ ముగ్గురు స్త్రీలూ ఒకర్ని ఒకరు చూసుకున్నారు.

"నాన్నగారి తర్వాత సాంప్రదాయం నిలబెడుతూ పూజ చేస్తున్న ఆ వంశోద్ధారకుడెవరు?" అంటూ క్రిష్ణమూర్తి వంట యింట్లోకి వచ్చాడు. అతని తలకి కట్టివున్న కట్టును చూడగానే ఆ ముగ్గురు ఆడవాళ్ళ భయం మరింత ఎక్కువయింది. జరిగింది విపులంగా చెప్పింది రాధ.

"ఇదిగో గంట, తెచ్చేశాను అన్నయ్యా!" అన్నది.

"శెభాష్! మెడికోవి. ఆ మాత్రం సాహసం వుండాలి" అంటూ వెనక్కి తిరిగాడు క్రిష్ణమూర్తి.

"ఉండు అన్నయ్యా! నేను కూడా వస్తాను" అంటూ రాధ ఛెంగున లేచి పరిగెత్తింది. అన్నా, చెల్లెలూ పూజగదివైపు వెళ్ళారు. నడవా వరకూ వెళ్ళారో లేదో గంట మోగడం ఆగిపోయింది. ఆ గణగణ ధ్వని పూజ గదిలోంచే వచ్చింది. సందేహం లేదనిపించింది యిద్దరికీ. క్రిష్ణమూర్తి పూజగది తలుపు తీశాడు. రాధ కిటికీ తెరిచింది. ఇద్దరూ ఆశ్చర్యంతో పూజామందిరం వైపు చూస్తూ తలుపు దగ్గర నిలబడ్డారు

పూజా మందిరంలో విగ్రహం పక్కన యింకో గంట తళతళ మెరుస్తోంది.

"విచిత్రంగా వుంది" అన్నది రాధ.

"రెండు గంటలున్నాయేమో!" అన్నాడు క్రిష్ణమూర్తి.

"లేదు అన్నయ్యా! నేను చూశానుగా! ఒకటే వుంది" అన్నది రాధ బయటికి వచ్చేస్తూ.

"మీరిద్దరూ యిక్కడేం చేస్తున్నారు?" అని వాళ్ళ సమాధానం వినకుండానే "తెల్లారే ఎవరు ఉయ్యాల బల్ల మళ్ళీ గొలుసులకి తగిలించింది?" అడిగాడు కొంచెం కోపంగా శ్రీనివాసరావు తమ్ముణ్ణి, చెల్లెల్నీ చూసి.

"ఉయ్యాల బల్ల మళ్ళీ గొలుసులకి తగిలించారా? నేను కాదు, రాధా కాదు" అంటూ క్రిష్ణమూర్తి పూజా గంట గణగణ మోగడం గురించి అన్నకి చెప్పాడు.

"ఆశ్చర్యంగానే వుంది. ఇంట్లో వాళ్ళెవరయినా యింకో గదిలో పూజ చేస్తూ వుండి వుండవచ్చు. ఎవరో ఉయ్యాల బల్లని మళ్ళీ గొలుసులకు తగిలించి వుండవచ్చు. కాఫీ తాగి యీ విషయం ఆరా తీయాలి" అన్నాడు శ్రీనివాసరావు.

నేను కాఫీ తాగేశాను. మీరిద్దరూ వెళ్ళి తాగండి. నేను వెళ్ళి అందర్నీ అడుగుతాను" అన్నది రాధ.

అన్నదమ్ములిద్దరూ తలలు వూపి వంట యింటివైపు వెళ్ళారు.

రాధ ముందు తన తల్లి గదిలోకి వెళ్ళింది. మహలక్ష్మమ్మ కళ్ళు తెరుచుకునే పక్కమీద పడుకునున్నది.

"అమ్మా! నువ్వు పూజ చేశావా?" అడిగింది రాధ.

"పూజా? నేనా?" అన్నది ఆ వృద్ధురాలు ఆశ్చర్యంతో.

"ఊరికినే అడిగానులే" అంటూ యింకేమీ ప్రశ్నలు వెయ్యకుండా రాధ ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. ఉయ్యాల బల్ల విషయం తల్లిని అడగడం అనవసరం అనుకుంది. తర్వాత పెద్దక్క అహల్య గదిలోకి వెళ్ళింది.

"అక్కయ్యా?"

"గడియ తీసేవుంది" అన్నాడు వెంకటరత్నం.

రాధ తలుపు తోసింది. వెంకటరత్నం అద్దం ముందు నిలుచుని గడ్డం గీసుకుంటున్నాడు.

"మీ అక్క లేకుండా చూసి తెల్లారే యిలా వచ్చావేం మరదలు పిల్లా?" అన్నాడు అతను నవ్వుతూ.

"అక్కయ్య ఏదీ?" అడిగింది రాధ.

"పిల్లవాణ్ణి తీసుకుని పెరట్లోకి వెళ్ళింది. ఏమిటి విశేషం?" అడిగాడు మీసాలు వంకరపోకుండా జాగ్రత్తగా గీసుకుంటూ.

"నువ్వు యివేళ పొద్దున్న లేచి పూజ చేశావా?" అడిగింది రాధ.

"నేనా! పూజా! బావుంది జోక్."

"పోనీ యింకెందుకయినా ఏదయినా గంట మోగించావా?"

"గంట మోగించి ఆడుకోవడానికి చంటివాణ్ణనుకున్నావా? ఏమిటి యీ ప్రశ్నలు?"

"అక్కయ్య పూజ చేసిందా? గంట మోగించిందా?"

"మీ అక్కయ్య యమబద్ధకస్తురాలని నీకు తెలియదా? ఇప్పుడే నిద్రలేచింది."

"పోనీ పిల్లలు ఎవరైనా గంటలతో ఆడుకున్నారా?"

"చంటిది ఇంకా నిద్రపోతోంది. బుజ్జిగాడు ఇప్పుడే లేచాడు. ఆడుకునే మూడ్‌లో లేడు. ఏడుపు మూడ్‌లో వున్నాడు."

"ఉయ్యాల బల్ల నువ్వు గొలుసులకి తగిలించావా బావా?" అడిగింది రాధ.

"పోలీసు ఇన్‌స్పెక్టర్ మల్లే ప్రశ్నలు వేస్తున్నావు. నేను ఉయ్యాల బల్ల వున్న గదివేపు వెళ్ళనే లేదు కానీ అసలు విషయం ఏమిటో చెప్పు" అడిగాడు వెంకటరత్నం.

రాధ జరిగిన విషయాలు క్లుప్తంగా చెప్పింది.

''విచిత్రంగానే వుంది'' అన్నాడు వెంకటరత్నం.

రాధ మేడమెట్లెక్కింది. మెట్లకి పక్కన వున్న గది రాధ రెండో అన్నయ్య ప్రభాకరరావు గది.

''ప్రభన్నయ్యా!'' రాధ నెమ్మదిగా తలుపు తట్టింది. జవాబు వినిపించలేదు. కానీ తలుపు తట్టగానే కదిలింది. దగ్గరికి వేసి వుందని గ్రహించి రాధ తలుపు తోసింది. తలుపు తెరుచుకుంది. పెద్ద పందిరి మంచం మీద లక్ష్మి చెరో పక్క చెరో పిల్లని పడుకోపెట్టుకుని యింకా నిద్రపోతోంది. లేపుదామా వద్దా అని సందేహిస్తూ తలుపు దగ్గరే నిలబడ్డది రాధ.

శ్రీనివాసరావు, క్రిష్ణమూర్తి సుబ్బమ్మ ఇచ్చిన కాఫీ గ్లాసులు అందుకున్నారు.

''ఏమిటి బావా! మళ్ళీ గొడవ ప్రారంభం అయిందిట. రాధ చెప్పింది'' అంటూ వెంకటరత్నం అక్కడికి వచ్చాడు.

''అవును. విచిత్రంగానే వుంది. కాఫీలయ్యాక అందరం సమావేశమై యీ విషయం తేల్చాలి'' అన్నాడు శ్రీనివాసరావు.

''ఏం తేలుస్తాం?'' అడిగాడు క్రిష్ణమూర్తి.

''ఈ సంఘటనలకి కారణం తెలుసుకోవాలి. మనింట్లో దెయ్యం వుందన్న పుకారు బయలుదేరితే వూరికే యిచ్చినా యీ యిల్లు తీసుకునే వారుండరు'' అన్నాడు శ్రీనివాసరావు.

''ఈ ఇల్లు వూరికే ఇవ్వడం దేనికి?'' అంటూ ప్రభాకరరావు పెరట్లోనించి భోజనాల గదిలోకి వచ్చాడు.

''రేపు కర్మ కాగానే ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతాం. ఇంత యిల్లు నీకు ఎందుకు?'' అన్నాడు శ్రీనివాసరావు.

''ఇంతకు ముందు మాత్రం ఎవరన్నా వున్నారు గనుకా! ఇప్పుడు తక్కువయింది నాన్నగారొక్కరేగా!'' అన్నాడు ప్రభాకరరావు .

అంతలో ఎవరో గొంతుపట్టి నలిపేస్తున్నట్టు కెవ్వుమని కేక వినపడింది. శ్రీనివాసరావు, క్రిష్ణమూర్తి, ప్రభాకరరావు, వెంకటరత్నం కేక వినిపించిన వైపు పరిగెత్తారు.

''మేడమీద నించి వచ్చింది కేక'' అన్నాడు క్రిష్ణమూర్తి పరిగెత్తుతూ.

నలుగురూ దబదబ మెట్లు ఎక్కారు. ప్రభాకరరావు గది తలుపు దగ్గర నేలమీద పడివున్న రాధని చూశారు.

క్రిష్ణమూర్తి నేలమీద కూలబడి, చెల్లెలి తల వొళ్ళో పెట్టుకున్నాడు. ప్రభాకరరావు గదిలోకి పరిగెత్తాడు తన భార్యా పిల్లల గురించిన ఆదుర్దాతో.

బావురుమని ఏడుస్తున్నారు ఇద్దరు పిల్లలూ. మంచం మధ్య కళ్ళు పెద్దవి చేసి, నోరు తెరుచుకుని మట్టిబొమ్మలా కూర్చునున్నది లక్ష్మి.

''ఏం జరిగింది?'' అడిగాడు ప్రభాకరరావు భార్యని.

శ్రీనివాసరావు రాధ నాడి పరీక్ష చేస్తూ, లక్ష్మి జవాబు కోసం అటు చూశాడు. లక్ష్మి నోట్లోంచి మాట పెగలలేదు. తల తిప్పి మంచం పక్కన వున్న బల్లని చూపించింది.

అందరూ అటు చూశారు. అందరి మొహాలు నెత్తురు చుక్కలేకుండా పాలిపోయాయి.

బల్లమీద అందమైన గాజు పూల సజ్జ వుంది. ఆ పూల సజ్జలో పూలులేవు. రెండు పొడుగాటి ఎముకలు చెరొక వైపుకి వొంగి వున్నాయి. ఆ రెండు ఎముకల మధ్య మనిషి పుర్రె వికృతంగా, భయంకరంగా ఆడుతోంది.

క్రిష్ణమూర్తి గబగబా ఆ బల్ల దగ్గరికి వెళ్ళాడు. పూల సజ్జలోకి చూశాడు. ''నీళ్ళు లేవు. ఎర్రగా'' అని ఆగిపోయాడు.

''రక్తమా?'' అడిగాడు శ్రీనివాసరావు.

''అలాగే కనబడుతోంది'' క్రిష్ణమూర్తి హీన స్వరంలో జవాబు చెప్పాడు.

శ్రీనివాసరావు చకచక ఆ బల్ల దగ్గరికి వెళ్ళి పూల సజ్జలో వేలు పెట్టాడు. వేలుకి ఎర్రగా అంటింది. పరీక్షగా చూసి ''రక్తం కాదు. కుంకం నీళ్ళు. ఈ పూల సజ్జని యిక్కణ్ణించి తీసెయ్యి వెంకటరత్నం. కిట్టూ! రాధని నా గదిలోకి తీసుకువెళదాం. సాయం పట్టు. బెదిరిపోయింది. అంతే'' అన్నాడు.

నుదుటి మీద ఉడుకులామ్ చల్లి, స్మెల్లింగ్ సాల్టు వాసన చూపించిన కాసేపటికి రాధ కళ్ళు తెరిచింది.

''అన్నయ్యా! ఆ పూల సజ్జలో -?'' అన్నది శ్రీనివాసరావుని చూసి.

''ఛ, ఛ మెడికోవి. పుర్రెనీ, ఎముకలనీ చూసి దడుసుకుంటే ఎలా చెప్పు'' అన్నాడు శ్రీనివాసరావు చెల్లెల్ని బుజ్జగిస్తూ.

''ఆ పుర్రె వికృతంగా వూగడం ప్రారంభించింది. లక్ష్మి వొదినా, పిల్లలు''

''క్షేమంగానే వున్నారు. లే, నువ్వూ నేనూ కలిసి ఆ ఎముకలని పరీక్ష చేద్దాం'' అన్నాడు శ్రీనివాసరావు.

రాధ కళ్ళు నలుపుకుని లేచి కూర్చున్నది. అన్నా, చెల్లెలు, యిద్దరూ ప్రభాకరరావు గదిలోకి వెళ్ళారు. గదిలో ఎవరూ లేరు. శ్రీనివాసరావు పుర్రె తీసి పట్టుకుని పరీక్ష చేశాడు. ''శ్మశానంలోంచి వచ్చి వుండాలి. ఎవరో ముసలి మనిషి పుర్రె యిది'' అన్నాడు.

రాధ పొడుగాటి ఆ ఎముకలని పరిక్ష చేసి ''ఇవి చేతి ఎముకలు'' అన్నది.

''ఇక్కడ ఒక్కళ్ళూ లేరే అందరూ ఏమైనారు?'' అడిగాడు శ్రీనివాసరావు.

''కిందకి వెళ్ళి వుంటారు'' అన్నది రాధ.

ఇద్దరూ కిందకి దిగి వెళ్ళారు. భోజనాల సావిట్లోంచి మాటలు వినిపించాయి. కొందరు కాఫీ తాగుతున్నారు. కొందరు ఉప్మా తింటున్నారు. ఇంటిల్లిపాదీ అక్కడే వున్నారు.

''ఏమ్రా! మీలో ఎవరయినా పొద్దున్నే పూజచేసి గంట మోగించారా?'' అడిగాడు శ్రీనివాసరావు.

ఎవరూ జవాబు చెప్పలేదు.

''ఎవరయినా ఉయ్యాల బల్లని మళ్ళీ గొలుసులకి తగిలించారా?'' అడిగింది రాధ.

ఆ ప్రశ్నకి ఎవరూ జవాబు చెప్పలేదు.

''ఫ్లవర్ వేజ్‌లో పుర్రె, ఎముకలు ఎవరైనా పెట్టారా అని అడిగి ప్రయోజనం లేదు. ఎవరయినా పెట్టినా పెట్టామని ఎందుకు ఒప్పుకుంటారు?'' అన్నాడు సుందరరావు ఖాళీగ్లాసు కిందపెడుతూ.

''ఇంట్లో వాళ్ళెవరయినా చేసి వుంటే కదా!'' అన్నది లక్ష్మి.

''మనలో రెండు పక్షాలు తయారయ్యాయి. ఈ విచిత్ర సంఘటనలకి మానవాతీతమైన శక్తి ఏదో కారణమని వాదించే వాళ్ళు ఇంకో పక్షం, ఇంట్లో వున్న వాళ్ళెవరో చేస్తున్నారని వాదించె వాళ్ళు ఇంకో పక్షం. ఏ పక్షానికి సంఖ్యా బలం ఎక్కువ వుందో వోట్లు వేసి చూద్దాం'' అన్నాడు వెంకటరత్నం.

''బావ మునిసిపల్ ఎలక్షన్స్‌కి నిలబడి ఓడిపోయినప్పట్నించీ ప్రతి దానికీ ఓటు వేయమంటాడు'' అన్నాడు క్రిష్ణమూర్తి నవ్వుతూ.

''వీరయ్యా! లచ్చీ'' కేక వేశాడు శ్రీనివాసరావు.

''అయ్యా!'' అంటూ వీరయ్య బావి దగ్గరినించి పలికి తలుపు వద్దకు వచ్చాడు. అతనికి కొంచెం దూరంలో నిలబడింది లచ్చి.

''నిన్న రాత్రి జరిగిన విషయాలు వూళ్ళో ఎవరికీ చెప్పకూడదు సుమా! బయటికి పొక్కకూడదు'' అన్నాడు శ్రీనివాసరావు.

''మేమెందుకు చెపుతాము అయ్యగారూ?!'' అన్నాడు వీరయ్య.

"తర్వాత కార్యక్రమం ఏమిటి?" అడిగాడు సుధాకర్.

"ఇంకా ఏం తమాషాలు జరుగుతాయో చూద్దాం" అన్నాడు శ్రీనివాసరావు.

"బావుంది. ముంచుకొచ్చేంతవరకూనా! ఎవరి ప్రాణమో పోయేంతవరకూ తాత్సారం చెయ్యడం దేనికి? భూతవైద్యుడిని వెంటనే పిలిపించడం వివేకమైన పని" అన్నది దుర్గ.

సుందరరావు, సీత నవ్వారు.

దుర్గ సీతని ఉరిమి చూసి "ఏమమ్మా వొదినా. అంత నవ్వొచ్చింది?" అన్నది. సీత జవాబు చెప్పలేదు.

ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

5

"ముందు నువ్వు స్నానం చెయ్యి, తర్వాత నేను చేస్తాను" అన్నది సావిత్రి వసంతతో. ఇద్దరూ తువ్వాళ్ళు, చీరలు తీసుకుని ఒకేసారి స్నానానికి బయలుదేరి స్నానాల గది ముందు కలుసుకున్నారు.

"నాకేం తొందరలేదు. నువ్వే చెయ్యి" అన్నది వసంత.

"ఎవరు ముందు చేస్తే ఏం లెద్దూ!" అంటూ సావిత్రి వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

అది పెద్ద స్నానాల గది. గోడకి ఒక పక్కగా పెద్ద పెద్ద గుండిగల నిండా చల్లని నీళ్ళున్నాయి. పెద్ద కాగు కింద పొయ్యి. ఇటికలూ, సున్నం పెట్టి కాగుని పొయ్యిమీద గట్టిగా బిగించి కట్టేశారు. పొయ్యిలోంచి కొద్దిగా పొగ వస్తోంది. వసంత గంగాళంలోకి వేడినీళ్ళు తోడుకుని తలుపు మూసింది. ఆ నీళ్ళ గదిలో బాగా పైన ఒక కిటికీ వుంది. అందువల్ల ఆ గదిలో అట్టే వెలుగులేదు.

"ఈ పాటి సుఖము నేనింతవరకు ఎరగనే" కూని రాగాలు తీస్తూ నీళ్ళు పోసుకోవడం ప్రారంభించింది వసంత. పొగ ఎక్కువయ్యింది. కళ్ళుమండటం ప్రారంభించాయి. స్నానం త్వరగా ముగించుకుని ఆ గదిలోంచి బయట పడదామని పాట ఆపి, గబగబా వొళ్ళు రుద్దుకుని స్నానం ముగించింది. చీర కట్టేసుకుని, తలుపు గడియ తీసి తలుపు లాగింది. తెరుచుకోలేదు. ఇంకా కొంచెం గట్టిగా లాగింది. అయినా కదలలేదు. సావిత్రి అక్కడ వున్నదేమోననుకుని "సావిత్రీ!" అని కేకేసింది. సరిగా ఆ సమయానికి వర్షంలా టపటపమని మట్టి బెడ్డలు గదిలో పడడం ప్రారంభించాయి.

కెవ్వుమని కేకేసింది వసంత. ఆగకుండా కేకలు పెట్టింది. బావురుమని ఏడ్వడం ప్రారంభించింది. ఆ అయోమయంలో తలుపు లోపల గడియపెట్టుకుంది.

ఇంట్లో ఎక్కడెక్కడున్నవాళ్ళూ పరిగెత్తారు. పరిగెత్తుతూ "ఎవరది? ఏమైంది? ఎక్కణ్ణించి ఆ కేకలు? ఎవరు?" అని ప్రశ్నలు వేసేవాళ్ళే గానీ జవాబు చెప్పేవాళ్ళు లేరు. కేకలని బట్టి స్నానాల గదిలోంచి అని గ్రహించి అటు పరిగెత్తారు అందరూ.

"ఎవరు లోపల?" కేక వేశారు అందరూ ఒక్కసారిగా.

వసంత జవాబు చెప్పే స్థితిలో లేదు. గగ్గోలు పెడుతోంది.

"వసంత అయి వుండాలి" అన్నది సావిత్రి.

గొంతు గుర్తు తెలిసే స్థితిలో లేదు వసంత.

"తలుపు బయట గడియపెట్టి వుంది. లోపల వసంత వున్నదని తెలియక ఎవరో ఈ పని చేశారు" అంటూ సుధాకర్ గడియ తీసి, తలుపు తోశాడు.

తెరుచుకోలేదు.

"వసంతా! ఏమైంది? అరవక, చెప్పు? అన్నాడు శ్రీనివాసరావు. భయంతో రెండు చేతులూ మొహానికి అడ్డం పెట్టుకుని కళ్ళు మూసుకున్నది కాని ఫ్లవర్‌వేజ్‌లో పుర్రె కళ్ళకి కట్టినట్లు కనిపించింది వసంతకి. గోడకి ఆనుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది.

రామచంద్రరావు అందర్నీ తోసుకుని ముందుకు వెళ్ళి తలుపు బలంగా తోశాడు. కదలలేదు. కాలితో ఒక తన్ను తన్నాడు. అది గట్టి తలుపు. ఒక తన్నుకి వూడిపడేది కాదు. ఈ గొడవంతా చూస్తూ నిలబడివున్న వీరయ్య పెరట్లోకి పరిగెత్తి క్షణంలో చిన్న గునపం లాక్కుని అయిదు నిమిషాలలో తలుపు విరగ్గొట్టాడు.

"వసంతా! ఏమైంది?" అడిగాడు రామచంద్రరావు.

వసంత జవాబు చెప్పలేదు. గజగజా వొణుకుతోంది. మొహానికి అడ్డం పెట్టుకున్న చేతులు తియ్యలేదు. అందరూ తలుపు అవతలే నిలబడి స్నానాల గదిలోకి చూశారు. నేలమీదంతా మట్టిబెడ్డలు పడి వున్నాయి.

"వసంతా! భయంలేదు. ఏడ్వడం మాను" అన్నాడు శ్రీనివాసరావు నీళ్ళగదిలోకి వెళ్ళి.

వసంత ఏడుపు మానలేదు. మొహానికి చేతులు అడ్డం తీయలేదు. భుజం పట్టుకుని స్నానాలు గదిలోంచి బయటికి తీసుకువచ్చాడు వసంతని.

"ఏం జరిగింది? భయంలేదు" అందరూ ప్రశ్నలు వేస్తున్నారు, ఓదారుస్తున్నారు. భోజనాల సావిట్లోకి తీసుకువచ్చాక వసంత మొహం మీద పెట్టుకున్న చేతులని బలవంతాన లాగారు. గజగజా వొణుకుతోంది. కళ్ళు మూసుకునే వుంది.

"హిస్టీరియా! మూర్ఛ వచ్చింది" అన్నాడు శ్రీనివాసరావు.

ఒకరు పరుగెత్తికెళ్ళి దిండు తీసుకొచ్చారు. వసంతని అక్కడే పడుకోబెట్టారు.

"జ్వరం కూడా వచ్చింది. ఎవరయినా వెళ్ళి నా బాగ్ పట్టుకు రండి" అన్నాడు శ్రీనివాసరావు.

## 6

**"వొదినా!** నువ్వు స్నానం చేశావా?" అడిగింది అహల్య సావిత్రిని.

"లేదమ్మా! చెయ్యాలి."

"పిల్లల్ని పెద్ద ఒదినకి ఒప్పచెప్పి యిద్దరం కలిసి చేద్దామా?" అడిగింది అహల్య.

"ఒంటిగా స్నానాల గదిలోకి వెళ్ళడానికి హడలి చస్తున్నాను, పద" అన్నది సావిత్రి.

"ఏమండీ! కాసిని పాలు కావాలి" అన్నది కమల.

"పాలా!? నన్నేం చెయ్యమంటావ్?"

"వంట యింట్లోకి వెళ్ళాలి."

"వెళ్ళు"

"కొంచెం తోడు రండి."

" పట్టపగలు ఏమిటి భయం.?"

"మీకేం మొగాళ్ళు. చీమచిటుక్కుమంటే గుండె పగిలిపోతోంది" అన్నది కమల.

"ఇద్దరం ఊరేగింపు దేనికి? నే వెళ్ళితెస్తానులే" అంటూ శ్రీనివాసరావు పడక కుర్చీలోంచి లేచాడు.

"నేను ఒంటిగా వుండను."

శ్రీనివాసరావు విసుగ్గా చూశాడు భార్యని. "ఇద్దరం వెళితే పిల్లల సంగతి? వాళ్ళని ఒంటిగా వదిలేద్దామా?"

"ప్రాణం పోయినా వీళ్ళని వొదిలి వెళతానా?"

"బావుంది. మనిద్దరం, పిల్లలు కాక సావిత్రి పిల్లలు యిద్దరు, అహల్య పిల్లలు యిద్దరు. అందరం గ్లాసుడు పాలకోసం వంట యింట్లోకి ఊరేగింపు అన్నమాట."

కమల దీనంగా చూసింది భర్తని. శ్రీనివాసరావుకి నవ్వు వచ్చింది. "ప్రభా!" కేకేశాడు శ్రీనివాసరావు.

"ఏమిటన్నయ్యా!?"

"ఓ మాటు యిలా రా!"

అవతల గదిలో వున్న ప్రభాకరరావు రావడానికి అయిదు నిమిషాలు పట్టింది. అతను ఒక్కడే రాలేదు. భార్యనీ, పిల్లల్నీ తీసుకువచ్చాడు. అన్నను చూసి నవ్వి "ఒంటిగా ఆ గదిలో వుండనన్నది" అన్నాడు.

శ్రీనివాసరావు నిట్టూర్చాడు. "అదే స్థితి ఇక్కడా. కాసేపు ఇక్కడుండు. పాలు కావాలిట. తీసుకొస్తాను."

"నువ్వెందుకు వెళ్ళడం. నే తెస్తాలే. ఆ గ్లాసు ఇలా యియ్యి వొదినా" అన్నాడు ప్రభాకరరావు.

"మీ యిద్దరి స్నానాలూ అయాయిగా. కాస్త పిల్లల్ని చూసుకుంటూండండి. నేనూ, లక్ష్మీ స్నానం చేసి వస్తాము" అన్నది కమల.

"తోడికోడళ్ళ మధ్య, ఆడబిడ్డల మధ్య యింత స్నేహం ఎన్నడూ లేదు" అన్నాడు శ్రీనివాసరావు తమ్ముడితో నవ్వుతూ.

"ఆ ఉయ్యాల వూగడం ఆగలేదు. గమనించావా అన్నయ్యా!?" సుధాకర్ క్రిష్ణమూర్తితో అన్నాడు. ఇద్దరూ వసారాలో నిలుచుని సిగిరెట్లు కాలుస్తున్నారు.

"అవును. నీళ్ళ గదిలో మట్టిబెడ్డలు పడడం ఆశ్చర్యంగా వుంది."

"ఆశ్చర్యమేముంది? ఎవరో కిటికీలోంచి వేసుండవచ్చుగా!"

"ఎందుకు వేస్తారు? వసంత అంటే గిట్టని వాళ్ళెవరు?" అన్నాడు క్రిష్ణమూర్తి.

"ఏమో?" అని ఊరుకున్నాడు సుధాకర్.

## 7

భోజనాలు అయ్యాక అందరూ వాళ్ళ వాళ్ళ గదులు చేరుకున్నారు. పెద్దవాళ్ళల్లో కలిగిన భయం పిల్లలకి కూడా పాకింది. అరుస్తూ ఆడుకునే పిల్లలు నిశ్శబ్దంగా ఉన్నారు.

"కాస్త ఉండండి. పిల్లల ఉచ్చలతో ఆ దుప్పటి తడిసింది. వేరే దుప్పటి వేస్తాను" అన్నది అహల్య వెంకటరత్నం మంచం మీద కూర్చోగానే.

"ఊఁ! త్వరగా కానీ. రాత్రంతా నిద్రలేదు" అంటూ అతను మంచం మీదనించి లేచాడు.

అంతలో రాధ వచ్చి "బాబూ! చంద్రికా! మూతులు ముడుచుకుని కూర్చున్నారేం? చిట్టీ వాళ్ళంతా నా గదిలో ఆడుకుంటున్నారు. రండి" అన్నది.

"వెళ్ళండ్రా! వెళ్ళి ఆడుకోండి" అన్నాడు వెంకటరత్నం. ఇద్దరు పిల్లలూ రాధ చెరొక చెయ్యి పట్టుకుని వెళ్ళిపోయారు.

"అహల్యా! ఇవాళిటి పేపరు ఎవరి దగ్గరున్నదో తెలుసా?" అడిగాడు భార్యని వెంకటరత్నం.

"ఇందాక పెద్ద అన్నయ్య చేతిలో చూశాను" అన్నదామె. వెంకటరత్నం గదిలోంచి బయటికి వెళ్ళాడు. మేడమీదికి వెళ్ళి శ్రీనివాసరావు దగ్గర పత్రిక తీసుకుని తిరిగి వస్తుండగా వసారాలోంచి హాల్లోకి వస్తున్న క్రిష్ణమూర్తి, సుధాకర్ ఎదురయ్యారు.

"ఏమిటి? అన్నదమ్ములిద్దరూ కలిసి గూడుపుఠాణి చేస్తున్నారు?" అన్నాడు వెంకటరత్నం నవ్వుతూ.

"ఈ పనులు చేస్తున్నది మనిషా, దెయ్యమా అని చర్చిస్తున్నాము" అన్నాడు సుధాకర్.

"ఊరికే చర్చించి ప్రయోజనం ఏమిటి? ఆ ఉయ్యాల బల్ల కదలకుండా ఏర్పాటు ఏమైనా చేయకూడదూ? పొద్దున్నించీ మళ్ళీ వూగుతోంది" అన్నాడు వెంకటరత్నం.

"ఏం చేస్తాం? బల్ల తీసేస్తే మళ్ళీ గొలుసులకి తయారయింది" అన్నాడు క్రిష్ణమూర్తి.

"ఏమండోయ్ దుప్పటి వేశాను" అని కేకేసింది అహల్య.

"వస్తున్నా. ఇక్కడ మీటింగులో ఉన్నాను" అని జవాబు చెప్పాడు వెంకటరత్నం.

"అది కాదర్రా! ఉయ్యాల బల్ల ఆపేసి దానివేపే చూస్తూ కూర్చుంటే అది మళ్ళీ ఎలా ఊగేదీ తెలియదూ!?" అన్నాడు వెంకటరత్నం.

"అవును. నాకు ఎలాగూ మధ్యాహ్నం పూట నిద్రపట్టదు. అన్నయ్యా! ఆ సిగిరెట్ పాకెట్ ఇలా యిచ్చి వెళ్ళు. నేను ఉయ్యాల బల్లకి కాపలా ఉంటాను" అన్నాడు సుధాకర్.

"వెర్రివేషాలు వెయ్యక. వెళ్ళి పడుకో. సీత ఒంటిగా హడలి చస్తూ ఉంటుంది" అన్నది అహల్య వాళ్ళ మధ్యకి వచ్చి.

"రాధ గదిలో ఆవిడగారూ, రాధ పిల్లల్ని ఆడిస్తున్నారు. మనకి కాసేపు విశ్రాంతి" అన్నాడు సుధాకర్.

"అయితే నువ్వు కూడా వెళ్ళి పిల్లలని ఆడించు. కాస్త అనుభవం వస్తుంది. ముందు ముందు ఉపయోగపడుతుంది. ఉయ్యాల బల్ల జోలికి పోక" అన్నది అహల్య.

"ఉయ్యాల బల్లమీద పడుకోనుగా! దూరంగా కుర్చీ వేసుకుని చూస్తూ కూర్చుంటాను అక్కయ్యా!" అన్నాడు సుధాకర్.

"ఇదిగో! సుధాకర్ని ఆడపిల్లలతో జమకట్టక. నీకు ఆఖరి తమ్ముడు కనుక ముద్దయితే కావచ్చు. ఇరవయ్యేళ్ళు దాటినవాడ్ని పట్టుకుని పసిపిల్లాడిని ముద్దు చేసినట్లు చెయ్యక" అన్నాడు వెంకటరత్నం.

"క్రిష్ణమూర్తి తలకి కట్టు ఇంకా విప్పనేలేదు" అని అహల్య ఇంకా ఏదో చెప్పబోతుండగా "ఆల్ రైట్ అక్కయ్యా! ఉయ్యాల బల్ల జోలికి పోనుగా" అన్నాడు సుధాకర్ వెంకటరత్నాన్ని చూసి కన్నుగీటి.

అహల్య తృప్తిపడి వెనక్కి తిరిగింది. ఆమె వెనకే వెంకటరత్నం వెళ్ళాడు. వాళ్ళ గది దగ్గరికి వెళ్ళి తలుపు దగ్గర ఇద్దరూ రాతిబొమ్మల్లా నిలబడిపోయారు.

అహల్య పరుపు మీద తెల్లని యిస్త్రీ దుప్పటి పరిచి హాల్లోకి వెళ్ళి అయిదు నిమిషాలలో భర్తని వెంటపెట్టుకుని వచ్చింది.

ఆ తెల్లని దుప్పటి తెల్లగా లేదు. పేడ అలికివుంది. ఎవరో పేడ చేతులతో డిజైనులు ముద్రలు వేసినట్లున్నది. అయితే ఆ ముద్రలు బతికున్న వాళ్ళ చేతుల ముద్రల్లా లేవు. బొమికలు మాత్రమున్న చేతులతో ముద్రలు వేసినట్లు వేళ్ళు సన్నగా కొనలు తేలి వున్నాయి. ఆ భార్యాభర్తలు ఆ విచిత్రాన్ని చూస్తూ తలుపు దగ్గరే నిలబడిపోయారు. అహల్య భర్త చేతిని గట్టిగా పట్టుకుంది.

"ఏమిటిది?" అడిగాడు వెంకటరత్నం.

"నేను తెల్లని దుప్పటి యిస్త్రీ మడతది వేసి హాల్లోకి వచ్చాను" అన్నది అహల్య.

"దిస్ యీజ్ టూ మచ్" అన్నాడు వెంకటరత్నం.

"నాకు భయంగా వుంది. అన్నయ్య కదా కర్మ చెయ్యవలసింది. మనం ఈ ఊర్నించి వెళ్ళిపోదాం అండీ!" అన్నది అహల్య.

వెంకటరత్నం మంచం దగ్గరికి వెళ్ళాడు. వొంగి ఆ ముద్రలని పరీక్షగా చూశాడు. చూపుడు వేలితో ఒక ముద్రని తాకాడు. వేలికి తడిగా పేడ అతుక్కుంది. ఒకసారి గదంతా కలయ చూశాడు.

వెంకటరత్నం సామాన్యంగా నవ్వుతూ, కులాసాగా ఉంటాడు. అటువంటి అతని మొహం కందగడ్డలా ఎర్రనయింది. అహల్య మాత్రం గదిలో అడుగు పెట్టలేదు. వెంకటరత్నం నేలంతా పరీక్షగా చూశాడు. ఎక్కడా కాస్తంత పేడకూడా కనిపించలేదు.

"బావని పిలిచి చూపించాలి" అన్నాడు వెంకటరత్నం.

"ఎందుకు? అన్నయ్య మంత్రం వేస్తాడా?" అన్నది అహల్య.

"ఇంటి పెద్దగదా!" అంటూ మెట్లవైపు నడిచాడు వెంకటరత్నం.

"నేనొక్కతినే వుండను. నేనూ వస్తాను" అన్నది అహల్య.

భార్యాభర్తలు యిద్దరూ మేడమీదకి వెళ్ళి శ్రీనివాసరావుని పిలిచారు. ఏ క్షణాన ఏం జరుగుతుందో అని ఆదుర్దాపడుతున్న శ్రీనివాసరావు దడదడమంటున్న గుండెతో తలుపు దగ్గరికి వచ్చాడు.

వెంకటరత్నం, అహల్య ఇద్దరూ చెప్పారు జరిగింది.

"పదండి" అన్నాడు శ్రీనివాసరావు. కమలకూడా వాళ్ళ వెంట బయలుదేరింది.

నలుగురూ కిందకి దిగి వెళ్ళారు. గది తలుపు దగ్గరే ఆగిపోయాడు వెంకటరత్నం. "ఆశ్చర్యంగా వుంది" అన్నాడు.

"ఏమిటి?" అడిగాడు శ్రీనివాసరావు.

"దుప్పటి మీద పేడ మరకలు లేవు. అదృశ్యం అయినాయి" అన్నాడు వెంకటరత్నం.

శ్రీనివాసరావు వెంకటరత్నం పక్కకి వచ్చి చూశాడు. దుప్పటి మీద పేడ మరకలు లేవు. అయితే పేడ మరకలు బదులు అదే విధమైన చేతుల ముద్రలు ఎర్రగా ఉన్నాయి. కళ్ళకి కొట్టొచ్చిన ఎరుపు, రక్తం ఎరుపు. ఆ తెల్లని దుప్పటి మీద భయంకరమైన డిజైను.

"ఇది యిస్త్రీ దుప్పటి కాదండీ" అన్నది అహల్య.

"మరి?" అడిగాడు వెంకటరత్నం

"తీసేసిన పాత దుప్పటి. ఆ మూల పడేశాను. అక్కడ లేదు యిప్పుడు. అదే యిది."

"అయితే యిస్త్రీ దుప్పటి ఏమైంది?" అడిగాడు వెంకటరత్నం. భార్యనించి జవాబు ఆశించలేదు.

గదిలో నాలుగు మూలలా చూశారు. ఎక్కడా లేదు. "గదిలోంచి వెళ్ళి వచ్చేలోగా యిలాటి ఘోరాలు జరిగితే ఎలా చెప్పు అన్నయ్యా?" అన్నది అహల్య వీటన్నిటికీ శ్రీనివాసరావే బాధ్యుడయినట్లు.

"ఇంటికి తాళం వేసి ఎవరి దారిన వాళ్ళం వెళ్ళడం మంచిది. ప్రభాకరరావుని స్టేషన్ దగ్గర ఇల్లు అద్దెకి తీసుకోమనండి" అన్నది కమల.

"ఎర్ర సిరాతో వేసిన ముద్రలు యివి" అన్నాడు శ్రీనివాసరావు.

"దేంతో వేస్తేనేం?" అన్నది అహల్య.‘

"ఆలోచించవలసిన విషయం ఏమంటే, ఫ్లవర్ వేజ్‌లో ఎర్రని నీళ్ళు కుంకుమ నీళ్ళు. దుప్పటి మీద ముద్రలు సిరా ముద్రలు. దెయ్యం యీ పనులు చేస్తూ వుంటే దెయ్యానికి రక్తం దొరక్కపోతుందా అని."

"చాలు, చాలు. రక్తం కూడా కావాలిట" అన్నది కమల.

"బావ చెప్పినదాంట్లో అర్థం లేకపోలేదు. ఈ పనులు దెయ్యమే చేస్తుంటే దెయ్యానికి రక్తం దొరక్కపోతుందా అని. అంటే ఎవరో మనుష్యులే చేస్తున్నారేమోనని బావ అనుమానం కావచ్చు" అన్నాడు వెంకటరత్నం.

"బావ మరదులు సరిపోయారు. ఈ ఘోరాలు మనుష్యులు ఎవరు చేస్తారు? ఎందుకు చేస్తారు?" అన్నది అహల్య.

"బావా! ఇలా లాభంలేదు. మెజారిటీ దెయ్యమంటున్నారు" అన్నాడు వెంకటరత్నం.

"ఇంతకీ పేడ ముద్రలున్న దుప్పటి ఏమైంది?" అడిగాడు శ్రీనివాసరావు.

"దెయ్యం ఎత్తుకుపోయింది" అన్నాడు వెంకటరత్నం నవ్వుతూ.

కాసేపు నలుగురూ మాట్లాడకుండా గది మధ్య నిలబడ్డారు. చివరికి వెంకటరత్నం "ఏం చేస్తాం? ఇంకో దుప్పటి వెయ్యి. ఈసారి దుప్పటి ఖరాబు చెయ్యకుండా నేను కాపలా వుంటాను" అన్నాడు.

ఎర్రని మరకలున్న దుప్పటి తీసి గదిలో ఓ మూల పడేసి, ఇంకో యిస్త్రీ దుప్పటి పెట్టెలోంచి తీసి యిచ్చింది అహల్య.

దుప్పటి పరిచి, మంచం మీద కూర్చుని "గుడ్! కూర్చోగానే మంచం ఎగిరిపోలేదు. అంతవరకూ నయం" అన్నాడు వెంకటరత్నం.

శ్రీనివాసరావు, కమలా నవ్వారు. "చూద్దాం, చూద్దాం" అంటూ శ్రీనివాసరావు చెల్లెలి గదిలోంచి బయటికి నడిచాడు. దీర్ఘంగా ఆలోచిస్తూ మేడమెట్లు ఎక్కాడు. అతని వెనకే కమల కూడా వెళ్ళింది.

తన గదికి అయిదడుగుల దూరంలో నిశ్చేష్టుడై ఆగిపోయాడు శ్రీనివాసరావు. కమల నోరు తెరుచుకుని గజగజ వొణుకుతూ భర్తని ఆనుకుని నిలుచున్నది.

ఏ దుప్పటయితే మాయమైందో, ఏ పేడముద్రలని అయితే వెంకటరత్నం వర్ణించి చెప్పాడో, ఆ దుప్పటి ఆ పేడ ముద్రలతో సహా తన గది తలుపుకి తెరగా అడ్డంగా వేళ్ళాడుతోంది.

''విచిత్రం, విచిత్రం!'' అన్నాడు శ్రీనివాసరావు.

కమల గజగజ వొణుకుతూ, భయంతో కెవ్వున కేక పెట్టింది. మళ్ళీ ఏం ప్రమాదం జరిగిందో అని అందరూ వాళ్ళ వాళ్ళ గదుల్లోంచి పరిగెత్తుకు వచ్చారు. ఆ కేక విని పిల్లలందరూ ఒక్క పెట్టున ఘొల్లుమని ఏడ్వడం ప్రారంభించారు.

## 8

అప్పుడే చీకటి పడబోతోంది. అంతకుముందే సుధాకర్, సుందరం కలిసి ఉయ్యాల బల్ల తీసేసి, గొలుసులు కూడా తీసేసి వాటిని కొట్టు గదిలో పెట్టేశారు.

మధ్యాహ్నం శ్రీనివాసరావు గదికి తెరగా దుప్పటి తగిలించడం జరిగిన తర్వాత అంతవరకూ మళ్ళీ ఎటువంటి సంఘటనా జరగలేదు.

అందరి మనస్సులు కొంచెం కుదుటపడ్డాయి. రాధ, అహల్య సావిత్రితో కబుర్లు చెప్పుకుంటూ ఆమె గదిలో కూర్చున్నారు. అంతలో సుందరరావు తలుపుకి అవతల నిలబడి ''రాధా!'' అని పిలిచాడు.

''ఎవరు సుందరం బావా? ఏమిటి?'' అడిగింది రాధ.

''కాసేపు మీ అక్కయ్యకి తోడుగా వుంటావా?'' అడిగాడు సుందరరావు.

''వొస్తున్నాను'' అంటూ రాధ లేచి వెళ్ళింది.

వసంతకి తెలివి వచ్చి చాలా సేపయింది. జ్వరం ఇంకా తగ్గలేదు. శ్రీనివాసరావు యింజక్షన్ యిచ్చాడు.

వెలుగుపోతున్నది. చీకటి అలుముకుంటోంది.

''పిల్లలకీ నాకూ కలిపి యాభై రూపాయలకన్నా ఎక్కువ లేదన్నారు పోయిన దీపావళికి. చిట్టికి పట్టుపరికిణి కుట్టిస్తానని చెప్పాను. యాభై ఏం చాలతాయి'' చటుక్కున మాటలు ఆపేసి నోరు తెరిచింది సావిత్రి. కళ్ళు పెద్దవి చేసింది. ఏదో అనబోయి, ఎవరినో పిలవబోయి గొంతులోంచి మాటవూడి పడక ''బే, బే!'' అన్నది.

అహల్య చటుక్కున వెనక్కి తిరిగి సావిత్రి చూసిన వైపు చూసింది. అది కిటికీ. ఆ కిటికీ వైపు చూడగానే అహల్య ''బాబోయ్!'' అని కేక పెట్టింది.

క్రిష్ణమూర్తి, వెంకటరత్నం పరిగెత్తుకువచ్చారు. ''ఏమిటి? ఏమైంది?'' అడిగాడు ఆదుర్దాతో.

ఆ యిద్దరు ఆడవాళ్ళు మాట్లాడలేకపోయారు. కిటికీ వైపు వేలు చూపించారు.

''ఏమిట్రా! ఏమైంది?'' అడిగాడు వెంకటరత్నం

''కిటికీ'' అనగలిగింది చివరికి అహల్య.

''కిటికీ - కిటికీలో ఏమీ లేదు'' అన్నాడు క్రిష్ణమూర్తి.

ఇద్దరు ఆడవాళ్ళూ మొగాళ్ళు పక్కన ఉన్నారనే ధైర్యంతో తలలెత్తి చూశారు.

"కిటికీలో చెయ్యివుంది" అన్నది సావిత్రి.

వెంకటరత్నం కిటికీ వద్దకు వెళ్ళి పరీక్షగా చూసి "చీమ కూడా లేదు. ఊరికినే దడుసుకున్నారు" అన్నాడు.

"నిజమండీ! నల్లగా వున్న ఒక చెయ్యి కిటికీలోంచి లోపలికి వచ్చింది. మనిషి కనిపించలేదు" అన్నది అహల్య.

"భయంతో రకరకాలుగా మీరే ఊహించుకుంటున్నారు" అన్నాడు క్రిష్ణమూర్తి.

"అబ్బబ్బ! ఇద్దరం చూశాం. చూసిన వాళ్ళం చెపుతున్నాంగా. ఒక చెయ్యి ఊచల్లోంచి లోపలికి వచ్చింది. ఊగుతోంది. నేనే మొదట చూశాను. తర్వాత వదిన చూసింది" అన్నది సావిత్రి.

క్రిష్ణమూర్తి బయటికి పరిగెత్తాడు.

"మీరు వెళ్ళకండి" అని కేక వేసింది సావిత్రి.

క్రిష్ణమూర్తి వినిపించుకోలేదు. క్షణంలో కిటికీ అవతల నిలుచున్నాడు. "ఇక్కడ ఎవరూ లేరు" అన్నాడు.

"ఇంత భయస్తులు మీరిద్దరూ యీ గదిలో ఎందుకు కూర్చున్నారు?" అన్నాడు వెంకటరత్నం కాస్త విసుగ్గా.

క్రిష్ణమూర్తి గదిలోకి వచ్చి "భోజనాల వేళ అయ్యేంతవరకూ యిక్కడే కూర్చుందాం. ఆ చదరంగం బల్లా, పావులూ తెస్తానుండు" అని వెళ్ళి కాసేపట్లో అవి తీసుకుని తిరిగి వచ్చాడు.

ఆ ఇద్దరు మొగాళ్ళూ చదరంగం ఆడుకోవడం ప్రారంభించారు. ఇద్దరు ఆడవాళ్ళకీ కొంచెం ధైర్యం వచ్చింది.

9

"**ఇంకా టెంపరేచర్** వుంది" అన్నది రాధ.

"ఎంత?" అడిగాడు సుందరరావు.

"నూరు పైన రెండు పాయింట్లు. పొద్దున్నకి తగ్గిపోతుందిలే" అన్నది రాధ.

వసంత నిద్రపోతోంది. రాధ మంచం పక్కకి పడక కుర్చీ లాక్కుని కూర్చున్నది.

"నేను కాసేపట్లో తిరిగి వస్తాను. నువ్వు యిక్కడే వుంటావు కదూ!" అని రాధ తలవూపగానే వెళ్ళిపోయాడు సుందరరావు.

కాసేపటికి వసంత కళ్ళు తెరిచి "ఆయన ఏరీ?" అని అడిగింది. "అలా బయటికి వెళ్ళాడు. ఏం కావాలి?" అడిగింది రాధ.

"మంచి నీళ్ళు."

రాధ లేచి చెంచాతో నీళ్ళు అక్క నోట్లో పోసింది. నాలుగు చెంచాలు తాగి మళ్ళీ కళ్ళు మూసుకుంది వసంత. పది నిమిషాల తర్వాత సుందరరావు తిరిగి వచ్చాడు.

"అక్కయ్య లేచింది. నిన్ను అడిగింది" అన్నది రాధ.

వసంత తలుపు వైపు మొహం పెట్టి పడుకుంది. రాధ మంచానికి అవతల వైపు కూర్చున్నది. సుందరరావు రాధ కూర్చున్న చోటికి వెళ్ళాడు. సూటిగా రాధ కళ్ళల్లోకి చూసి చిన్నగా నవ్వాడు. ఎందుకు నవ్వుతున్నాడో అర్థంకాక ఏమిటని సంజ్ఞ చేసి అడిగింది రాధ. చెపుతాను రమ్మని సంజ్ఞ చేశాడు కిటికీ దగ్గరికి వెళ్ళి. రాధ కుర్చీలోంచి లేచి అతనికి దగ్గరికి వెళ్ళింది. ఆమె చెవి దగ్గర నోరు పెట్టి "నువ్వు చాలా అందంగా వున్నావు" అన్నాడు.

రాధ కనుబొమలు ముడిచి "అయితే నువ్వెందుకు?" అడిగింది.

"నిన్ను కిటికీ దగ్గరికి రప్పించడానికి" అంటూ రాధ చెయ్యిపట్టుకున్నాడు సుందరరావు.

"ఉష్! పరిహాసాలు చాలు. చెయ్యి విడు" అన్నది రాధ.

"పరిహాసం కాదు, నిజంగానే. నువ్వు యివేళ చాలా అందంగా వున్నావు" అంటూ రాధ నడుం చుట్టూ చెయ్యి వేసి దగ్గరకు లాక్కుని పెదిమల మీద ముద్దుపెట్టుకున్నాడు సుందరరావు. ఇదంతా క్షణంలో జరిగిపోయింది.

రాధ నిప్పులు కక్కుతూ చూసింది అతన్ని. "ఏమిటీ వికారపు చేష్టలు బావా! ఇంకెప్పుడూ ఇలాటి పనిచెయ్యక. మర్యాద దక్కదు" అన్నది కోపంగా.

"నువ్వు మెడికోవి. నీకు యింత భయమా?"

"మెడికోని అయితే అడ్డమైన వాళ్ళనందర్నీ ముట్టుకోనిస్తానా?" అడిగింది రాధ.

"రాధా! నువ్వంటే నాకు ఎంత యిష్టమో!"

"ఇష్టం వుంటే వుండనీ" అని రాధ వెనక్కి తిరిగిబోయింది. రాధ అట్టే గొడవ చెయ్యలేదు కనుక ఆమెకూ తనంటే యిష్టమేనేమో అనుకుని అపోహపడి సుందరరావు వెనక్కి తిరిగిన రాధని వెనకనించే బిగించి కావలించుకున్నాడు.

పళ్ళు బిగించి "విడు" అన్నది రాధ.

అతను విడవలేదు. చప్పుడు చేస్తే ఎక్కడ అక్క లేస్తుందో అని రాధ భయం. ఆ పశువు చేతుల్లోంచి ఎలా తప్పించుకోవడమో తెలియలేదు. పక్కనే బల్ల మీద వున్న మరచెంబు తీసి దానితో సుందరరావుని బలంగా ఒక్కదెబ్బ కొట్టింది.

"అబ్బా!" అని పెద్దకేక వేసి ఆమె మీదనించి చేతులు తీసేశాడు సుందరరావు. రాధ వెనక్కి తిరిగి చూసింది. సుందరరావు పెదిమలు చిట్లి రక్తం కారుతోంది. చెంబు మొహానికి తగిలినట్లుంది.

"ఏమిటి? ఏమైంది?" అడిగింది వసంత ఉలిక్కిపడి లేచి.

"ఏమిట్రా! ఏం జరిగింది?" అంటూ ఎవరో తలుపు దగ్గరికి పరిగెత్తుకుని వచ్చారు.

"ఏం చెపుతావో చెప్పుకో" అని రాధ సుందరరావుకి దూరంగా జరిగింది.

"ఏమిటి రాధా! ఏమైంది? నీవేనా కేక పెట్టింది?" అడిగింది వసంత అటువైపు తిరిగి.

"ఏమిటిది సుందరం?" అంటూ శ్రీనివాసరావు గదిలోకి వచ్చాడు. జేబులోంచి రుమాలు తీసి అతని మొహానికి అదిమిపెట్టి "వసంత మళ్ళీ భయపడుతుంది. నువ్వు ముందు యీ గదిలోంచి బయటికిరా" అన్నాడు నెమ్మదిగా అంతలో సుధాకర్ కూడా గదిలోకి వచ్చాడు. ఇద్దరూ కలిసి సుందరరావుని ఆ గదిలోంచి తీసుకువెళ్ళారు.

"ఏమిటి? చూసుకోకుండా మొహం ఏ కిటికీ ఊచలకో కొట్టుకున్నాడనుకుంటాను" అన్నది రాధ.

పక్క గదిలోకి తీసుకువెళ్ళి, లాంతరు వెలుగులో సుందరరావు మొహం పరీక్ష చేసి "ఏమిటి? ఇంత దెబ్బ ఎలా తగిలింది?" అడిగాడు శ్రీనివాసరావు బావమరిదిని.

"దెయ్యం కొట్టింది" అన్నాడు సుందరరావు.

"జోక్ చెయ్యక చెప్పు బావా!" అన్నాడు సుధాకర్.

"ఏమో నాకు తెలియదు. నేను కిటికీ వద్ద నిలుచున్నాను. ఏదో వచ్చి తగిలింది" అన్నాడు సుందరరావు.

సుధాకర్ వసంత పడుకున్న గదిలోకి వెళ్ళాడు. దీపం పెద్దది చేసి గదంతా పరీక్షగా చూశాడు. మరచెంబు తీశాడు. అడుగున ఎఱ్ఱగా వుంది. దాన్ని తీసుకుని గదిలోంచి బయటికి వెళ్ళి రాధని పిలిచాడు. రాధ తలుపు దగ్గరికి వెళ్ళింది.

"బావ కిటికీవద్ద నిలుచుంటే ఏదో వచ్చి తగిలింది అన్నాడు. దెయ్యం కొట్టింది అన్నాడు. జాగ్రత్త" అన్నాడు సుధాకర్. రాధ తనలో తను నవ్వుకుంటూ లోపలికి వెళ్ళింది.

10

"పెద్దన్నయ్య ఏడీ?" అడిగాడు క్రిష్ణమూర్తి కంచం ముందు కూర్చుంటూ.

"సుందరం బావకీ, వసంతకీ తోడుగా కూర్చున్నాడు. తర్వాత తింటాడట" అన్నది రాధ.

"సుందరం బావ అన్నానికి రాడా?" అడిగాడు క్రిష్ణమూర్తి.

"పెదిమి చిట్లింది. నోరు బాండేజీతో కట్టేశాడు అన్నయ్య. ఈ పూటకి కాసిని పాలు తాగి పడుకోమన్నాడు" అని నవ్వింది రాధ.

"పాపం! అతను దెబ్బ తగిలి బాధ పడుతుంటే నీకు నువ్వెందుకే?" అన్నది అహల్య.

రాధకి మరింత నవ్వు వొచ్చింది. పకపక నవ్వింది.

"ఏమిటి జోక్. మాకు చెపితే విని సంతోషిస్తాము" అన్నాడు సుధాకర్.

"ఏమీ లేదు" అని వూరుకుంది రాధ.

"నాకు పెరుగు" అని పిల్లలు కేకలు వేస్తున్నారు.

"తెస్తున్నాను" అంటూ చారు గిన్నె తలుపు దగ్గర పెట్టేసి వంట యింట్లోకి వెళ్ళిన సుబ్బమ్మ "అయ్యో!" అని కేకవేసింది లోపల్నించి.

"ఏమిటి? ఏమైంది?" అరిచారు అందరూ భోజనాల సావిట్లోంచి.

సుబ్బమ్మ రెండు గిన్నెలు పుచ్చుకుని పరిగెత్తుకుని వచ్చి "చూడండి, చూడండి ఇది పెరుగు గిన్నె, ఇది మజ్జిగ గిన్నె. రెండు గిన్నెల మీదా మూతలు పెట్టాను. చూడండి" అంటూ రెండు గిన్నెలూ వాళ్ళముందు పెట్టింది.

"ఏమైందో చెప్పు సుబ్బమ్మా!" అడిగాడు క్రిష్ణమూర్తి.

"మజ్జిగలో కారంపొడి కలిపారు. పెరుగులో పసుపుపొడి కలిపారు" అన్నదామె.

"అయితే యీ పూటకి మజ్జిగ లేదన్నమాట" అన్నాడు సుధాకర్.

"పొద్దున్న మజ్జిగ మిగిలితే జాడీలో పోసి పెట్టాను. నీళ్ళు కలిపితే అందరికి సరిపోతుంది. అయినా యీ పని ఎవరు చేశారంట?" అన్నది సుబ్బమ్మ.

ఎవరు చేశారనే ప్రశ్నకి ఎవరూ సమాధానం చెప్పలేదు. పొద్దున్న మిగిలిన మజ్జిగలో నీళ్ళుపోసి అందరికీ సర్ది, ఇంకా కొంత మిగిల్చింది సుబ్బమ్మ.

"నాకు పెరుగు కావాలి" అని చిట్టి ఓ పక్కన ఏడుస్తోంది. "పుల్లగా వుంది" అని గొడవచేస్తున్నాడు శ్రీనివాసరావు కొడుకు.

భోజనాలు ముగించుకుని అందరూ లేచారు. చేతులు కడుక్కోవడానికి అందరూ కలిసి గుంపుగా బావి దగ్గరకు వెళ్ళారు. ఆడవాళ్ళు, పిల్లలూ యింట్లోకి వెళ్ళేంతవరకూ మొగవాళ్ళు బావి దగ్గర నిలబడ్డారు.

రాధ వసంత గదిలోకి వెళ్ళి శ్రీనివాసరావుని భోజనానికి వెళ్ళమనీ, తను తోడుంటాననీ చెప్పింది.

"వసంత నిద్రపోతోంది, లేస్తే టెంపరేచర్ చూడు. ఎక్కువ వుంటే నాకు చెప్పు" అన్నాడు శ్రీనివాసరావు తలుపు దగ్గరికి వెళ్ళి.

"అన్నట్లు సుధాకరన్నయ్య కనిపిస్తే ఓసారి రమ్మని చెప్పు" అన్నది రాధ.

నిమిషంలో సుధాకర్ ప్రత్యక్షమై "పిలిచావా రాధా?" అడిగాడు.

''ఆ! నీ దగ్గర ఓ లాఠీ వుంది, చూశాను. ఈ రాత్రికి అది నాకియ్యి'' అన్నది రాధ.

''ఎందుకు?'' అడిగాడు సుధాకర్.

''దెయ్యం మళ్ళీ వస్తే బెదిరించడానికి'' అన్నది రాధ నవ్వుతూ. సుందరరావు మెలుకువగానే వున్నాడని వింటున్నాడనీ రాధకి తెలుసు. సుధాకర్ లాఠీ తెచ్చి యిచ్చి వెళ్ళిపోయాడు. రాధ తలుపు గడియవేసి లాఠీ ఒళ్ళో పెట్టుకుని పడక కుర్చీలో పడుకుంది. సుందరరావు లేచాడు.

''యేం కావాలి చెప్పు, తెచ్చిస్తాను'' అన్నది రాధ.

''ఆ అలమారులో సిగిరెట్ పాకెట్టూ, అగ్గిపెట్టె ఉన్నాయి. తెచ్చియ్యి'' అన్నాడు సుందరరావు.

రాధ వాటిని తెచ్చి అతనికిచ్చింది.

''రాధా! ఐ యామ్ సారీ'' అన్నాడు సుందరరావు.

''మరిచిపో. అందరూ నర్వస్ టెన్షన్‌లో ఉన్నారు. ఇలాటి గొడవలు తప్పవు'' అన్నది రాధ.

ఇంతలో కెవ్వుమని పెద్దకేక. ఇల్లు ఎగిరిపోయేటంత పొలికేక. చెవులు చిల్లులు పడేటంత కేక, గుండెలు ఆగిపోయేటంత కేక వినపడింది.

వసంత ఉలిక్కిపడి లేచింది. ''అమ్మో! అమ్మో'' అని అరవడం ప్రారంభించింది.

సుందరరావు లేచి బయటికి పరిగెత్తబోయాడు.

''బావా! నువ్వు వెళ్ళక. ఇక్కడే ఉండు'' అన్నది రాధ. సుందరరావు తలుపు దగ్గరే ఆగిపోయాడు.

తలుపులు తెరుచుకుంటున్నాయి. పరిగెత్తుతున్నారు. ప్రశ్నలు, కేకలు వినిపిస్తున్నాయి. యేం జరిగిందీ తెలుసుకుందామని రాధ చెవులు రిక్కించుకుని వింటోంది.

''అది సావిత్రి పెట్టిన కేక.''

''అవును. కిట్టు గదిలోంచి వచ్చింది.''

''పిల్లలు ఏడుస్తున్నారు.''

''ఏమండోయ్ నన్ను ఒంటిగా ఒదిలి మీరు వెళ్ళకండి.''

''వెళ్ళకపోతే ఎలా? యేం ప్రమాదం జరిగిందో?''

''నన్ను ఒంటిగా వొదిలి వెళితే యిక్కడ నాకూ, పిల్లలకీ యేం ప్రమాదం జరుగుతుందో అనే చింతలేదన్నమాట'' ఇలాటి మాటలు, సూటిపోటి మాటలు, భయాలు అందర్లోనూ ఎక్కువయ్యాయి. రాధ, సుందరరావు, వసంత మినహా దాదాపు యింటిల్లిపాదీ క్రిష్ణమూర్తి గది దగ్గరికి వెళ్ళారు.

సావిత్రి వెక్కివెక్కి ఏడుస్తోంది. క్రిష్ణమూర్తి చలనం లేకుండా రాతిబొమ్మలా నిలుచుని మంచం వైపు చూస్తున్నాడు. అందరూ గదిలోకి వెళ్ళి క్రిష్ణమూర్తి చూస్తున్నవేపు చూశారు. తెల్లని దుప్పటి మీద ఒక పక్కన బొగ్గుతో నల్లగా అస్థిపంజరం ఆకారం గీసివుంది.

''యేమిటిది?'' అడిగాడు వెంకటరత్నం.

"పిల్లలిద్దర్నీ పడుకో పెట్టిన తర్వాత సావిత్రి నీళ్ళ గదికి వెళుతూ తోడు రమ్మన్నది. వెళ్ళి తిరిగి వచ్చాం. చిట్టి పక్కమీద లేదు. లేచిందేమోనని చిట్టి అని పిలిచి పక్క దగ్గరికి వెళ్ళి కెవ్వున కేక వేసింది సావిత్రి. చూద్దునుగదా, చిట్టి పడుకున్న చోట యీ బొమ్మ గీసి వుంది. చిట్టిలేదు అన్నాడు క్రిష్ణమూర్తి. అతని కంఠస్వరమూ జీరపోయింది. సావిత్రి ఏడుస్తునే వుంది.

"పిల్లల్ని వొదిలి ఎందుకు వెళ్ళావు వొదినా? మమ్మల్ని ఎవర్నయినా కేక వేస్తే వచ్చి తోడు కూర్చోమా!" అన్నది అహల్య.

"రెండు నిమిషాల్లో యిలాటిది జరుగుతుందని అనుకోలేదు వదినా. లేకపోతే యీ గదిలోంచి అసలు కదిలేదాన్నే కాదు. నా చిట్టి యేమైందో" అంటూ వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించింది సావిత్రి.

"యేడవకమ్మా సావిత్రీ! చిట్టి ఇంట్లోనే ఎక్కడో ఉంటుంది. సుధా! నువ్వు సావిత్రికి తోడుండు. ఆడవాళ్ళు అంతా ఇక్కడే ఉండండి. మొగాళ్ళం ఇల్లంతా వెదుకుదాం రండి" అన్నాడు శ్రీనివాసరావు.

"నేనూ వస్తాను" అంటూ లేచింది సావిత్రి చంకన చంటిపిల్లాడిని ఎత్తుకుని.

"నువ్వెందుకమ్మా! ఇక్కడే వుండు."

"ఉహూ! నేనూ వస్తాను."

"సరే పద, తతిమ్మా ఆడవాళ్ళు మినహా మిగతా వాళ్ళంతా ఆ గదిలోంచి బయటకి వెళ్ళారు. తలొకరు తలో లాంతరు పట్టుకుని వచ్చారు. లాంతర్లు పుచ్చుకుని ఇల్లంతా వెతకడం ప్రారంభించారు. కొందరు ఒకవైపు, ఇంకొందరు యింకో వేపు వెళ్ళారు వెతుకుతూ. కాసేపట్లో అందరూ హాల్లోకి చేరుకున్నారు.

"ఎక్కడా లేదు."

"కనిపించలేదు." సావిత్రి వెక్కి వెక్కి యేడుస్తోంది.

"కొట్టు గదీ, స్నానాల గదీ, పూజగదీ చూశార్రా?" అడిగాడు వెంకటరత్నం.

అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకుని పరిగెత్తి ముందు పూజగది దగ్గర ఆగారు. తలుపు గడియ తీశారు. శ్రీనివాసరావు, క్రిష్ణమూర్తి గదిలో ముందు ప్రవేశించారు. "ఇక్కడుందర్రా!" అని సంతోషంతో కేకేశాడు క్రిష్ణమూర్తి.

వాళ్ళిద్దర్నీ తోసుకుని సావిత్రి లోపలికి పరిగెత్తింది.

పూజామందిరం ముందు నేలమీద నోట్లో వేలు వేసుకుని పడుకునుంది చిట్టి. సావిత్రి ఒక్క గంతున వెళ్ళి ఒక చేత్తో చిట్టిని ఎత్తి రొమ్ముకు అదుముకుని, మొహం అంతా ముద్దులతో నింపేస్తు "నా తల్లీ, నా బంగారుకొండా! నా వరహాల తల్లీ!" అంటూ ఆనందమూ, దుఃఖమూ కలిసిన ఏడుపు ఏడుస్తోంది.

"ఈ గదిలోకి ఎందుకు వచ్చిందో దాన్ని అడుగమ్మా!" అన్నాడు శ్రీనివాసరావు.

సావిత్రి చిట్టిని అడిగింది. నిద్రలోంచి లేచిన చిట్టి నిద్రమత్తుతో తల్లి భుజం మీద తల వాల్చింది కానీ జవాబు చెప్పలేదు. చివరికి దానికి తెలియదని అందరూ కలిసి నిర్ధారణ చేశారు.

"యేమండోయ్! పొద్దున్నే ప్రయాణం కట్టండి. ఇక నేనుండను యీ యింట్లో" అన్నది సావిత్రి.

క్రిష్ణమూర్తి జవాబు చెప్పలేదు. శ్రీనివాసరావుని చూశాడు. శ్రీనివాసరావు నవ్వి ఊరుకున్నాడు.

పూజ గది గడియ పెట్టి అందరూ బయటికి వచ్చారు.

"చిట్టిని ఎత్తుకుపోయి తమ గదిలో పడుకోపెట్టింది, దుప్పటి మీద ఆ బొమ్మ గీసిందీ దెయ్యమేనంటావా బావా?" అడిగాడు వెంకటరత్నం శ్రీనివాసరావుని. శ్రీనివాసరావు భుజాలు చరిచాడు.

11

**"ఇక్కడ ఉన్నాను"** చీకట్లోంచి అన్నాడు రహస్యంగా. ఆ మాటలు వినిపించినవైపు నడిచిందామె. దగ్గరికి చేరుకోగానే అతని ఆకారాన్ని చూసి గుర్తుపట్టి "ఎందుకు రామూ పిలిచావు?" అడిగిందామె.

"ఇందుకు" అంటూ అతను ఆమె నడుం చుట్టూ చేతులువేసి గట్టిగా కావిలించుకున్నాడు. ఆమె అతని మెడ చుట్టూ చెయ్యివేసి, అతని మొహం దగ్గరికి లాక్కుని "ప్రమాదం! ఏ క్షణాన ఎవరు నిద్రలేస్తారో చెప్పలేము" అన్నది.

వెచ్చని ఆమె ఊపిరి అతనికి చెంపకి తగిలింది. ఆమె తల వెంట్రుకలు అతని మెడకి రాసుకున్నాయి. ఊపిరి వదలకుండా గబగబా ఆమె మొహమంతా ముద్దులతో నింపేశాడు. "నాకిలా రాత్రిళ్ళు రావడం భయంగా ఉంది" అన్నదామె.

"దెయ్యమా?" అడిగాడు నవ్వుతూ.

"అవును."

"దెయ్యానికి థాంక్స్ చెప్పాలి. ఈ చీకట్లో ఎవరయినా వస్తారనే భయం లేదు మనకి" అన్నాడు అతను నవ్వుతూ.

ఇద్దరూ నేలమీద కూర్చున్నారు. అరగంట తర్వాత ఆమె లేచింది. "ఇక వెళ్తాను. ఆయన నిద్రలేస్తే?" అన్నది.

అతనూ లేచి నిలుచున్నాడు. "మళ్ళీ రేపు" అన్నాడు ఆమె చెంప నిమురుతూ.

"ఏమో? ప్రయత్నిస్తాను" అన్నది ఆమె.

"నువ్వు గదిలోకి వెళ్ళేంతవరకూ నేనిక్కడే నిలుచుని చూస్తుంటాను" అన్నాడు అతను.

ఆమె విడవలేక విడవలేక అతన్ని విడిచిపెట్టి చీకట్లోకి నడిచి వెళ్ళి నిమిషంలో తిరిగి వచ్చింది.

"ఏం వచ్చేశావు?" అడిగాడు అతను.

"తలుపు వేసేసి ఉంది."

"అంటే?"

"లోపల గడియపెట్టి ఉంది" అన్నది ఆమె.

"నీ మొగుడు లేచి తలుపు లోపల గడియపెట్టాడంటావా?" అడిగాడు కాస్త కంగారుగా అతను.

"అయ్యుండాలి. ఇంకెవరు లోపల గడియవేస్తారు?" అన్నది ఆమె.

"నీ మొగుడు నిద్రలేచి నువ్వు గదిలో లేకపోవడం గమనించి వుంటే నువ్వు ఏమయ్యావని ఆలోచించడూ! పోనీ ఏ నీళ్ళ గదిలోకో వెళ్ళావని అనుకున్నా నువ్వు వచ్చేంతవరకూ కాచుకుంటాడు కాని లోపల గడియపెట్టి పడుకుంటాడా?" అన్నాడు అతను.

"అయితే ఎవరు గడియ పెట్టారంటావు?" భయంతో అడిగిందామె.

"గడియ ఎవరు పెట్టినా యిప్పుడు ఏం చెయ్యాలి అనేది సమస్య. ఉండు ఆలోచిస్తాను" అన్నాడు అతను.

ఆమె ఓపిగ్గా కాచుకున్నది. చివరికి అతను నిట్టూర్చి "దెయ్యం మీద తోసెయ్యి" అన్నాడు.

"అంటే?" అడిగింది ఆమె.

"పక్కమీద పడుకున్న చిట్టిని తీసుకుని వెళ్ళి దెయ్యం పూజా మందిరం దగ్గర పడుకోబెట్టిందా లేదా? అలాగే దెయ్యం నిన్ను తీసుకెళ్ళి యింకెక్కడో పడుకోబెట్టినట్లు నటించు."

"అమ్మబాబో నేను వెళ్ళి ఎక్కడ పడుకోను?" అడిగింది ఆమె.

"భోజనాల సావిట్లో సుబ్బమ్మ, అవతల వసారాలో లచ్చి, వీరయ్య పడుకున్నారు. నువ్వు వెళ్ళి సుబ్బమ్మ పక్కన పడుకో. తెల్లారే నిద్రలేచి సుబ్బమ్మ ఆశ్చర్యపోతుంది. అక్కడికి ఎలా వచ్చిందీ నీకేం తెలియదని చెప్పు" అన్నాడు అతను.

ఆమె తల వూపి "తోడురా అంతవరకూ" అన్నది.

ఇద్దరూ భోజనాల సావిడివైపు నడిచారు.

సుబ్బమ్మ గొంతు విని ఇద్దరూ ఆగిపోయారు.

"లచ్చీ! లచ్చీ" పిలిచింది సుబ్బమ్మ.

"ఏమమ్మా!" అడిగింది లచ్చి వసారాలోంచి.

"మెలుకువగానే ఉన్నావుటే?" అడిగింది సుబ్బమ్మ.

"ఇప్పుడే మెలుకువ వచ్చింది" అన్నది లచ్చి.

"చప్పుళ్ళు విన్నావుటే?"

"ఆ! అందుకే మెలుకువ వచ్చింది. మీరు వంట యింట్లోకి వెళ్ళారనుకున్నాను."

"లేదే! నేను నిద్రపోతున్నాను. ఆ చప్పుళ్ళకే నేనూ నిద్రలేచాను" అన్నది సుబ్బమ్మ.

"అయితే ఆ చప్పుళ్ళు ఏమిటమ్మా?"

"అదేనే పీట లాగిన చప్పుడు, నీళ్ళు ఒలకబోసిన చప్పుడు, కంచుగ్లాసు బిందెకి తగిలి ఖంగుమన్న చప్పుడు."

"అవునమ్మా! నాకూ అలాగే వినిపించింది."

"పిల్లేమో?"

"పిల్లో, ఎలుకో అయి వుంటుంది" అన్నది లచ్చి.

"చూడొద్దుటే"

"ఎందుకమ్మా! అన్నిటి మీదా మూతలున్నాయిగా?"

"ఉన్నాయనుకో. అయినా కొంచెం ఆ తలుపు దగ్గరికి వచ్చి నిలుచో. నేను లోపలికి వెళ్ళి చూస్తాను."

"ఉండండమ్మా! వీరయ్యని లేపుతాను."

"వాణ్ణెందుకు లేపడం?"

"నాకు భయంగా ఉందమ్మా!"

లచ్చి వీరయ్యని లేపడం, సుబ్బమ్మ లాంతరు వెలిగించడం జరిగింది.

"యేం చెయ్యాలి యిప్పుడు?" అడిగింది ఆమె అతని చెయ్యి గట్టిగా పట్టుకుని.

"ఉండు చూద్దాం" అన్నాడు అతను. వాళ్ళిద్దరూ దూరంగా చీకట్లో నిలుచున్నారు.

సుబ్బమ్మ వంటింటి తలుపు గడియ తీసింది. లాంతరు లోపల పెట్టి తొంగి చూసింది.

"ఏమమ్మా! ఎలికేనా?" అడిగింది లచ్చి.

"పిల్లీలేదు, ఎలికా లేదు" అన్నది సుబ్బమ్మ.

"మరి చప్పుడు?" అడిగింది లచ్చి.

"బిందెలో నీళ్ళు అలాగే ఉన్నాయి" అన్నది సుబ్బమ్మ.

"వంట యింట్లో కాదేమోనమ్మా!" అన్నది లచ్చి.

"అంతే అయ్యుండాలి" అంటూ సుబ్బమ్మ వెనక్కి తిరిగింది. తిరుగుతూ "బాబోయ్!" అని పొలికేక పెట్టి లాంతరు కింద పడేసింది. ఆ కేకకి లచ్చి బెదిరిపోయి అరవడం ప్రారంభించింది.

"ఏంటమ్మా!" అన్నాడేగాని వీరయ్య భోజనాల సావిట్లోకి వెళ్ళలేదు. అంతకుముందెన్నడూ లోపల అడుగుపెట్టని వీరయ్య అలవాటు చొప్పున ముందుకి అడుగు వెయ్యలేకపోయాడు.

చీకట్లో దాక్కున్న ఆ యువతి గజగజ వొణికింది.

"భయపడక. అందరూ వస్తారిప్పుడు, క్షణంలో వచ్చేస్తారు. ఎవరన్నా వచ్చి లేపేంతవరకూ నువ్వు యిక్కడే నేలమీద పడుకో. ఎందుకిక్కడ పడుకున్నావని అడిగితే నీకేమీ తెలియదని చెప్పు. నేను వెళుతున్నాను" అని అతను అదృశ్యమైనాడు.

అతను అలా వెళ్ళిన వెంటనే ఎవరో పరిగెత్తుకు వస్తున్న అడుగుల చప్పుడు వినిపించింది ఆమెకి. కళ్ళు గట్టిగా మూసుకుని నేలమీద పడుకుంది.

అతను పరిగెత్తాడు. మెట్లమీదనించి ఎవరో వస్తున్నారు. వాళ్ళకి కనిపించకూడదు. వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత తన గదికి వెళ్ళవచ్చు. లేదా తనూ భోజనాల సావిడివైపు వెళ్ళవచ్చు అనుకుని చటుక్కున మేడకింద ఉన్న గూడులోపలికి వెళ్ళాడు.

చీకటిగా ఉంది. మెట్లమీద అడుగుల ధ్వని వినిపిస్తోంది. తను చప్పుడు చెయ్యకూడదు. ఆ గూడు కింద తను కాక మరెవరో ఉన్నట్లు తోచింది. ఎవరో ఊపిరి వొదిలినట్లు అనిపించింది. ఎవరో ఉన్నారని స్పష్టంగా తోచింది. చీకట్లోకి చూశాడు. అస్పష్టంగా ఓ ఆకారం కనిపించింది. అతను పిరికివాడు కాదు, అతనికి దెయ్యాల్లో నమ్మకం లేదు.

"ఎవరు?" అడిగాడు నెమ్మదిగా. చెయ్యి ముందుకి చాచాడు. అతని చేతికి ఓ చెయ్యి తగిలింది. ఒళ్ళు ఝల్లుమన్నది. చెయ్యి వెనక్కి తీసుకున్నాడు. మరుక్షణం రెండు బలమైన చేతులు అతని గొంతు పట్టుకున్నాయి.

అరవడానికి ప్రయత్నించాడు కాని నోరు పెగలలేదు. తన్నడానికి ప్రయత్నించాడు కాని ఆ గూడు కింద ఆ కాస్త చోటులో కదిలేందుకే వీలులేదు. చేతులు వెనక్కి వంచి తన గొంతు పట్టుకున్న చేతులు విడిపించుకోవడానికి ప్రయత్నించాడు. కాని ఊపిరి ఆడక, కళ్ళు తేలిపోతున్న ఆ సమయంలో చేతులకి సత్తువ ఎక్కణ్ణించి వస్తుంది. రొమ్ము బద్దలైపోతున్నట్లు, తల పగిలిపోతున్నట్లు ఉంది.

ఊపిరి ఆగిపోతోంది.

గొంతుమీది చేతులు మరింత బలంగా గొంతు పిసికేస్తున్నాయి. అతను తలవాల్చేశాడు.

## 12

శ్రీనివాసరావు గబగబా మెట్లు దిగాడు. వంటింటివైపు నించి ఆ కేకలు వచ్చాయని అతనికి తెలుసు. అటువైపు పరిగెత్తాడు. అంతా చీకటిగా వుంది. అయినా అతనికి ఇబ్బందిలేదు. అతను పుట్టి పెరిగిన ఇల్లు అది.

నడవాలో ప్రవేశించాడు. "కేకలు ఆపండి. వస్తున్నాను" అని అరిచాడు శ్రీనివాసరావు. లచ్చి, సుబ్బమ్మ ఆగకుండా కేకలు వేస్తూనే ఉన్నారు. చీకట్లో కాలికేదో తగిలింది. పరిగెత్తుతుండగా కాలికి ఏదో తగలడం వల్ల నిలువునా కిందపడ్డాడు శ్రీనివాసరావు. తల నేలకి

కొట్టుకుని దిమ్మెక్కిపోయింది మోచేతులు గోడకి గీసుకున్నాయి. లేచి కూర్చుని తల విదిలించాడు. తన కాలికి ఏమిటా తగిలిందని చూశాడు. ఎవరో పడుకున్నారు నడవాలో. చీకట్లో అది ఎవరో గుర్తుపట్టలేకపోయాడు.

"ఎవరది?" నడవాలో పడుకున్న మనిషి అడిగింది.

"నువ్వా లక్ష్మీ ఇక్కడెందుకు పడుకున్నావు?" అడిగాడు శ్రీనివాసరావు.

"నేనెక్కడ పడుకున్నాను బావగారూ?" అడిగింది లక్ష్మి లేచి కూర్చుని.

"భోజనాల సావిటికి వెళ్ళే నడవాలో" అన్నాడు శ్రీనివాసరావు.

"నిజంగానా! నేను నా గదిలో పక్కమీద పడుకున్నానే" అన్నది లక్ష్మి.

"ఆ విషయం తర్వాత ఆలోచిద్దాం. వంట యింట్లో ఏదో గలాభా జరుగుతోంది. వెళ్ళాలి" అంటూ శ్రీనివాసరావు పరిగెత్తాడు.

"ఉండండి. నాకు భయమేస్తోంది. నేనూ వస్తున్నాను" అంటూ లక్ష్మి అతని వెంట వంట యింటివైపు పరిగెత్తింది.

లాంతరు కిందపడి చిమ్నీ పగిలింది కాని వత్తి కాలుతూనే ఉంది. వంట ఇంటి తలుపు దగ్గరే నేలమీద కూలబడి సుబ్బమ్మ పొలికేకలు పెడుతోంది. భోజనాల సావిడి గుమ్మం దగ్గర నిలబడి లచ్చి అరుస్తోంది.

"ఏమిటి? ఎందుకు అరుస్తున్నారు?" అడిగాడు శ్రీనివాసరావు.

"అయ్యా! అయ్యా" అన్నది లచ్చి.

"ఏం జరిగింది?" అడిగాడు శ్రీనివాసరావు కాస్త కోపంగా.

"సుబ్బమ్మగారు అరుస్తుంటే నేనూ అరిచాను" అన్నది లచ్చి. శ్రీనివాసరావు సుబ్బమ్మని సమీపించి, రెండు భుజాలూ పట్టుకుని కూర్చోపెట్టి "భయంలేదు. నేను ఉన్నానుగా. ఏమైంది?" అడిగాడు.

సుబ్బమ్మ కేకలు ఆపింది. గజగజ వొణుకుతోంది. వేలితో వంట ఇంటివైపు చూపించింది. శ్రీనివాసరావు లాంతరు తీసుకున్నాడు. చిమ్నీ లేని లాంతరు కదిపితే ఆరిపోతుందని జాగ్రత్తగా పట్టుకుని వంట ఇంట్లో ప్రవేశించాడు.

లాంతరు వెలుగు, అందులో చిమ్నీ లేని లాంతరు వెలుగు ఆ చీకట్లో విచిత్రమైన వెలుగు నీడలని కల్పించింది. బిందె ఆకారం గోడమీద పదింతలుగా కనబడుతోంది. సుబ్బమ్మను అంతగా భయపెట్టిందేమిటి? ఈ నీడలేనా? అనుకుంటూ వంట ఇల్లంతా కలయ చూశాడు శ్రీనివాసరావు. చివరికి తలుపు పక్కకి దృష్టి తిప్పాడు. తలుపు పక్కగా ఓ మూల ఉట్టివుంది. ఆ ఉట్టికి వేళ్ళాడకట్టి వుంది దిష్టిబొమ్మ. గడ్డితో చేసిన దిష్టిబొమ్మ అది. కళ్ళు గుండ్రంగా నల్లని రెండు కంతలు, నల్లని నోరు, నల్లని ఉండ ముక్కు, నలుపు రంగువేసిన గడ్డి జూలులా వేళ్ళాడుతోంది తలమీదనించి. కాళ్ళులేవు, మొండెం మాత్రం ఉంది.

"పెరట్లో వంగ తోటలో వున్న దిష్టిబొమ్మ కదూ ఇది?" అన్నాడు శ్రీనివాసరావు.

"ఏమోనయ్యా!" అన్నది సుబ్బమ్మ కొంచెం తేరుకుని.

"ఇది దిష్టిబొమ్మ. వచ్చి చూడు సుబ్బమ్మా! భయంలేదు. దెయ్యం కాదు" అన్నాడు శ్రీనివాసరావు.

భయపడుతూనే సుబ్బమ్మ వంట ఇంట్లోకి తొంగి చూసి "అవును. వంగ తోటలో ఉన్న దిష్టిబొమ్మే. వీరయ్య చేశాడు యీ బొమ్మ" అన్నది.

"వంట యింట్లోకి ఎలా వచ్చింది?"

సుబ్బమ్మ! నువ్వు యీ రాత్రికి ఆ వసారాలో పడుకో. లచ్చీ, వీరయ్యా నీకు తోడుంటారు" అని శ్రీనివాసరావు భోజనాల సావిడిలోంచి బైలుదేరాడు. శ్రీనివాసరావు వెనకే మిగతావాళ్ళు బయలుదేరారు.

"ఏమ్రా అందరూ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోతే నేనేం కాను?" అన్నది దుర్గ.

"నువ్వూ నీ గదిలోకి వెళ్ళి నిద్రపో!" అన్నాడు శ్రీనివాసరావు.

"నేనొక్కతెనా! చచ్చినా ఒంటిగా వెళ్ళను. ఆయన వచ్చేంతవరకూ తోడుండరా" అన్నది దుర్గ దీనంగా.

శ్రీనివాసరావు ఆగాడు. తతిమ్మా వాళ్ళూ ఆగిపోయారు.

"కిట్టూ! రామచంద్రరావు ఎక్కడున్నాడో చూసి పిలుచుకురా" అన్నాడు శ్రీనివాసరావు.

క్రిష్ణమూర్తి భోజనాల సావిట్లోంచి పెరట్లోకి వెళ్ళి "రామచంద్రరావూ!" అని కేకవేశాడు. జవాబు లేదు. తిరిగి వచ్చి "అయిదు నిమిషాలు కాచుకుందాం" అన్నాడు. పది నిమిషాలయినా రామచంద్రరావు జాడలేదు.

"లక్ష్మిలా అతనూ మరెక్కడన్నా పడుకుని నిద్రపోతున్నాడేమో?" అన్నాడు శ్రీనివాసరావు.

"లక్ష్మి ఎక్కడ పడుకుని నిద్రపోయింది?" అడిగాడు ప్రభాకరరావు. శ్రీనివాసరావు చెప్పాడు.

"కేకలు వినపడగానే నేను పరిగెత్తుకు వచ్చాను. నా వెనకే లక్ష్మీ వచ్చిందనుకున్నాను. నాకు తెలియదే యీ విషయం" అన్నాడు ప్రభాకరరావు.

"ఆడవాళ్ళు ఇంకా భయపడడం తప్ప జరిగినదాన్ని గురించి తలుచుకుని ప్రయోజనం ఏమిటి? కిట్టూ, వెంకటరత్నం మీరిద్దరూ ఇల్లంతా వెతకండి. రామచంద్రరావు ఎక్కడన్నా పడుకుని నిద్రపోతున్నాడేమో" అన్నాడు శ్రీనివాసరావు. క్రిష్ణమూర్తి, వెంకటరత్నం లాంతరు తీసుకుని వెళ్ళిపోయారు.

"ఇన్ని అఘాయిత్యాలూ, ఘోరాలూ జరుగుతూ వుంటే మనమంతా ఇంకా యీ ఇంట్లో ఉండడం దేనికి? ఎవరి దారిన వాళ్ళం ఊళ్ళకి వెళ్ళడం వివేకమైన పనేమో?" అన్నది కమల పిల్లల్నిద్దర్నీ దగ్గరికి లాక్కుంటూ.

**"నేనూ అదే అన్నాను** ఆయనతో. ఈ మొగాళ్ళు వినిపించుకుంటేగా.. మొండి ధైర్యం" అన్నది సావిత్రి.

"ఆలోచించగా నువ్వు చెప్పినదే వివేకమైన పనేమో అనుకుంటాను కమలా! కర్మా యిత్యాదులు నేను మద్రాసులో మా యింట్లో చేస్తాను. రాదలచుకున్న వాళ్ళు మద్రాసుకు రండి" అన్నాడూ శ్రీనివాసరావు.

అందరూ ఒక్కసారిగా నిట్టూర్చారు.

"అయితే ఆలస్యం దేనికి? రేపు పొద్దున్నే బయలుదేరవచ్చుగా" అన్నది కమల. శ్రీనివాసరావు తల వూపాడు.

"బావ ఎక్కడా లేడు" అన్నాడు క్రిష్ణమూర్తి అక్కడికి వచ్చి.

"తలుపులు అన్నీ వేసి ఉన్నాయా?" అడిగాడు శ్రీనివాసరావు.

"అదే విచిత్రం. పెరట్లోకి వెళ్ళే తలుపు ప్రభ తీసి తిరిగి వచ్చి వేశాడు.

ఇంకే తలుపూ తీసి లేదు. అన్నీ వేసే ఉన్నాయి" అన్నాడు క్రిష్ణమూర్తి.

"అయితే ఇంట్లోనే ఎక్కడో ఉండి వుండాలి. సరిగా వెతికారా? పూజామందిరంలో చూశారా?" అడిగాడు శ్రీనివాసరావు.

"ఆహా! పూజగదీ, స్నానాల గదీ, కొట్టుగదీ అన్నీ వెతికాం. ఎక్కడా లేడు" అన్నాడు వెంకటరత్నం.

"తలుపులన్నీ వేసివుండగా మనిషి కనిపించకుండా యెలా పోతాడు? సరిగా వెతకలేదన్నమాట" అన్నాడు శ్రీనివాసరావు విసుగ్గా.

అన్నకి ఎదురు జవాబు చెప్పటం యిష్టంలేక క్రిష్ణమూర్తి మౌనంగా ఉండిపోయాడు.

"నేనూ, కిట్టూ ఆడవాళ్ళకి ఇక్కడ తోడుంటాము. నువ్వూ, ప్రభా వెళ్ళి వెతకండి" అన్నాడు వెంకటరత్నం.

"రా ప్రభా!" అంటూ వెంకటరత్నం చేతిలోంచి లాంతరు తీసుకుని శ్రీనివాసరావు బయలుదేరాడు.

## 13

వెంకటరత్నం, క్రిష్ణమూర్తి వెతుకుతూ వచ్చినపుడు వసంత గదిలోకి వెళ్ళి రామచంద్రరావు కనిపించాడా అని రాధని అడిగారు. అసలు గొడవేమిటి అని రాధ అడగ్గా వసంతకి వినిపించకుండా రహస్యంగా చెప్పారు.

"రామచంద్రరావు బావ యిటు రాలేదు. చప్పుడు చెయ్యకండి. అక్కయ్య మళ్ళీ నిద్రపోయింది. పాపం ఆ బాత్‌రూం సంఘటనతో మతిపోయినంత పనయింది" అన్నది రాధ.

పదిహేను నిమిషాల తర్వాత శ్రీనివాసరావు, ప్రభాకరరావు అక్కడికి వచ్చారు. "రామచంద్రరావు కనిపించాడా?" అడిగాడు శ్రీనివాసరావు.

"లేదే? ఇందాక కిట్టు, వెంకటరత్నం బావా వచ్చారు వెతుక్కుంటూ" అన్నది రాధ.

రామచంద్రరావు యింట్లో ఎక్కడా కనిపించలేదనీ, తలుపులన్నీ వేసిన గడియలు వేసినట్లు వున్నాయనీ, రేపు యిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నామనీ చెప్పాడు శ్రీనివాసరావు.

"ప్రభ అన్నయ్య?" అడిగింది రాధ.

"ఊళ్ళో యింకో యిల్లు తీసుకుంటాడు" అన్నాడు శ్రీనివాసరావు. ప్రభాకరరావు ఏం మాట్లాడలేదు.

రాధ నిట్టూర్చి "ఈ గొడవలకి మూలకారణమేమిటో తెలుసుకోవాలని వుంది. కానీ -" వాక్యం పూర్తి చెయ్యకుండా ఆపేసింది.

శ్రీనివాసరావు నవ్వి "నాకూ వుంది. పోనీ మనిద్దరం వుండిపోదామా ఏమిటి?" అన్నాడు.

రాధ కూడా నవ్వి "నాకు అంత ధైర్యం లేదు" అన్నది.

"సరే, నిద్రపొండి" అని వెళ్ళిపోయారు శ్రీనివాసరావు ప్రభాకరరావుని వెంటపెట్టుకుని.

"రాధా!" పిలిచాడు సుందరరావు మృదువుగా.

"ఏమిటి?" అడిగింది రాధ.

"రేపు ఎవరిదారిన వాళ్ళు ఊరికి వెళ్ళిపోతున్నాంగా?" అన్నాడు నెమ్మదిగా.

"అయితే?" అన్నది రాధ.

"రాధా" అని నిట్టూర్చాడు సుందరరావు.

"నీకు మళ్ళీ జబ్బేదో వస్తున్నట్లున్నది" అన్నది రాధ నవ్వుతూనే.

"నువ్వు అంటే నాకెంత యిష్టమో నీకు తెలియదు" అన్నాడు అతను.

"పాపం, అక్కయ్య నిద్రపోతోందికదా అని యిలాటి మాటలా" అన్నది రాధ.

"ఇటువంటి అవకాశం మళ్ళీ దొరక్కపోవచ్చు" అన్నాడు సుందరరావు.

"ఇటువంటి అవకాశం మళ్ళీ కలగకుండా వుండేందుకు నా సర్వశక్తులా ప్రయత్నిస్తాను" అన్నది రాధ నవ్వుతూ.

"రాధా!"

"ఆ!"

"నువ్వు చాలా నిర్మలమైన మనిషిలా మాట్లాడతావేం?" అన్నాడు సుందరరావు.

"అంటే?" కోపంగా అడిగింది రాధ.

"మీ కాలేజీలో జోసెఫ్ అనే కుర్రాడితో -"

"నీకెలా తెలుసు?" అడిగింది రాధ.

"తర్వాత మోహన్ అనే కుర్రాడితో -"

"నీకీ విషయాలన్నీ ఎలా తెలుసు?" రాధ అతన్ని సమీపించింది.

"ఎలా తెలిస్తేనేం? నేనొక్కణ్ణే పనికిరాకపోయానా?" అడిగాడు సుందరరావు వెటకారంగా.

"ఏయ్! సుందరరావు. నేను చాలా నిర్మలమైన మనిషినని నీతో చెప్పలేదు. విచ్చలవిడిగా తిరిగే మనిషినే కావచ్చు. కానీ మా అక్కయ్య కట్టుకున్న మొగుడితో సంబంధం పెట్టుకునేంత నీచురాల్ని కాదు. వసంతంటే నాకు చాలా యిష్టం. ఇక మళ్ళీ యీ విషయం మాట్లాడక" అని ఆ గదిలోంచి రాధ చరచరా వెళ్ళిపోయింది.

సుందరరావు విసుగ్గా సిగరెట్ వెలిగించి "డామ్ ది ఉమన్" అన్నాడు.

రాధ చరచరా మెట్లు దిగింది. మెట్ల కిందకి చేరుకునే సమయానికి కుడివైపు నించి శ్రీనివాసరావూ, ప్రభాకరరావూ ఎదురు వచ్చారు. రాధ చెయ్యి శ్రీనివాసరావు చేతిలో లాంతరకి తగిలి కింద పడింది చిమ్నీ పగిలి గాజు ముక్కలు అటూ యిటూ పడ్డాయి.

"ఏం రాధా! ఏమైంది? అలా పరిగెత్తుకు వస్తున్నావేం?" అడిగాడు శ్రీనివాసరావు.

"ఏం లేదన్నయ్యా! నేనూ రామచంద్రరావు బావకోసం వెతుకుదామని వచ్చాను."

"అబద్ధం చెబుతున్నావు. ఏదో జరిగింది. ఏవిటి చెప్పు!" అన్నాడు శ్రీనివాసరావు.

"అబ్బబ్బ! ఏం లేదన్నయ్యా! త్వరత్వరగా మెట్లు దిగాను. అంతే."

"సరే, కదలక. ఆ గాజుముక్కలు నేలమీదంతా పడ్డాయి" అన్నాడు శ్రీనివాసరావు.

"నేను చెప్పులు వేసుకున్నాను. బహుశా నీకు చెప్పులు వుండి వుండవు" అన్నది రాధ.

"అవును రాధా! నేను చెప్పులు వేసుకుని రాలేదు" అన్నాడు శ్రీనివాసరావు.

"అయితే మీరిద్దరూ యిక్కడే ఉండండి. నేను కిట్టు అన్నయ్య గదికి వెళ్ళి దీపం తెస్తాను" అని రాధ వెళ్ళి కాసేపట్లో లాంతరు తీసుకు వచ్చింది.

"అదేమిటి చేతిలో?" అడిగాడు ప్రభాకరరావు.

"చీపురు. ఈ గాజు పెంకులు ఊడ్చి ఓ మూలకు తోసెయ్యొద్దూ! లేకపోతే ఎవరికన్నా గుచ్చుకుంటాయి" అన్నది రాధ.

"ఈ యింట్లో మనందరికన్నా ప్రెజన్స్ ఆఫ్ మైండ్ రాధ ఒక్కతికే ఉంది. ఆ లాంతరు యిలా తే, నేను పట్టుకుంటాను" అన్నాడు శ్రీనివాసరావు.

రాధ చీపురుతో ఊడవడం ప్రారంభించింది. గాజు పెంకులన్నీ ఓ పక్కకి తోసింది. వాటిని చీపురుతో మెట్ల కింది గూడువైపు తోస్తోంది.

"చాల్లే. అటు ఎవరు వస్తారు?" అన్నాడు శ్రీనివాసరావు.

"ఎందుకయినా మంచిది, ఆ గూడు కిందికి తోసేస్తాను" అన్నది రాధ.

శ్రీనివాసరావు లాంతరు వెలుగు చూపిస్తూ కొంచెం ముందుకి జరిగాడు. రాధ వొంగి ఆ గాజు పెంకులని గూడు కిందికి తోయబోయి చటుక్కున వెనక్కి అడుగు వేసి శ్రీనివాసరావు చెయ్యి గట్టిగా పట్టుకుంది.

"ఏమిటి రాధా?" అడిగాడు శ్రీనివాసరావు కంగారుగా. శ్రీనివాసరావు ముందుకి అడుగువేసి, లాంతరు పెట్టి తొంగి చూసి "ఇంకెవరూ రామచంద్రరావు. ఈ గూడు కిందికి వచ్చి ఎందుకు పడుకున్నాడో?" అంటూ "రామచంద్రరావూ!" అని పిలిచాడు.

రామచంద్రరావు పలకలేదు.

"చాలా గాఢ నిద్రలో ఉన్నట్లున్నాడు. ప్రభా! ఆ గూడు కిందకి వెళ్ళి అతన్ని లేపు" అన్నాడు శ్రీనివాసరావు. ప్రభాకరరావు గూడు కిందికి వెళ్ళి "రామచంద్రరావూ లేవవయ్యా!" అంటూ అతన్ని తోశాడు.

"ఇంకా లేవడంలే?" అడిగాడు శ్రీనివాసరావు.

"అన్నయ్యా! నువ్వు రావలసిందే" అన్నాడు హీన స్వరంలో ప్రభాకరరావు. శ్రీనివాసరావు లాంతరు నేలమీద పెట్టి గూడు కిందికి వొంగాడు. "ఎందుకు లేవడం లేదు?" అడిగాడు తమ్ముణ్ణి.

"ఇక అసలు లేవడనుకుంటాను. నాడి లేదు" అన్నాడు ప్రభాకరరావు.

"నాన్‌సెన్సు. నాడి విషయం నీకేం తెలుసు?" అంటూ రామచంద్రరావు జబ్బ పట్టుకుని లాగాడు శ్రీనివాసరావు. రామచంద్రరావు మొహం గోడవైపు ఉండడం వల్ల శ్రీనివాసరావు అతని మొహం చూడలేదు. కానీ జబ్బ పట్టుకుని లాగుతున్నప్పుడే ప్రాణం లేదని గ్రహించాడు. గూడు కింద నుంచి బయటికి లాగగానే శ్రీనివాసరావు లాంతరు తీసుకుని రామచంద్రరావు మొహం మీద వెలుగు వేసి చూశాడు.

కళ్ళు గుడ్లు వెళ్ళుకు వచ్చాయి. నాలిక నోట్లోంచి బయటికి వచ్చి ఉబ్బిపోయింది. మొహం అంతా నల్లబడిపోయింది. మెడ ఉబ్బింది.

గుండె మీద చెయ్యిపెట్టి చూశాడు. తర్వాత నాడి చూశాడు. "క్విక్, త్వరగా కాళ్ళు పట్టుకో. రాధా! లాంతరు తీసుకో" అని భుజం పట్టుకుని రామచంద్రరావుని పైకి ఎత్తాడు. ప్రభాకరరావు కాళ్ళు పట్టుకున్నాడు. మెట్ల అవతలకి తీసుకురాగానే "ఊఁ! పడుకోపెట్టు" అన్నాడు శ్రీనివాసరావు. వెంటనే ఆర్టిఫిషియల్ రిస్పిరేషన్ ప్రయత్నించాడు. రెండు నిమిషాల తర్వాత నుదుటి మీద చెమట బొట్లు తుడుచుకుని "ఆశ అనేది అలా ఉంటుంది. పోయాడని తెలిసీ డాక్టర్ని నేనే –" అన్నాడు శ్రీనివాసరావు.

రాధ నివ్వెరపోయి చూస్తూ నిలబడింది. నోట మాటలేదు. ప్రాణం పోయిన రామచంద్రరావు కట్టెలా పడి ఉన్నాడు వికృతంగా ఉన్న అతని మొహం చూసి "ఏమిటి అయింది అన్నయ్యా!" అడిగింది రాధ.

శ్రీనివాసరావుకు కూడా ఓ పట్టాన నోట మాట రాలేదు. రామచంద్రరావుని కాసేపు చూసి, మౌనంగా వుండి తరవాత "ఏన్ఫిక్సియా లక్షణాలు కనపడుతూనే ఉన్నాయి. మెడ ఉబ్బింది. నల్లని ఆ గుర్తులు చూడు. ఎవరో గొంతు పట్టుకుని ప్రాణం పోయేంత వరకు పిసికారు" అన్నాడు. రాధ కళ్ళు మూసుకుని "అన్నయ్యా! భయమేస్తోంది" అన్నది.

"రాధా! ఇటువంటి పరిస్థితులలోనే ధైర్యంగా ఉండాలి సుమా! నువ్వూ, సావిత్రీ పిల్లల్ని వసంత గదిలోకి తీసుకు వెళ్ళి నిద్రపుచ్చడానికి ప్రయత్నించండి. దుర్గకి చెప్పాలి. చెప్పక తప్పదు. పాపం దాని గుండె బద్దలవుతుంది. దాని దుఃఖం నేను చూడలేను" అంటూ శ్రీనివాసరావు మొహానికి చెయ్యి అడ్డుపెట్టుకున్నాడు. కాసేపాగి "దుర్గని మా గదికి తీసుకు వెళ్ళమని చెప్పు కమలని. క్రిష్ణమూర్తినీ, వెంకటరత్నాన్నీ యిక్కడికి రమ్మను. ప్రభా! నువ్వు రాధకి తోడు వెళ్ళు" అన్నాడు.

శ్రీనివాసరావు గోడకి జారగిలబడి నిలుచున్నాడు. రామచంద్రరావు మొహం వైపు చూడకుండా ఉందామన్నా ఉండలేకపోయాడు. అతని మొహాన్నే చూస్తున్నాడు దెయ్యమే చేసిందా యీ పని. ఇల్లు ఖాళీచేసి వెళ్ళాలని నిన్నే నిశ్చయం చేసుకుని, నిన్న పొద్దున్నే ఎవరి

దారిన వాళ్ళం వెళ్ళిపోయి వుంటే యీ ఘోరం జరిగి వుండేదికాదు. ఇల్లాంటి ఆలోచనలు ఏవేవో అతని మనస్సులోకి వస్తున్నాయి. అంతలో ఘొల్లుమని ఏడుపు వినిపించింది. అది దుర్గ ఏడుపు. దుర్గతోపాటు రాధ, కమల, సావిత్రీ కూడా ఏడుస్తున్నారు.

శ్రీనివాసరావు గుండె ఎవరో పట్టి పిసుకుతున్నట్లు అయింది. రామచంద్రరావుకి ముప్పయి ఏళ్ళు, ఇద్దరి పిల్లల తండ్రి. తెలివైనవాడు. వృద్ధిలోకి రావలసిన మనిషి. అతనికి యీ దుర్మరణం ఏమిటంట. ఇక దుర్గ గతేం కాను. తిండికి ఉండదని కాదు. తనుండగా అటువంటి స్థితి ఎన్నడూ రాదు. కాని దుర్గ వితంతువు. జబ్బు చేయడం, ప్రమాదం కావడం, మానసికంగా భర్త మరణానికి తయారు కావడం ఏమీలేదు. రాత్రి భోజనాల వేళ కులాసాగా వున్నాడు మాట్లాడాడు, నవ్వాడు. అర్ధరాత్రికల్ల లేడు.

ఇది దెయ్యం పనికాదు. దెయ్యమైతే తన తండ్రి దెయ్యమేగా! తన అల్లుడిని చంపుతాడా! శ్రీనివాసరావు తల విదిలించాడు.

"అన్నయ్యా!" అంటూ భుజం మీద చెయ్యి వేశాడు క్రిష్ణమూర్తి.

"కిట్టూ! చాలా ఘోరం జరిగింది."

"దుర్గ రోదన వినలేకుండా ఉన్నానయ్యా!"

"ఏం చేస్తాం కిట్టూ!" అంటూ తమ్ముడి చెయ్యి పట్టుకున్నాడు శ్రీనివాసరావు.

"వొద్దమ్మా! ఇప్పుడొద్దు. తర్వాత" కమల దుర్గని వారిస్తోంది.

"నేను చూస్తాను. చూడాలి. అయ్యో! ఆయన్ని చూడాలి. ఇంకా ప్రాణం ఉందేమోనన్రా! అన్నయ్యా శీను అన్నయ్యా సరిగా పరిక్ష చేశావా? రాధా నువ్వా యేం చేయలేవుటే? ఎందుకర్రా మీ డాక్టర్లు" పిచ్చిగా కేకలు వేస్తూ వచ్చింది దుర్గ.

శ్రీనివాసరావు చెల్లెలి దుఃఖం చూడలేక మొహం తిప్పేసుకున్నాడు. దుర్గ నేలమీద పడున్న తన భర్తని సమీపించింది. వెలుగు మొహం మీద పడేటట్లు లాంతరు జరిపింది.

"అన్నయ్యా! చూడన్నయ్యా! పాపం ఎంత బాధ పడుతున్నారో యేం చెయ్యలేరా? ఇంజక్షన్ యివ్వు అన్నయ్యా. ఆ స్టెతస్కోప్ తీసుకురా గుండె కొంచెం కొట్టుకుంటోంది చూడు, సరిగా చూడు."

దుర్గకి మతిపోయింది. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతోంది. రామచంద్రరావు జుట్టులోకి చెయ్యి పోనిచ్చి "మీరెందుకండీ బయటికి వెళ్ళారు? ఎక్కడ అలికిడి అయినా ఎందుకండీ మీరు వెళ్ళడం? నిన్ననే వూరికి వెళదామంటే విన్నారా! అందర్నీ వొదిలి వెళ్ళడం ఎలా? అందరితోపాటు వెళదాం అని ఎందుకున్నారండీ? ఈ ఘోరమైన చావుకోసమేనా. ఇప్పుడు అందర్నీ వదిలి ఎలా వెళ్ళారండీ?" అని గగ్గోలు పెడుతోంది.

"దుర్గా! లేవమ్మా లే" అంటూ శ్రీనివాసరావు దుర్గని రెండు భుజాలు పట్టుకుని లేవనెత్తాడు.

దుర్గ శ్రీనివాసరావు ఛాతీమీద తల కొట్టుకుంటూ "అన్నయ్యా! నేనింక బతకడం ఎలా అన్నయ్యా? ఎందుకు అన్నయ్యా నేను బతకడం." అని వెక్కి వెక్కి యేడుస్తోంది.

నెమ్మదిగా దుర్గని నడిపించుకుంటూ క్రిష్ణమూర్తి గదిలోకి తీసుకు వెళ్ళి చాపమీద పడుకోపెట్టి, చెల్లెలి తల నిమురుతూ పక్కనే కూర్చున్నాడు శ్రీనివాసరావు.

దుర్గ వెక్కి వెక్కి యేడుస్తోంది. కమల, సీత చెరో పక్కన కూర్చుని కళ్ళు తుడుచుకుంటున్నారు. అహల్య చాపమీద చతికిలబడి చెల్లెలి తల తన వొళ్ళోకి లాక్కున్నది. "దుర్గా! దుర్గా!" అంటూ యేడవడం ప్రారంభించింది. రాధ పిల్లల్నందరినీ భోజనాల సావిట్లో చాపవేసి పడుకోపెట్టింది.

మెట్ల దగ్గర శవం ఉన్న చోటికి వెంకటరత్నం, క్రిష్ణమూర్తి, సుధాకర్, ప్రభాకరరావు చేరుకున్నారు. చెల్లెల్ని ఆడవాళ్ళకి అప్పచెప్పి శ్రీనివాసరావు కూడా శవం ఉన్న చోటికి చేరుకున్నాడు.

"సుందరరావు గదిలోంచి వూడిపడలేదే?" అన్నాడు సుధాకర్.

"వసంతని ఒంటిగా వొదిలి ఎలా వస్తాడు?" అన్నాడు శ్రీనివాసరావు.

"చావుకు కారణం ఏమిటన్నయ్యా" అడిగాడు క్రిష్ణమూర్తి.

"చెప్పానుగా, ఎస్ఫెక్సియా. ఊపిరాడక పోయాడు. ఇతర లక్షణాలని బట్టి గొంతు పట్టుకుని పిసకడం వల్ల ఊపిరి ఆడలేదని గ్రహించవచ్చు."

"ఇప్పుడు మనమేం చెయ్యాలి?" అడిగాడు సుధాకర్.

"పోలీసులకి తెలియజేయాలి"

"పోలీసులకా? ఎందుకు? వాళ్ళు దెయ్యాన్ని పట్టుకుంటారా?" అడిగాడు ప్రభాకరరావు.

"దెయ్యం అని మనం అంటున్నాం. పోలీసులు ఎలా నమ్ముతారు. జబ్బు చేసి పోతే అవసరం లేదు కాని లేకపోతే పోలీసులకి తెలియజేయాలి" అన్నాడు శ్రీనివాసరావు. "పోలీసు దర్యాప్తు ప్రారంభం అయితే మనం ఎవరం ఊరు విడిచి వెళ్ళడానికి వీల్లేదా?" అడిగాడు క్రిష్ణమూర్తి.

"ఏమో? పోలీసుల అభిప్రాయాన్ని బట్టి ఉంటుంది. ఏమైనా పోలీసులకి తెలియజేయక తప్పదు. ప్రభా! సుధాకర్‌ని కూడా తీసుకు వెళ్ళి, పోలీసులకి చెప్పిరా. ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం ఒకటి యియ్యి" అని మేడ మెట్లెక్కి పైకి వెళ్ళి, కాసేపట్లో తిరిగి వచ్చి ఓ కాయితం, అయిదు రూపాయల నోటు సుధాకర్ చేతికిచ్చాడు శ్రీనివాసరావు.

సుధాకర్ ఆ కాగితాన్ని చూశాడు.

యుగంధర్!

దయచేసి వెంటనే బయలుదేరి పునుగుపల్లికి రావలసింది.

**శ్రీనివాసరావు జె.**

**మద్రాసు.**

"యుగంధర్, మద్రాసు అంటే అందుతుందా అన్నయ్యా?" అడిగాడు సుధాకర్.

"ఆ! ఆయన టెలిగ్రాఫ్ అడ్రస్ అదే" అన్నాడు శ్రీనివాసరావు.

## 14

**"ఎవరి దగ్గర్నించి?"** అడిగాడు డిటెక్టివ్ యుగంధర్ నిద్రలేచి వచ్చి తలుపు దగ్గర నిలుచున్న తన అసిస్టెంటు రాజుని.

"దయచేసి వెంటనే బైలుదేరి పునుగుపల్లికి రావలిసింది. శ్రీనివాసరావు జె" అని బిగ్గరగా టెలిగ్రాం చదివాడు రాజు. యుగంధర్ చేతి గడియారం చూసుకున్నాడు. రెండు గంటల ఇరవైనిమిషాలయింది. "టెలిగ్రాం ఎప్పుడు ఇచ్చాడు?" అడిగాడు.

"ఒంటి గంటా పదిహేను నిమిషాలకి."

డిటెక్టివ్ యుగంధర్ డ్రెస్సింగ్ గౌను జేబులోంచి సిగిరెట్ తీసి వెలిగించి "టెలిగ్రాం ఎవరిచ్చినదీ తెలుసుకోలేదా రాజూ?" అడిగాడు. రాజు లేదని తల తిప్పాడు.

యుగంధర్ కన్సల్టింగ్ రూంలోకి దారి తీశాడు. అతని వెనకే రాజా వెళ్ళాడు. తలుపు పక్కనున్న దీపం స్విచ్ నొక్కగానే గదంతా వెలుగుతో నిండిపోయింది. గదిలో ఓ పక్కన బల్ల, బల్ల వెనక రివాల్వింగ్ కుర్చీ ఉన్నాయి. యుగంధర్ ఆ కుర్చీలో కూర్చుని "టెలిగ్రాం ఇచ్చిన మనిషి డాక్టర్ జె. శ్రీనివాసరావు, నా స్నేహితుడు" అన్నాడు.

"ఆయన యీ ఊళ్ళోనేగా ఉండడం. పునుగుపల్లికి ఎందుకు వెళ్ళారు?" అడిగాడు రాజు.

"పునుగుపల్లి అతని స్వగ్రామం. తండ్రికి చాలా జబ్బుగా వుందని టెలిగ్రాం వస్తే వెళ్ళాడు. వెళ్ళేరోజు నాకు కనబడి వెళుతున్నానని చెప్పాడు. రాత్రి ఒంటిగంటకు ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాం ఇచ్చాడంటే ఏదో చాలా పెద్ద చిక్కులో వుండి ఉండాలి. నా సహాయం చాలా అవసరమై ఉండాలి" అన్నాడు యుగంధర్.

ఎన్నేళ్ళగానో యుగంధర్‌కి అసిస్టెంటుగా పనిచేస్తుండడం వల్ల ఆయన మనస్సు ఎప్పుడు ఏ తీరున ఆలోచిస్తుందో రాజు ఇట్టే గ్రహించగలడు. పక్కనున్న లైబ్రేరీ గదిలోకి వెళ్ళి పుస్తకాలు తెచ్చాడు. అందులో ఒకటి రైల్వేగైడ్ రెండు నిమిషాల తర్వాత "పొద్దున్న ఏడుగంటలకి ఒక రైలున్నది. రేణిగుంటలో దిగాలి. అక్కడ రైలు మారాలి. సాయంకాలం ఆరుగంటలకి పునుగుపల్లి చేరుకోవచ్చు" అన్నాడు రాజు.

యుగంధర్ ప్రయోజనం లేదని తల విదిలించాడు.

రాజు యింకో పుస్తకం తీశాడు. 'ఇండియన్ హైవేస్' అని వ్రాసి ఉంది దానిమీద. చకచకా కొన్ని పేజీలు తిప్పి "పునుగుపల్లి యిక్కడికి సరిగా నూట అరవై ఆరుమైళ్ళు. రోడ్ బాగానే ఉంటుందంట" అన్నాడు.

"ఆల్‌రైట్! వెంటనే బయలుదేరుదాం. విషయమేమిటో, మన సహాయం దేనికి కావాలో సూచన అయినా చెయ్యలేదు శ్రీనివాసరావు. ఎందుకయినా మంచిది. మైక్రోస్కోప్, వేలిముద్రల పరికరాలు, కెమెరా, రెండు రివాల్వర్స్, స్టెయినింగ్ స్లయిడ్స్ ఇత్యాది సరంజామా అంతా కారులో పెట్టు" అన్నాడు యుగంధర్.

పదిహేను నిమిషాల తర్వాత మళ్ళీ ఇద్దరూ కన్సల్టింగ్ రూంలో కలుసుకున్నారు. రాజు ఓ కాగితం యిచ్చాడు యుగంధర్‌కి. తాము తీసుకు వెళుతున్న వస్తువుల జాబితా అది. యుగంధర్ దాన్ని చదివి "గుడ్! ఇక ఆలస్యం దేనికి? మూడు గంటలయింది. తోవలో పెట్రోలు పోసుకుని, ఆయిల్ మారుద్దాం" అన్నాడు యుగంధర్.

రాజు షెడ్లోంచి క్రిజ్లర్ కారు బైటికి తీసుకొచ్చాడు. యుగంధర్ డిక్కీ తలుపు తెరిచాడు. ఇద్దరూ కలిసి నాలుగు సూట్‌కేసులు, రెండు సంచీలు దిక్కీలో సర్దారు.

మూడుంపావుకల్లా మద్రాసు నగర సరిహద్దులు దాటిపోయింది క్రిజ్లర్‌కారు. రాజు డ్రయివింగ్‌లో ప్రవీణుడు. అరవై మైళ్ళ స్పీడున వెళుతున్న కారు కదులుతున్నట్లు తెలియదు. లారీగాని, వాన్‌గాని ఎదురు వచ్చినపుడు హెడ్‌లైట్స్ ఆర్పుతూ, స్పీడు తగ్గించకుండానే వెళ్ళిపోతున్నాడు.

"ఇదే స్పీడున వెళ్ళామంటే ఏడుగంటలకల్లా పునుగుపల్లికి చేరుకుంటాము" అన్నాడు యుగంధర్.

15

"శ్రీరాములూ! నువ్వు యిక్కడే ఉండు" బొంగురు కంఠస్వరం పలికింది. కరకరా బూడ్సుల చప్పుడు వినిపించింది.

"పోలీసులని తీసుకొచ్చినట్లున్నాడు" అన్నాడు వెంకటరత్నం.

ప్రభాకరరావూ, సుధాకరూ వాళ్ళ వెనక పోలీసు సబ్‌యిన్‌స్పెక్టరూ లోపలికి వచ్చారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ నిద్రలోంచి హడావిడిగా లేచి యూనిఫాం వేసుకున్నాడేమో నిక్కర్లోకి చొక్కా సరిగా దోపుకోలేదు. బెల్టు కూడా వంకరగా ఉంది. ఆ రెండూ సర్దుకుంటూ లోపలికి వచ్చాడు సబ్‌యిన్‌స్పెక్టర్ నారాయణ స్వామి.

"నేను డాక్టర్ జె. శ్రీనివాసరావు. మద్రాసులో ప్రాక్టీసు చేస్తున్నాను. విచిత్రమైన పరిస్థితుల్లో నా బావమరిది రామచంద్రరావు మరణించాడు. ఆ విషయం రిపోర్టు చెయ్యడానికీ, శవాన్ని మీకు అప్పచెప్పడానికీ మిమ్మల్ని పిలిపించాను" అన్నాడు శ్రీనివాసరావు.

నారాయణస్వామి శ్రీనివాసరావునీ, తతిమ్మా వాళ్ళనీ ఒకసారి పరీక్షగా చూశాడు. అతను డైరెక్టుగా సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా రిక్రూట్ అయ్యాడు. సర్వీసులో చేరి ఒకటిన్నర సంవత్సరం అయింది. పునుగుపల్లికి అతన్ని బదిలీ చేసి ఆరునెలలయింది. ఉత్సాహమూ, వృద్ధిలోకి రావాలనే ఆకాంక్ష వున్న ఉద్యోగి అతను. డ్యూటీలో చేరిన యీ కొద్దికాలంలో పెద్ద కేసులేవీ అతని పాలపడలేదు.

"యస్ సార్! దయచేసి వివరాలు చెప్పండి" అన్నాడు నారాయణస్వామి డైరీ, పెన్నూ తీసి.

"ఇది చాలా పెద్ద కథ. వివరంగా చెప్పడం మొదలుపెట్టానంటే ఆ డైరీ చాలదు. అంతా వ్రాయాలంటే పేజీల కొద్దీ వ్రాయవలసి వుంటుంది. కనుక ముందు నా బావమరిది మరణానికి సంబంధించిన వివరాలు చెపుతాను" అని శ్రీనివాసరావు సుబ్బమ్మ కేక విని తామంతా నిద్రలేచి వెళ్ళడమూ, అతనికోసం వెతకడం, చివరకి అతని శవం మెట్ల కింద కనిపించడం చెప్పాడు.

"డాక్టర్! ఈయన చావుకి కారణం ఏమిటో చెప్పగలరా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

""ఎస్ఫిక్సియా. ఊపిరాడక మరణించాడు అలా ఊపిరి ఆడకపోవడానికి కారణం అతని గొంతు నలపబడటమే. మెడమీద గుర్తులున్నాయి. చూడండి ఇన్‌స్పెక్టర్" అన్నాడు శ్రీనివాసరావు.

"రాత్రి రెండు గంటలకి మీరు శవాన్ని చూశారు. సుమారు ఎన్ని గంటల ప్రాంతాన ప్రాణం పోయి ఉండాలి?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"అతనిని మేము చూసే ముందు, ఒక గంటముందు ప్రాణం పోయి ఉండాలని నా ఉద్దేశ్యం. ఒకటిన్నరకీ, రెండు గంటలకీ మధ్య అయ్యుండాలి. ఖచ్చితంగా తెలియాలంటే శవ పరీక్ష చేయాలి. ఎలాగూ మీరు చేయిస్తారు" అన్నాడు శ్రీనివాసరావు. "దయచేసి ఈ ఇంట్లో వున్న వాళ్ళందరి పేర్లూ చెప్పండి" శ్రీనివాసరావు పిల్లలతో సహా అందరి పేర్లూ చెప్పాడు.

"రామచంద్రరావుగారి భార్యతో మాట్లాడడానికి అవకాశం ఉందా?" అడిగాడు నారాయణస్వామి.

"అవకాశానికేం నా చెల్లెలు దుర్గ అప్పటినించీ గుండె పగిలేటట్లు ఏడుస్తోంది. ఈ స్థితిలో ఆమె మీకేమీ సమాధానాలు చెప్పలేదనుకుంటాను. రామచంద్రరావుని ఎవరు హత్య చేసినదీ ఆమెకేమైనా తెలుసునేమోననీ, రామచంద్రరావుకి ఈ ఇంట్లో విరోధులు ఎవరైనా ఉన్నారా అనీ మీరు ఆమెని అడగదలుచుకుంటే ప్రస్తుత పరిస్థితిలో ప్రయోజనం లేదని ముందే చెపుతున్నాను. ఈ ఇంట్లో దెయ్యం ఉన్నదనీ, ఆ దెయ్యమే అతన్ని చంపిందనీ ఇంటిల్లిపాదీ నమ్ముతున్నారు" అన్నాడు శ్రీనివాసరావు.

సబ్‌ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి కనుబొమలు పైకెత్తి ఆశ్చర్యంతో చూశాడు శ్రీనివాసరావుని. అతను సైన్స్ గ్రాడ్యుయేట్. "డాక్టర్! మీ నమ్మకం కూడా అదేనా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"రామచంద్రరావుని చంపడానికి కారణమేదీ కనబడకపోతే దెయ్యమే చంపిందని నేనూ నమ్మడానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు శ్రీనివాసరావు.

"మీరు డాక్టర్"

"అయితే?"

"అటువంటి మూఢనమ్మకం"

"గత రెండు రోజులుగా ఈ ఇంట్లో జరిగిన విషయాలు మీరు చూడలేదు. మీకు తెలియవు. ఈ పని దెయ్యమే చేసిందని నేను అనడంలేదు. కానీ దెయ్యాలలో నమ్మకం లేదనీ అనడం లేదు. ఈ రెండురోజులనించీ జరిగిన సంఘటనలు మీకు చెప్పడం, మీరు వినడం మంచిదనుకుంటాను" అన్నాడు శ్రీనివాసరావు.

సబ్‌ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి తలవూపి "ఎంతసేపు పడుతుంది?" అడిగాడు.

"వివరంగా చెప్పాలంటే గంటా గంటన్నర పట్టవచ్చు."

"సరే!" అని కానిస్టేబుల్ శ్రీరాముల్ని పిలిచాడు నారాయణస్వామి. "నువ్వు ఇక్కడే ఉండు" అని శ్రీనివాసరావు వైపు తిరిగి "క్షమించండి. నేను స్టేషన్‌కి వెళ్ళి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కి ఫోన్ చేసి వస్తాను" అని వెళ్ళాడు.

16

తెల్లారి ఏడుగంటలకల్లా యుగంధరూ, రాజూ పునుగుపల్లి చేరుకున్నారు. ఆ ఊళ్ళోకంతా శ్రీమంతులయిన జయసరుల వారిల్లు కనుక్కోవడం కష్టం కాలేదు.

"ఇదే అయి వుంటుంది. ఆ! ఇదే జయసరుల వెంకట చలపతి శ్రీనివాసరావు తండ్రి పేరు అయి వుండాలి" అంటూ రాజు కారు గేటు ముందు ఆపాడు. గేటునించి ఇంటి గుమ్మం దాదాపు వంద గజాల దూరం వుంది.

గుమ్మం పక్కన వేపచెట్టు కింద ఆగి వున్న జీపుకారునీ, దానిమీద వెనక వైపు 'పోలీస్' అన్న ఎర్ర అక్షరాలనీ చూసి "తిన్నగా లోపలికి పోనియ్యి" అన్నాడు యుగంధర్.

యుగంధరూ, రాజూ కారు దిగగానే "థాంక్ యు యుగంధర్. ఇంత త్వరగా వస్తారని అనుకోలేదు. చాలా థాంక్స్" అన్నాడు కారు దగ్గరికి త్వరత్వరగా నడిచి వస్తూ శ్రీనివాసరావు. పీక్కుపోయిన మొహం, గుంటలు పడ్డ కళ్ళు, చెదిరిన జుట్టు, మాసిన గెడ్డం, డాక్టర్ శ్రీనివాసరావుని చూసి యుగంధర్ ఆశ్చర్యంతో "ఏం జరిగింది?" అడిగాడు ఆతృతతో.

"రండి, లోపలికి రండి. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య ఇప్పుడే వచ్చాడు. ఏం జరిగిందీ అతనికీ, మీకూ అందరికీ ఒకేసారి చెపుతాను. నా బావమరిది రామచంద్రరావు విచిత్ర పరిస్థితులలో మరణించాడు" అని చెపుతూ యుగంధర్నీ, రాజునీ కుడివైపు ఉన్న గదిలోకి తీసుకు వెళ్ళాడు శ్రీనివాసరావు.

పాతకాలపు కుర్చీలు ఆరు, రెండు బెంచీలు ఉన్నాయి ఆ గదిలో. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య చటుక్కున లేచి నిలుచుని "నేను జ్ఞాపకమున్నానో లేదో!" అంటూ యుగంధర్ని పలకరించాడు.

"ఎందుకు జ్ఞాపకం లేరూ! మద్రాసులో నాలుగవ డివిజన్ క్రయిమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఉండేవారుగా. ప్రమీలాదేవి హత్యకేసులో మనమంతా కలిసి పనిచేశాం కదూ!" అన్నాడు యుగంధర్.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య మొహం వికసించింది. "రండి యుగంధర్ కూర్చోండి మిష్టర్ రాజూ. శీనూ ఏం జరిగిందో చెప్పు" అన్నాడు రాఘవయ్య.

"నేనూ, రాఘవయ్య క్లాస్‌మేట్సుం. ఒక ఏడాది కాదు. నాలుగో ఫాం నించి ఇంటర్‌మీడియట్ వరకూ కలిసి చదివాం" సర్కిల్ రాఘవయ్య శీనూ అని తనని సంబోధించడానికి కారణం చెప్పాడు శ్రీనివాసరావు.

క్రిష్ణమూర్తి, సుధాకర్ కిటికీ దగ్గర నిలుచున్నారు. శ్రీనివాసరావు వాళ్ళిద్దర్నీ యుగంధర్‌కి పరిచయం చేశాడు. "ఏం జరిగిందీ చెపుతాను వినండి" అంటూ శ్రీనివాసరావు ఆ రాత్రి జరిగిన విషయాలు వివరంగా చెప్పాడు. సుబ్బమ్మ కేక వేయడం, అందరూ వంట ఇంటివైపు పరిగెత్తడం దగ్గర ప్రారంభించి రామచంద్రరావు శవం కనిపించడం వరకూ చెప్పాడు.

తలుపు దగ్గర నిలుచున్న సబ్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి గొంతు సవరించుకుని "ఈ ఇంట్లో దెయ్యాలున్నాయనీ, ఈ దారుణ హత్య దెయ్యమే చేసిందనీ డాక్టర్‌గారి అభిప్రాయం సార్!" అన్నాడు.

యుగంధరు, రాఘవయ్యా చటుక్కున సబ్‌ఇన్‌స్పెక్టర్ని చూసి అతను పరిహాసానికి ఆ మాట అనలేదని తెలుసుకుని శ్రీనివాసరావు వైపు తిరిగారు.

"సబ్ ఇన్‌స్పెక్టర్ దెయ్యం చేసిందని నేను అనలేదు. దెయ్యం చేసి వుండవచ్చు అన్నాను" అన్నాడు శ్రీనివాసరావు.

"అదేమిటి శీనూ దెయ్యం ఈ హత్యచేసి ఉండవచ్చని నువ్వు అన్నావా! నేను నమ్మలేకుండా ఉన్నాను" అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘువయ్య.

శ్రీనివాసరావు అదోరకంగా చూసి, బలహీనంగా నవ్వి "ఈ హత్య మనిషే చేసి వుండవచ్చు. కాదని నేను అనలేదు" అన్నాడు.

యుగంధర్ కొంచెం ముందుకు జరిగి "అదికాదు శ్రీనివాసరావుగారూ ఈ ఘోరం దెయ్యం చేసి ఉండవచ్చని మీకు అనుమానం ఎందుకు కలిగింది?" అడిగాడు.

"రెండు రోజులుగా ఈ ఇంట్లో జరిగిన సంఘటనల వల్ల" అన్నాడు శ్రీనివాసరావు.

"ఆ సంఘటనలు ఏమిటో చెప్పండి" అని రాజువైపు తిరిగి డైరీలో వ్రాసుకోమని సంజ్ఞ చేశాడు యుగంధర్.

శ్రీనివాసరావు ఒకసారి కళ్ళు మూసుకుని తెరిచాడు. "సిగిరెట్ ఒకటి ఇలా ఇవ్వండి" అన్నాడు.

యుగంధర్ కేసు తెరిచి శ్రీనివాసరావుకి సిగిరెట్ ఇచ్చాడు. గట్టిగా పొగపీల్చి, వొదిలి శ్రీనివాసరావు చెప్పడం మొదలుపెట్టారు. ఉయ్యాల బల్ల ఊగటం దగ్గర ప్రారంభించి రామచంద్రరావు శవం కనిపించే వరకూ జరిగిన సంఘటనలన్నీ వివరంగా చెప్పి "ఈ విషయాలన్నీ విన్న తర్వాత రాఘవయ్యా ఇప్పుడు నువ్వేమంటావు?" అడిగాడు. రాఘువయ్య కాస్త యిబ్బందిగా మొహం పెట్టి "నాకు దెయ్యాలలో నమ్మకం లేదు" అన్నాడు నెమ్మదిగా.

"మీరూ యుగంధర్?" అడిగాడు శ్రీనివాసరావు యుగంధర్ని.

"సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘువయ్యగారిలా దెయ్యాలలో నమ్మకం లేదు అనలేను. మానవాతీతమైన శక్తులు ఏవో ఉన్నాయి. మనకి తెలియని, మన ఊహకి అందని విషయాలు ఎన్నో ఉన్నాయి. దెయ్యాలూ, భూతాలూ, దేవతలూ, చేతబడులూ, మంత్రాలూ యింకా ఏవేవో ఉన్నాయి. అన్నీ మూఢ నమ్మకాలు కావు. శ్రీ గుడిపాటి వెంకటచలంగారు, శ్రీ కొమ్మూరి వెంకట రామయ్యగారు ముప్పయి ఏళ్ళ క్రితం తెనాలిలో వాళ్ళ యింట్లో జరిగిన విచిత్రమైన విషయాల గురించి వివరించి నాకు చెప్పారు. వాళ్ళిద్దరూ చదువుకున్నారు. మూఢనమ్మకాలు లేని వివేకులే. వారు చెప్పిన విషయాలని బట్టి మనుషులు ఎవ్వరూ చెయ్యలేని పనులు జరిగాయి వాళ్ళింట్లో. తల ఇటునుంచి అటు తిప్పేలోగా నీళ్ళ గదిలో పెద్ద పెద్ద గుండిగలు నీళ్ళతో సహా ప్రహరీ గోడమీద ఒక దానిమీద ఒకటి పెట్టి వుండేవిట. మనుష్యులు కూర్చునుండగానే కప్పులోంచి రాళ్ళు వర్షంలా కురిసేవిట. కానీ ఎవరికీ దెబ్బ తగిలేది కాదుట. కన్ను మూసి కన్ను తెరిచే లోపున గదిలో వున్న బల్లలు, కుర్చీలు ఒక దానిమీద ఒకటి పెట్టి వుండేవిట. ఇలాంటివి ఎన్నో జరిగాయట. ఓ ఊళ్ళో ఆరేసిన తడిబట్టలు అకారణంగా వాటంతట అవి మండిపోతుండటం ఆ మధ్య ఫోటోలతో సహా పత్రికలలో వేశారు. ఓ పదేళ్ళ పిల్ల తన పూర్వజన్మ గురించి వివరంగా చెప్పి, పూర్వజన్మలో తన తండ్రి ఎవరో, తన తల్లి ఎవరో తోబుట్టువులెవరో చెప్పిందట. ఆ వివరాలన్నీ

నిజాలేనని రుజువయ్యాయిట. కనుక మానవాతీతమైన శక్తులు ఏవీ లేవని నేను అనలేను. మన గ్రాహ్యతకు అందని, మనం తార్కికంగా సమర్థించలేని విషయాలన్నిటినీ మూఢ నమ్మకాలని తీసి పారెయ్యడం కూడా మూఢనమ్మకమే. మనిషి చెయ్యలేని పని అని నిర్ధారణగా తెలిసినపుడు మానవాతీతమయిన శక్తి ఏదో చేసిందనో, సామాన్య మనుష్యులకు అతీతమయిన శక్తి ఏదో మనిషినే ఆవహించిందనో అనుకోవలసి వస్తుంది'' అన్నాడు యుగంధర్.

''ఇప్పుడు నేను చెప్పిన సంఘటనలనిబట్టి మీ అభిప్రాయం ఏమిటి?'' అడిగాడు శ్రీనివాసరావు.

''ఇప్పటివరకూ మీరు చెప్పిన విషయాలు జాగ్రత్తగా పరిశీలిస్తే మనిషి చెయ్యలేని పని ఏదీ జరగలేదు. నేనూ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవయ్యగారితో ఏకీభవిస్తున్నాను'' అన్నాడు యుగంధర్.

అన్నదమ్ములు ఆశ్చర్యంతో చూశారు యుగంధర్ని.

''మీరు చెప్పిన విషయాలు సూక్ష్మంగా పరిశీలించాలి. ఎవరూ చేసి ఉండడానికి అవకాశం లేదని నిరూపితమయితే దెయ్యమే చేసిందని అంగీకరిస్తాను'' అన్నాడు యుగంధర్ మళ్ళీ.

17

**రామచంద్రరావు** శవం మెట్ల దగ్గరే ఉన్నది. ఒక కానిస్టేబుల్ శవానికి కొంచెం దూరంలో నిలుచున్నాడు. సర్కిల్ ఇన్‌స్పెక్టరూ, యుగంధరూ, రాజూ, సబ్‌ఇన్‌స్పెక్టరూ శవం ఉన్న చోటుకి వెళ్ళారు. శ్రీనివాసరావు వాళ్ళతో వెళ్ళలేదు.

''రిపోర్టు ఇవ్వగానే వచ్చాను. అప్పట్నించీ ఇక్కడికి ఎవ్వర్నీ రానివ్వలేదు. కానిస్టేబుల్ని కాపలా ఉంచాను'' అన్నాడు సబ్‌ఇన్‌స్పెక్టర్. రాఘవయ్య తల ఊపాడు.

యుగంధర్ శవాన్ని సమీపించాడు. నిలుచునే శవాన్ని రెండు నిమిషాలపాటు పరీక్షగా చూశాడు. తర్వాత రాజువైపు తిరిగి ''వెళ్ళి కెమెరా తీసుకురా!'' అన్నాడు.

''ఫోటోగ్రాఫర్‌కి కబురు పంపుదామనుకుంటున్నాను. మీరు ఫోటోలు తీసేటట్లయితే అవసరం ఉండదు. నాకు కాపీలు యిస్తారు కదూ!'' అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్.

యుగంధర్ తల ఊపి, మోకాళ్ళ మీదికి వొంగి శవం మెడ పరీక్షగా చూశాడు. ''చావుకి కారణం యెవరో గొంతు నలపడమే. లక్షణాలన్నీ అలాగే ఉన్నాయి. మరేదయినా కారణం కూడా ఉన్నదేమో శవ పరీక్ష జరిగితే కాని తెలియదు'' అన్నాడు.

''మెడమీద నల్లగా ఉన్న ఆ గుర్తులు హత్యచేసిన మనిషి వేళ్ళ గుర్తులేనా?'' అడిగాడు రాఘవయ్య.

''ఈ గుర్తులనిబట్టి వేళ్ళు చాలా లావుపాటివై ఉండాలని తెలుస్తోంది'' అంటూ యుగంధర్ తన చేతివేళ్ళు పరీక్షగా చూశాడు.

రాఘవయ్య కూడా శవం మెడమీది గుర్తులు పరీక్షగా చూసి, తర్వాత యుగంధర్ చేతి వేళ్ళు చూసి ''అవును. మీ వేళ్ళే చాలా లావు. మీ వేళ్ళకి దాదాపు రెండింతలు లావు ఉండి ఉండాలి'' అన్నాడు యుగంధర్.

సబ్‌యిన్‌స్పెక్టర్ నవ్వి ''అందరిలోకి శ్రీనివాసరావుగారే కాస్త ధాటిగా ఉన్న మనిషి'' అన్నాడు.

అంతలో రాజు కెమెరాతో ఫ్లాష్ గన్‌తో వచ్చాడు. శవాన్ని వేరే వేరే కోణాలనించి ఫోటోలు తీశాడు. ముఖ్యంగా మెడ, మెట్ల కింద గూడు వివిధ కోణాలలోంచి ఫోటోలు తీశాడు.

''టార్చి కూడా తెచ్చావా! గుడ్ ఇలా తే'' అన్నాడు యుగంధర్.

ఆరుసెల్స్ ఉన్న పొడుగాటి టార్చి అది. దాని వెలుగులో మెట్ల కింది గూడుని పరీక్షగా చూశాడు. "బూజు లేదు, దుమ్ము లేదు. ఈ యింట్లో పనిమనిషి చాలా శ్రద్ధగా యిల్లు ఊడుస్తుందనుకుంటాను" అన్నాడు యుగంధర్ గూడు కిందినించి వచ్చేసి. సర్కిల్ ఇన్స్పెక్టరూ, సబ్ ఇన్స్పెక్టరూ యుగంధర్ని ప్రశ్నార్థకంగా చూశారు.

"అడుగుజాడలు ఇత్యాది సూచనలు ఏవీలేవు" అన్నాడు యుగంధర్.

సర్కిల్ యిన్స్పెక్టర్ "శీనూ!" అని కేకవేశాడు. రెండు నిమిషాలలో శ్రీనివాసరావు లోపలనించి వచ్చాడు.

"శవాన్ని శవపరీక్షకి పంపే ఏర్పాటు చేస్తాను" అన్నాడు సర్కిల్ ఇన్ స్పెక్టర్.

శ్రీనివాసరావు తల ఊపాడు.

నారాయణస్వామి ఆదేశాలు ఇచ్చి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావువైపు తిరిగి "స్టేట్మెంట్ వ్రాసి యిస్తావా?" అడిగాడు.

శ్రీనివాసరావు తలవూపి యుగంధర్వైపు తిరిగాడు.

"మీరిందాక చెప్పిన విషయాలన్నీ రాజు వ్రాసుకున్నాడు. నేను ఉండవలసిన అవసరం లేదు" అన్నాడు యుగంధర్.

"కిట్టూ!" అని పిలిచాడు శ్రీనివాసరావు.

"ఆఁ!" అంటూ క్రిష్ణమూర్తి తలుపు వద్దకు వచ్చి నిలబడ్డాడు.

"యుగంధర్నీ, రాజునీ లోపలికి తీసుకువెళ్ళు. కాఫీ ఇప్పించు. రాఘవయ్యకి కూడా కాఫీ పంపించు. నీ గదిలో వాళ్ళకి బస ఏర్పాటు చెయ్యి" అని రాఘవయ్యతో పక్కగదిలోకి వెళ్ళాడు శ్రీనివాసరావు.

వీరయ్యను పిలిచి సామానులు మేడమీద తన గదిలోకి తీసుకువెళ్ళమని చెప్పి, హాల్లోంచి రెండు కుర్చీలు, ఒక పడక కుర్చీ తెచ్చి తన గదిలో పెట్టాడు క్రిష్ణమూర్తి. సుధాకర్ రెండు కప్పుల కాఫీ తెచ్చి బల్లమీద పెట్టాడు.

"మీకేదయినా కావలసి వస్తే పిలవండి" అన్నాడు క్రిష్ణమూర్తి. యుగంధర్ తల ఊపాడు. క్రిష్ణమూర్తి వెళ్ళిపోయాడు.

కాఫీ తాగిన తర్వాత యుగంధర్ పడక కుర్చీలో పడుకుని "రాజా! నువ్వు వ్రాసినది నెమ్మదిగా చదువు" అని కళ్ళు మూసుకున్నాడు.

రాజు డైరీ తెరిచి చదవడం ప్రారంభించాడు. రాజు చదువుతుండగా మధ్య మధ్య ఆగమని, కాసేపు ఆలోచించి, మళ్ళీ చదవమని చెప్పాడు యుగంధర్. రాజు చదవడం పూర్తయింది.

"అవును. ఈ సంఘటనల్లో మనిషి చెయ్యడానికి వీలులేనిది లేదు. ఒకటి తప్ప" అన్నాడు యుగంధర్.

"ఏమిటది?" అడిగాడు రాజు.

"నిద్రపోతున్న లక్ష్మిని ఎత్తుకు తీసుకువెళ్ళి భోజనాల సావిడి దగ్గరున్న నడవాలో పడుకోపెట్టడం" అన్నాడు యుగంధర్.

"కొంచెం విపులీకరించండి" అన్నాడు రాజు.

"విపులీకరించడానికి ఏమున్నది? శ్రీనివాసరావు మరదలు లక్ష్మి ఇద్దరు పిల్లల తల్లి. ఆమె నిన్న రాత్రి తన గదిలో తన భర్త దగ్గర పిల్లలతో పడుకున్నది. ఒక రాత్రివేళ ఎవరో పరిగెత్తుతూ తనని తన్నినట్లయి నిద్ర మేల్కొంది. అప్పుడు నడవాలో పడుకునున్నది. నిద్రపోతున్న మనిషిని ఎత్తుకు తీసుకువెళ్ళి నడవాలో పడుకోపెట్టడం అంత సులభమైన పనికాదు. పైగా మేడమీదనించి కిందికి తీసుకురావడం మరీ కష్టం. ఎత్తుకు తీసుకు వస్తున్నప్పుడు నిద్రనించి మెలుకువ వచ్చి ఉండాలి. మెలుకువ రాకపోవడానికి ఒకే ఒక కారణం ఉంటుంది. ఆమెని ఆ మనిషి ఎత్తుకుని కిందికి తీసుకువెళ్ళే ముందు ఆమెకి మత్తు మందు యిచ్చి ఉండాలి" అన్నాడు రాజు.

"అంత సింపుల్ కాదు. లక్ష్మికి నిద్రమందు ఎవరో ఇచ్చారనుకుంటే, భర్త లేవకుండా పక్కన పడుకున్న లక్ష్మిని ఎలా తీసుకువెళ్ళారు?" తర్వాత సుబ్బమ్మ కేకలు విని అతను నిద్ర లేచినపుడు గది తలుపు తెరిచి ఉన్నదా? లక్ష్మికి నిద్రమందు ఇచ్చి ఉంటే, ఎత్తుకు తీసుకువెళుతున్నా మెలుకువ రానంతగా గాఢమైన మత్తులో ఆమె ఉండి ఉండాలి. అటువంటప్పుడు ఎవరో పరుగెత్తుతున్నట్లయి ఎలా నిద్రలేచింది?" అన్నాడు యుగంధర్.

"అవును. లక్ష్మిని ఎవరో ఎత్తుకు తీసుకువెళ్ళి పడుకోపెట్టి ఉండాలని మనం నిరూపించగలిగాలి. లేకపోతే మానవాతీతమైన శక్తి ఏదో చేసి ఉంటే మిగతావన్నీ, రామచంద్రరావు హత్య కూడా ఆ శక్తే చేసిందని అనుకోవలసి వస్తుంది" అన్నాడు రాజు.

యుగంధర్ తల ఊపి "లక్ష్మిని పిలిపించి మాట్లాడడం మంచిదనుకుంటాను" అన్నాడు.

రాజు తలుపు దగ్గరికి వెళ్ళి "క్రిష్ణమూర్తి గారూ!" అని పిలిచాడు.

క్షణంలో క్రిష్ణమూర్తి గదిలోకి వచ్చాడు. లక్ష్మితో మాట్లాడాలని యుగంధర్ చెప్పగానే, పిలుచుకువస్తానని చెప్పి వెళ్ళిపోయి కాసేపట్లో లక్ష్మిని తీసుకు వచ్చి "మా మరదలు లక్ష్మి. డిటెక్టివ్ యుగంధర్, ఆయన అసిస్టెంట్ రాజు" అని పరిచయం చేసి "నేను కూడా ఉండాలా?" అడిగాడు క్రిష్ణమూర్తి.

"అవసరంలేదు" అన్నాడు యుగంధర్.

క్రిష్ణమూర్తి వెళ్ళిపోయాడు. యుగంధర్ లక్ష్మిని పరీక్షగా చూశాడు. దబ్బపండు వంటి పచ్చని శరీరం. ఒత్తయిన నల్లని సాగి జుట్టు. తీర్చిదిద్దినట్లున్న ముఖరేఖలు. కొంచెం లావుగా ఉన్నా అందంగా ఉన్నది. ఫాషన్ ఏమీ లేదు కానీ మొగాళ్ళని ఇట్టే ఆకర్షించే రూపం ఆమెది.

"కూర్చోండి" అన్నాడు యుగంధర్.

లక్ష్మి కూర్చున్నది. "దయచేసి నిన్నరాత్రి జరిగిన విషయాలు చెప్పండి" అడిగాడు యుగంధర్.

లక్ష్మి గొంతు సవరించుకుని "రాత్రి భోజనాలు అయ్యాయి. అందరం యెవరి దారిన వాళ్ళం గదుల్లోకి వెళ్ళిపోయాం. ఇద్దరు పిల్లల్ని నిద్రపుచ్చి నేనూ పడుకున్నాను" అన్నది.

"మీవారు?" అడిగాడు యుగంధర్.

"ఆయనా పడుకున్నారు" అన్నది లక్ష్మి.

"మంచం మీదా?"

"అవును."

"మీరూ, పిల్లలూ అదే మంచం మీద పడుకున్నారా?" అడిగాడు యుగంధర్.

"అవును. పెద్ద పందిరి పట్టెమంచం అది."

"గది తలుపు గడియపెట్టారా?"

"ఆఁ ఓ రాత్రివేళ ఎవరో పరిగెత్తినట్లయి నిద్ర మెలుకువ వచ్చింది. అంతలోనే ఎవరో నన్ను కాలితో తన్నారు. ఉలిక్కిపడి లేచి యెవరన్నాను. అది పెద్దబావగారు. చూద్దును గదా నేను భోజనాల సావిడికి వెళ్ళే నడవాలో పడుకున్నాను" అన్నది లక్ష్మి.

"పడుకున్న తర్వాత మళ్ళీ నడవాలో నిద్రలేచేంతవరకూ ఒకసారి కూడా మెలుకువ రాలేదా?"

"లేదు."

"మీ చెయ్యి ఇలా ఇవ్వండి. నాడి పరీక్ష చేయాలి" అన్నాడు యుగంధర్. లక్ష్మి చెయ్యి అందించింది.

నాడి పరీక్ష చేసి, నాలిక పరీక్ష చేసి "మీరు వెళ్ళవచ్చు. దయచేసి మీ భర్తను ఒకసారి ఇలా రమ్మంటారా?" అన్నాడు యుగంధర్. లక్ష్మి గదిలోంచి వెళ్ళగానే యుగంధర్ తల తిప్పి "నో! నిద్రమందు లక్షణాలు ఏవీ లేవు" అన్నాడు.

"నన్ను పిలిచారా?" అంటూ ప్రభాకరరావు తలుపు వద్దకు వచ్చి నిలబడ్డాడు.

"అవును. లోపలికి రండి. ఒకటి రెండు విషయాలు మిమ్మల్ని అడిగి తెలుసుకునేందుకు పిలిచాను. నిన్నరాత్రి జరిగిన విషయాలు దయచేసి వివరంగా చెపుతారా?" అడిగాడు యుగంధర్.

"ఏముంది చెప్పడానికి సుబ్బమ్మ పొలికేకలు విని ఉలిక్కిపడి నిద్రలేచాను. అమాంతం మంచం మీదనించి ఒక గంతువేసి కిందికి పరిగెత్తాను. అప్పటికే శీను అన్నయ్య, కిట్టూ అన్నయ్య అక్కడ ఉన్నారు. వీరయ్య ఒంటిగా తోటలోకి వెళ్ళడానికి భయపడుతుంటే-"

"కొంచెం ఆగండి. భోజనాలయ్యాక మీరూ, మీ ఆవిడా మీ గదిలోకి వెళ్ళారు. వెంటనే నిద్రపోయారా?" అడిగాడు యుగంధర్.

"వెంటనే నిద్రపోయి ఉండను. పడుకున్నాను. అరగంట తర్వాత నిద్రపట్టి ఉంటుంది.

"సుబ్బమ్మ కేకలు విని నిద్రలేచారు. ఆలోగా నిద్రలేవలేదా?"

"లేదు."

"కేకలు వినగానే నిద్రలేచారు. అప్పుడు మీ ఆవిడ మీ పక్కన ఉన్నదో లేదో చూడలేదా?" అడిగాడు యుగంధర్.

"ఓ వైపు నేనూ, ఇంకో వైపు మా ఆవిడా, మధ్యన పిల్లలు పడుకున్నాం. కేకలు వినిపించగానే ఏదో అవాంతరం జరిగిందని అమాంతం లేచి పరిగెత్తాను. మా ఆవిడ ఉన్నదో లేదో చూడలేదు. చూడాలని స్ఫురించలేదు" అన్నాడు ప్రభాకరరావు.

"మీ గది తలుపు లోపల గడియ వేసి ఉందా, తీసి ఉందా?" అడిగాడు యుగంధర్. ప్రభాకరరావు క్షణం ఆలోచించి "వేసే ఉన్నది" అన్నాడు.

"సరిగా జ్ఞాపకమున్నదా?"

"ఆ! స్పష్టంగా జ్ఞాపకమున్నది. గడియ తీసి, తలుపు తెరుచుకుని బయటికి వెళ్ళాను" అన్నాడు ప్రభాకరరావు.

"మీ గదిలోంచి బయటికి ఇంకో తలుపు ఉందా?"

"లేదు"

"ఒకసారి మీ గది చూపిస్తారా?" అడిగాడు యుగంధర్.

"రండి" అన్నాడు ప్రభాకరరావు.

## 18

**పూజా** మందిరంలోని గంట తెచ్చి దానిమీద వేలు ముద్రలు ఏవయినా వచ్చాయేమో పరీక్ష చేస్తున్నాడు యుగంధర్. యుగంధర్‌కి సహాయం చేస్తూ "ప్రభాకరరావునీ, లక్ష్మినీ ప్రశ్నించారు కదా! ఇప్పుడు మీ అభిప్రాయం?" అడిగాడు రాజు.

"వాళ్ళిద్దరూ అబద్ధం చెపుతూ ఉండాలి. లేదా ఈ పనులన్నీ ఏ దెయ్యమో, భూతమో చేసి ఉండాలి" అన్నాడు యుగంధర్.

"ఇద్దరూ అబద్ధం చెప్పకపోవచ్చు. ఒకళ్ళు మాత్రమే అబద్ధం చెపుతున్నారేమో" అన్నాడు రాజు.

కాదని యుగంధర్ తల తిప్పి "గది తలుపు లోపల గడియవేసి ఉందని అంటున్నాడు ప్రభాకరరావు. బయటనించి ఆ తలుపు లోపల గడియపెట్టడం సాధ్యం కాదు. లక్ష్మిని మనిషి ఎవరో ఎత్తుకు తీసుకువెళ్ళి నడవాలో పడుకోపెట్టి ఉండడానికి వీలులేదు. మనిషే లక్ష్మిని ఎత్తుకు తీసుకువెళ్ళాడనీ, తలుపు లోపల గడియవేసి లేదనీ, ప్రభాకరరావు చెపుతున్నది అబద్ధమనీ అనుకుంటే లక్ష్మి కూడా

అబద్ధం చెపుతూ ఉండాలి. ఆమెకు మత్తుమందు ఇవ్వలేదు. కనుక ఆమెను ఎవరో ఎత్తుకు తీసుకువెళ్ళి నడవాలో పడుకోపెట్టడం జరిగివుంటే ఆమెకు మెలుకువ వచ్చి ఉండాలి" అన్నాడు యుగంధర్.

"ఈ గంట మీద ఒక్క వేలిముద్ర కూడా లేదు" అన్నాడు రాజు. యుగంధర్ తల ఊపి "దెయ్యమైతే వేలిముద్రలు ఉండవు. మనిషి అయితే వేలిముద్రలు జాగ్రత్తగా తుడిచివేసి ఉండాలి" అన్నాడు.

రాజు నవ్వి "దెయ్యమైతే అడుగుజాడలు కూడా కనపడవు, నీడా పడదు, ప్రతిబింబం అద్దంలో కనిపించదు. అసలు పాదాలు నేలకి అంటనే అంటవు అంటారుగా!" అన్నాడు. యుగంధర్ కూడా నవ్వి "హత్య చేసిన మనిషిని పట్టుకోమని కోరుతుంటారుగాని హత్యచేసిన దెయ్యాన్ని పట్టుకోమని ఇంతవరకూ ఎవరూ నన్ను కోరలేదు" అన్నాడు.

ఇంతలో తలుపు తట్టిన చప్పుడయింది.

"కమ్ యిన్" అన్నాడు యుగంధర్.

శ్రీనివాసరావు తలుపు తోసుకుని లోపలికి వచ్చి, "మీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు యుగంధర్ని.

"ఇంకా ఏ అభిప్రాయం ఏర్పరచుకోలేదు. కూర్చోండి. మిమ్మల్ని కొన్ని విషయాలు అడిగి తెలుసుకోవాలి. సర్కిల్ ఇన్స్పెక్టర్ ఉన్నారా?" అడిగాడు యుగంధర్.

"ఆ! ఒక్కొక్కర్నీ పిలిచి స్టేట్మెంటులు తీసుకుంటున్నారు" అంటూ శ్రీనివాసరావు కుర్చీలో చతికిలపడ్డాడు.

"సామాన్యంగా హత్య జరగడానికి కొన్ని కారణాలుంటాయి. ద్వేషం, ప్రేమవల్ల కలిగే యీర్ష్య, ధనం ముఖ్య కారణాలు. ఇంకా ఎన్నో కారణాలు ఉండవచ్చు. కానీ అవి చాలా అరుదు. ఈ మూడు కారణాలు దృష్టిలో ఉంచుకుని ఆలోచించి చెప్పండి" అన్నాడు యుగంధర్.

"నా మనసు ఆలోచించే స్థితిలో లేదు. మీరు ప్రశ్నలు అడగండి. తెలిస్తే జవాబులు చెపుతాను" అన్నాడు శ్రీనివాసరావు.

"ముందు రామచంద్రరావుని గురించి చెప్పండి. అతను ఎలాటి మనిషి?" అడిగాడు యుగంధర్.

"రామచంద్రరావు నా మూడో చెల్లెలు భర్త. అతనికి ముప్పయిరెండేళ్ళు. బి.ఏ పాసయినాడు. నా చెల్లెలిని ఇవ్వడంవల్లే కాక అంతకు ముందే దూరపు బంధుత్వం ఉన్నది. వాళ్ళది అంతగా ఉన్న కుటుంబం కాదు. మద్రాసులో కొన్నిరోజులపాటు ఏదో గవర్నమెంట్ డిపార్టుమెంటులో గుమాస్తా ఉద్యోగం చేశాడు. ఆ జీతం డబ్బులు చాలలేదు. ఉద్యోగం మానేసి ఈ ఊరు వచ్చేశాడు. యేడాదిన్నర ఇక్కడే మా నాన్నగారికీ, మా తమ్ముడు ప్రభాకరరావుకీ ఎస్టేటు వ్యవహారాలలో సహాయం చేస్తూ ఉన్నాడు. తర్వాత మధురలో ఏదో కంపెనీలో సేల్స్మెన్గా ఉద్యోగం దొరికింది రెండేళ్ళ క్రితం. భార్యనీ, కూతుర్నీ తీసుకుని మధుర వెళ్ళాడు. తర్వాత ఒక పిల్లాడు పుట్టాడు. నేను దుర్గ పెళ్ళికి ఈ ఊరు వచ్చి పదిరోజులు ఉండి వెళ్ళిపోయాను. రామచంద్రరావు మద్రాసులో గుమస్తాగా ఉన్న రోజుల్లో అప్పుడప్పుడు దుర్గని తీసుకుని మా యింటికి వస్తూ ఉండేవాడు. నాకతనితో అంతే పరిచయం. తాగుడుగానీ, ఇతర దురభ్యాసాలుగానీ ఉన్నట్లు నాకు తెలియదు" అన్నాడు శ్రీనివాసరావు.

"మీ ఆస్తి గురించీ మీ నాన్నగారు ఎవరెవరికి ఎంత ఇచ్చినదీ చెప్పగలరా?" అడిగాడు యుగంధర్.

"మా నాన్నగారిది దాదాపు పదిలక్షల రూపాయల ఆస్తి. రొక్కంగా బాంకులో ఉన్నది పాతికవేలే. తతిమ్మా ఆస్తి అంతా స్థిరాస్థి. పొలాలు, ఇళ్ళూ, అంతా నాన్నగారి స్వార్జితము. ఈ ఇల్లు మా తాతగారు కట్టించారు. ఈ ఊళ్ళో కొంత పొలం కూడా ఉండేది ఆయనకి. ఇబ్బందులు వచ్చి ఆస్తి అమ్మేశారు. మా నాన్నగారు ఓ స్నేహితుడితో కలిసి మద్రాసులో ఏదో వ్యాపారం పెట్టి పాతికవేలదాకా సంపాదించారు. ఆ డబ్బుతో తన తండ్రి అమ్మేసిన ఇల్లూ, పొలమూ తిరిగి సంపాదించారు అప్పటినించీ ఈ ఊళ్ళోనే స్థిరపడిపోయి

వ్యవసాయం చేస్తూ వచ్చారు. యుద్ధం రావడం, ధాన్యం ధర పెరగడం అన్నీ కలిసి వచ్చాయి. గబగబా ఆస్తి పెంచుకుపోయారు. చేతికి వచ్చిన డబ్బుతో ఎస్టేటు విస్తరింప చేశారు పదిలక్షల రూపాయల ఎస్టేటు అయింది'' అన్నాడు శ్రీనివాసరావు.

''వీలునామా వ్రాశారా?'' అడిగాడు యుగంధర్.

''ఆ! ఆయన ఆస్తిలో సగభాగం నలుగురు కొడుకులకీ, నలుగురు కూతుళ్ళకీ సరిసమానంగా విభజింపడాలనీ, తతిమ్మా సగమూ అమ్మకి చెందాలని వ్రాశారు. మా అమ్మకి వచ్చే సగం ఆస్తి ఆమె తదనంతరం తన ఇష్టానుసారంగా ఎవరికి ఇవ్వదలుచుకుంటే వాళ్ళకి ఇవ్వవచ్చని వ్రాశారు. ఆయన ప్రాణాలు విడిచేముందు మాత్రం అందరితో ఒక విషయం చెప్పారు మేమంతా పట్నాలలో ఉంటున్నాము గనుక ఆస్తి అమ్మడానికి ప్రయత్నించవద్దని చెప్పారు.''

''పట్నాలలో ఉన్న మీరంతా భూసంస్కరణలు అమలు జరుగుతున్న యీ రోజుల్లో ఇక్కడ ఆస్తిని ఎలా చూసుకుంటారు? పొలాలు అమ్మి మీరున్న పట్నాలలో ఏ ఇల్లో కొనుక్కోవడం వివేకమైన పనేమో!'' అన్నాడు యుగంధర్.

''కొన ఊపిరితో ఉన్న నాన్నగారితో ఆ విషయాలన్నీ చర్చించడం ఇష్టంలేక మేమంతా తలలు ఊపాము'' అన్నాడు శ్రీనివాసరావు.

''మీ నాన్నగారు పోయిన తర్వాత ఆ విషయం మీరంతా కలిసి చర్చించారా?'' అడిగాడు యుగంధర్.

''ఆ! ప్రభ, రామచంద్రరావు తప్ప తతిమ్మావాళ్ళమంతా ఆస్తి అమ్మేయడమే ఉత్తమమని నిశ్చయించాము. ఆస్తి అమ్మవద్దనీ, నాన్నగారి కోర్కె మన్నించాలనీ వాళ్ళిద్దరూ పట్టుపట్టారు. కొనవూపిరితో ఉన్న నాన్నగారిని భాధపెట్టడం ఇష్టంలేక ఊరుకున్నాముగాని లేకపోతే సాధక బాధకాలు ఆయనకి అర్థమయేట్లు చెప్పి ఒప్పించేవాళ్ళం అన్నాము మేము'' అన్నాడు శ్రీనివాసరావు.

''మీ అమ్మగారు?'' అడిగాడు యుగంధర్.

''అమ్మకి ఏమీ తెలియదు. అందరూ కలిసి ఆలోచించి ఏంచెయ్యమంటే అది చేస్తానన్నది.''

''మీ నాన్నగారే దెయ్యమై వచ్చి యీ పనులు చేస్తున్నారనీ, ఆయన కోర్కె తోసిపుచ్చదలచుకున్నందుకు ఆయన ఆత్మ అశాంతి చెంది ఈ విధంగా చేస్తున్నదనీ ఇంట్లో యెవరయిన అన్నారా?'' అడిగాడు యుగంధర్.

''ప్రభ, రామచంద్రరావు సూచనగా అన్నారు. అమ్మకూడా వాళ్ళతో ఏకీభవించింది.''

''అది హేతువాదానికి విరుద్ధంగా లేదా?'' అడిగాడు యుగంధర్.

''అంటే?''

''ఆస్తి అమ్మడం మీ నాన్నగారికి ఇష్టంలేదు. ఆయన అయిష్టాన్ని మీకు ప్రదర్శించడానికి దెయ్యంగా వచ్చి ఇంట్లో గగ్గోలు చేస్తున్నారు. బాగానే ఉంది. కానీ ఆయన యిష్టుల్ని, ఆయనతో వ్యతిరేకించని, ఆయన పక్షాన వాదిస్తున్న ప్రభాకరరావు గదిలో పూలతొట్టెలో పుర్రె, ఎముకలు ఎందుకు పెట్టారు?''

''దెయ్యానికి ఆలోచించే శక్తి ఉన్నదో లేదో?'' అన్నాడు శ్రీనివాసరావు.

''పల్లెటూళ్ళో ఉండడం యిష్టంలేక సేల్స్‌మెన్ ఉద్యోగం దొరకగానే వెళ్ళిపోయిన రామచంద్రరావు ప్రభాకరరావు తరపున వాదించి ఉండడం ఆశ్చర్యంగానే ఉన్నది'' అన్నాడు యుగంధర్.

''రామచంద్రరావు తనంతట తను ఉద్యోగం వెతుక్కుని వెళ్ళలేదు. నిజానికి అతనికి ఇష్టంకూడా లేదు. దుర్గపోరు పడలేక ఉద్యోగానికి వెళ్ళాడు'' అని చెప్పాడు శ్రీనివాసరావు.

''పేడతో అరిచేతి ముద్రలు వేసిన దుప్పటీ, ఎర్ర సిరాతోనో, ఎర్ర రంగుతోనో ముద్రలు వేసిన దుప్పటీ ఇంకా అలాగే ఉన్నాయా?'' అడిగాడు యుగంధర్.

"ఆ! చూస్తారా?" అన్నాడు శ్రీనివాసరావు.

"తెప్పించండి."

"క్షణంలో తెస్తాను" అంటూ శ్రీనివాసరావు బయటికి వెళ్ళాడు.

"చాలా తెలివిగా చేసిన హత్య ఇది. రామచంద్రరావుని హత్య చెయ్యడానికి ఎవరో నిశ్చయించుకున్నారు. ఈ ఇంట్లో దెయ్యం ఉన్నట్లు అందరూ అనుకోడానికి అఘాయిత్యాలు ప్రారంభించాడు. దెయ్యం చాలా ఘోరాలు చేస్తున్నదని అందరికీ బాగా నమ్మకం కుదిరాక రామచంద్రరవుని హత్య చేశాడు. నేరం దెయ్యం మీదికి పోతుందనుకున్నాడు" అన్నాడు రాజు.

"ఏమో? శ్రీనివాసరావు తండ్రి దెయ్యమై వచ్చి గగ్గోలు చేస్తున్నాడని నిరూపించడానికి మనకి తెలిసినంతవరకూ యిద్దరికి కారణం ఉంది, రామచంద్రరావుకి, ప్రభాకరరావుకి. ఈ ఆస్తి అమ్మెయ్యడం వాళ్ళకి ఇష్టం లేదు. ఆస్తి అమ్మేస్తే ఆ ముసలాయన ఆత్మకి శాంతి ఉండదనీ అందరికీ నమ్మకం కలిగితే ఆస్తి అమ్మే ఆలోచన మానుకుంటారని దెయ్యాన్ని సృష్టించి ఉండవచ్చు. రామచంద్రరావు హత్యకీ, దెయ్యాన్ని సృష్టించిన మనిషికీ సంబంధం లేకపోవచ్చు. ఈ యింట్లో దెయ్యం ఉన్నదని భయపడడం అవకాశంగా తీసుకుని రామచంద్రరావు మీద ద్వేషం ఉన్న మనిషెవరో ఈ హత్యచేసి ఉండచ్చు. రామచంద్రరావే ఈ ఇంట్లో దెయ్యం ఉన్నట్లు అందరూ అనుకునేటట్లు చేసి ఉండవచ్చు" అన్నాడు యుగంధర్.

"రామచంద్రరావు మెడమీద వేళ్ళ గుర్తుల విషయం ఏమంటారు? అంత పెద్ద వేళ్ళు యీ యింట్లో ఎవరికీ లేవే?" అన్నాడు రాజు.

"రాజూ! నువ్వు గమనించావో లేదో, ఆ వేళ్ళ గుర్తుల మధ్య యెడం లేదు. వేళ్ళు ఒక్కదాన్ని ఒకటి అంటుకుని ఉన్నాయి. వేళ్ళ ముద్రలు లావుగా కనబడేందుకు వేళ్ళకి ఏదో చుట్టుకుని ఉండవచ్చు."

"ఇవన్నీ మనుష్యులు చేసి ఉండవచ్చని వాదించగలం కానీ ఒక విషయం మాత్రం మనిషి చేసి ఉండవచ్చని వాదించలేము" అన్నాడు రాజు.

"ఏమిటి రాజూ?" అడిగాడు యుగంధర్ ఆత్రుతతో.

"వంట యింట్లో పీటలు లాగిన చప్పుడు, నీళ్ళు ఒలకబోసిన చప్పుడు వినిపించాయి సుబ్బమ్మకి. దాసీది కూడా చప్పుళ్ళు వినిపించాయని చెప్పింది. ఇద్దరూ వెళ్ళి తలుపు తీసి లోపలికి తొంగిచూశారు. వంట యింట్లోకి వెళ్ళి ఆ చప్పుళ్ళు చేసి సుబ్బమ్మకీ, దాసీదానికీ కనిపించకుండా మనిషిలా యెలా అదృశ్యం కాగలడు?" అడిగాడు రాజు.

"అవును. నీ సందేహం సరయినదే ఆ విషయమూ ఆలోచించాలి" అన్నాడు యుగంధర్.

"ఏం?" అడిగాడు శ్రీనివాసరావు.

"దుప్పట్లమీద ముద్రలు వేస్తున్నప్పుడు చేతికి ఏదో చుట్టుకుని ఉండాలి" అన్నాడు యుగంధర్ దుప్పటి మడిచి బల్లమీద పెట్టేసి.

"యుగంధర్ రామచంద్రరావుని యీ ఇంట్లోవాళ్ళే ఎవరో హత్యచేశారని నేను నమ్మలేను. రామచంద్రరావు మీద అంత ద్వేషం ఎవరికున్నదో ఊహించలేకుండా ఉన్నాను" అన్నాడు శ్రీనివాసరావు.

"ఈ యింట్లో ఉన్నవాళ్ళలో ముగ్గురు యీ హత్యచేసి ఉండటానికి వీలులేదని అనుకోవచ్చు" అన్నాడు రాజు.

"ఎవరా ముగ్గురు?" అడిగాడు శ్రీనివాసరావు.

"రాధ, సుందరరావు, వసంత. భోజనాలు అయిన తర్వాత ఆ రాత్రి ఆ ముగ్గురూ గదిలోంచి బయటికి వెళ్ళలేదని ఒకళ్ళకి ఒకళ్ళు ఎలిబీ ఉన్నారు."

"ఆ ఎలిబీతో ప్రయోజనం లేదు రాజా! అటువంటి ఎలిబీలు అందరికీ ఉంటాయి. ఉదాహరణకి శ్రీనివాసరావు సుబ్బమ్మ కేక వినపడేంతవరకూ గదిలోంచి కదలలేదని ఆయన భార్య సాక్ష్యం యిస్తుందనుకుంటాను" అన్నాడు యుగంధర్ నవ్వుతూ.

"యస్. యు ఆర్ రైట్!" అన్నాడు శ్రీనివాసరావు.

19

చీకటి పడుతోంది. వీరయ్య, దాసీది దీపాలు వెలిగించి ఒక్కొక్క గదిలోనూ పెడుతున్నారు. ఆడవాళ్ళూ, పిల్లలూ ఉయ్యాలబల్ల ఉన్న గదిలో కూర్చున్నారు. ఇప్పుడు ఆ గదిలో ఉయ్యాలబల్ల లేదు. గొలుసులూ, బల్లా తీసేసి కొట్టు గదిలో పడేశారు. మొగాళ్ళంతా వసారాలో నిలుచున్నారు. "అవసరమైతే ఒక కానిస్టేబుల్ని యిక్కడ కాపలా ఉంచుతాను" అన్నాడు సర్కిల్ యిన్స్పెక్టర్.

"ఎందుకూ?" అడిగాడు రాజు.

"అవును. ఎందుకు? డిటెక్టివ్ యుగంధరే ఈ ఇంట్లో ఉండగా ఆయన చెయ్యలేని సహాయం ఏ కానిస్టేబుల్ చెయ్యగలడు?" అన్నాడు రాఘవయ్య.

యుగంధర్ నవ్వి "దొంగలకూ, హంతకులకూ నేనంటే భయం ఉండవచ్చేమో కాని దెయ్యానికి కూడా భయం ఉంటుందంటారా?" అడిగాడు.

"పరలోకానికి వెళ్ళిన దొంగలూ, హంతకులూ మీ గురించి వాటికి చెప్పి ఉంటారేమో!" అన్నాడు రాఘవయ్య.

"పోస్టుమార్టం రిపోర్టు ఎప్పుడు వస్తుంది?" అడిగాడు యుగంధర్.

"పొద్దునకల్లా వస్తుంది. నేనే తీసుకువస్తాను" అంటూ యుగంధర్ని చెయ్యిపట్టుకుని కొంచెం దూరంగా తీసుకువెళ్ళి "యుగంధర్! దెయ్యం యీ హత్య చేసిందని నేను నమ్మను" అన్నాడు రాఘవయ్య.

"హత్య దెయ్యం చేసిందని నేనూ అనుకోవడంలేదు."

"అంటే?" అడిగాడు రాఘవయ్య.

"కొన్ని అఘాయిత్యాలు దెయ్యం చేసి ఉండవచ్చు. ఆ వివరాలు తర్వాత చర్చిద్దాం" అన్నాడు యుగంధర్.

సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవయ్య తన పరివారంతో వెళ్ళిపోయాడు.

"శ్రీనివాసరావుగారూ! ఉయ్యాలబల్ల మళ్ళీ వేయించండి" అన్నాడు యుగంధర్.

"ఎందుకు?" అడిగాడు వెంకటరత్నం.

"అది ఈ రాత్రికూడా ఊగుతుందేమో చూడాలి" అన్నాడు యుగంధర్. క్రిష్ణమూర్తి, సుధాకర్ వెళ్ళి ఉయ్యాల బల్ల తగిలించారు.

ఇంటిల్లిపాదీ ఆ గదిలోనే ఉన్నారు. యుగంధర్ వారినందర్నీ సంబోధించి "మీ అందరికీ ఒక విన్నపం. ఈ రాత్రి కూడా ఏదయినా జరిగితే మతులు పోగొట్టుకుని కేకలు వేయవద్దు. దయచేసి వెంటనే నాకు తెలియపరచండి" అన్నాడు.

"భోజనాలకి యింకా వ్యవధి ఉన్నది కనుక ఆలోగా కొంత దర్యాప్తు చేయదలచుకున్నాను. ఈ ఇంట్లో ఉన్న వాళ్ళందరితో విడివిడిగా మాట్లాడాలి. దయచేసి ఒక్కక్కరే నా గదికి రాగోర్తాను" అన్నాడు యుగంధర్.

"ముందెవరు రావాలి?" అడిగాడు క్రిష్ణమూర్తి.

"నేను వెళ్తాను" అన్నది రాధ.

యుగంధరూ, రాజూ, రాధా వెళ్ళిపోయారు.

ఒకసారి బయటికి తొంగి చూసి ఆ ప్రాంతాల ఎవరూ లేరని నిశ్చయించుకుని తలుపు దగ్గిర వేశాడు రాజు.

"కూర్చోవమ్మా!" అన్నాడు యుగంధర్.

రాధ కూర్చున్నది. "హత్య జరిగిన రాత్రి సుందరరావు గదిలోంచి బయటికి వెళ్ళాడా?" అడిగాడు యుగంధర్.

"సుబ్బమ్మ కేకలు విని బయటికి వెళ్ళబోయాడు. నేను వద్దన్నాను. అక్కయ్యనీ, నన్నూ ఒంటిగా వొదిలి వెళ్ళవద్దన్నాను. సుబ్బమ్మ కేకలు వినపడినపుడు ముగ్గురం గదిలోనే ఉన్నాము" అన్నది రాధ.

"అప్పటివరకూ సుందరరావు గదిలోంచి బయటికి వెళ్ళలేదని నీకెలా తెలుసు? నువ్వు నిద్రపోలేదా?" అడిగాడు యుగంధర్. రాధ సందేహించింది. మొహం ఎర్రనయింది. "లేదు. మెలుకువగానే ఉన్నాను" అన్నది.

"మీ రామచంద్రరావు బావ గురించి ఏమైనా చెప్పగలవా?" అడిగాడు యుగంధర్.

**"రామచంద్రరావు** బావ చాలా మంచివాడు."

"అయితే ఏ బావ అంత మంచివాడు కాడు?"

"అందరూ మంచివాళ్ళే" అని నవ్వింది రాధ.

యుగంధర్ రాధని తీక్షణంగా చూసి "ఈ ఇంట్లో నిన్నరాత్రి మీ బావ రామచంద్రరావు హత్యచేయబడ్డాడు. ఆ హత్య దెయ్యం చేసిందని అనుమానం కలగడానికి తగినంత కారణం ఉంది. కాని మనిషి చెయ్యలేదని ఋజువైతే తప్ప దెయ్యం చేసిందని నేను నమ్మలేను. దెయ్యం చేసివుంటే రామచంద్రరావుని చంపిన దెయ్యం మిగతా వాళ్ళని చంపదని నమ్మకం ఏమిటి? మనిషే చేసి వుంటే ఎందుకు చేసిందీ తెలియాలి. ఎవరు చేశారో కనుక్కోవాలి. లేకపోతే ఆ మనిషి యింకొకర్ని హత్య చెయ్యవచ్చు. కనుక నువ్వు ఏ విషయమూ దాచకుండా నాకు నిజం చెప్పడం వివేకమైనపని" అన్నాడు.

"రామచంద్రరావు బావ హత్యతో సంబంధం ఉన్న విషయాలేవీ నేను దాచడంలేదు. నేను కిందకి దిగి వచ్చేటంతవరకూ అక్కయ్య గదిలోనే నేనూ సుందరం బావ ఉన్నాం" అన్నది రాధ.

"ఆ అర్ధరాత్రి నువ్వు అంత హడావిడిగా ఆ గదిలోంచి ఎందుకు వెళ్ళావు?" అడిగాడు యుగంధర్.

రాధ తడబడింది. రాఘవయ్య అదే ప్రశ్న అడిగినపుడు కిందనించి మాటలు వినిపించి, రామచంద్రరావు బావ కనిపించాడేమో తెలుసుకోవడానికి వెళ్ళానని చెప్పింది. రాఘవయ్య ఆ జవాబుతో తృప్తిపడి ఊరుకున్నాడు. యుగంధర్ ఊరుకుంటాడని రాధకి నమ్మకం లేదు. అయినా అదే జవాబు చెప్పింది.

"రెండు మూడు నిమిషాల ముందు శ్రీనివాసరావూ, ప్రభాకరరావూ మీరున్న గదిలోకి వచ్చి రామచంద్రరావు కనిపించలేదని చెప్పారు. అంతలో నువ్వు అతన్ని గురించి తెలుసుకోవడానికి ఆ గదిలోంచి హడావిడిగా బయటికి పరిగెత్తడం ఆశ్చర్యంగా ఉంది. అంతకుముందు సుందరరావు గదిలోంచి వెళ్ళడానికి ప్రయత్నిస్తే నిన్నూ, మీ అక్కయ్యనీ వొదిలి వెళ్ళవద్దని చెప్పిన నువ్వు అంత ధైర్యంగా చీకట్లో ఆ గదిలోంచి వెళ్ళడం ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు యుగంధర్.

రాధ నుదుటిమీద చెయ్యిపెట్టుకుని కళ్ళు మూసుకుని రెండు నిమిషాలపాటు మౌనంగా ఉండిపోయింది. "చెబుతాను నిజం చెబుతాను కాని మీ చెవులు దాటిపోకూడదు. అక్కయ్యకి తెలిస్తే బాధపడుతుంది" అన్నది రాధ.

"హత్యకి సంబంధించిన విషయమైతే తప్ప యెవరికీ చెప్పను. అదీ నేరం ఋజువు చెయ్యడానికి నువ్వు చెప్పే విషయాలు బహిర్గతం చెయ్యవలసి వస్తేనే చెపుతాను. లేకపోతే నువ్వు చెప్పే ఏ విషయమూ యింకొకళ్ళతో చెప్పనని వాగ్దానం చేస్తున్నాను" అన్నాడు యుగంధర్.

సుందేరరావు వెకిలి చేష్టల గురించి విపులంగా చెప్పింది రాధ.

"అతను నీతోనేనా, ఈ ఇంట్లో ఇంకెవరితోనైనా ఆ విషంగా ప్రవర్తించాడా?" అడిగాడు యుగంధర్.

"ఏవో మాటలు కల్పించుకుని అనవసరంగా ముట్టుకుంటాడనీ, సమయం దొరికితే రాసుకుపోతుంటాడనీ, ఇంకా యిటువంటి వెకిలి చేష్టలు చేస్తుంటాడనీ సావిత్రి వొదిన చెప్పింది" అన్నది రాధ.

"అంతేనా, లేక యీ యింట్లో మరే స్త్రీతోనైనా అతనికి రహస్య సంబంధం ఉన్నదా?"

"అటువంటిదేదీ లేదు. అటువంటి స్త్రీలు ఎవరూ లేరు యీ యింట్లో. నేను తప్ప తతిమ్మా వాళ్ళందరూ పెళ్ళయిన పిల్లల తల్లులు. సీత జోలికి వెళితే గరిట కాల్చి వాతలు పెడుతుంది" అన్నది రాధ.

"రామచంద్రరావుకి సుందరరావుకున్న జబ్బేమైనా ఉన్నదా?" అడిగాడు యుగంధర్ నవ్వుతూ.

"ఛ, ఛ చాలా యోగ్యుడు. ఆడవాళ్ళం మేమెవరమైనా ఒంటిగా కూర్చునుంటే పట్టపగలు కూడా ఆ గదిలోకి రాడు."

"రామచంద్రరావు హత్యకి సంబంధించిన విషయాలేవైనా చెప్పగలవా?" అడిగాడు యుగంధర్.

"నాకేమీ తెలియదు" అన్నది రాధ. రాజు డైరీలో వ్రాసుకున్న విషయాలను చూస్తూ యింట్లో వాళ్ళని ఒక్కొక్కర్నే పిలిచి యుగంధర్ ప్రశ్నించాడు. శ్రీనివాసరావు చెప్పిన విషయాలే చెప్పారు అంతా.

"మీ చెల్లెలు దుర్గతో మాట్లాడాలి" అన్నాడు యుగంధర్ శ్రీనివాసరావుతో.

"అసలే దుఃఖంతో ఉంది. తప్పనిసరయితే -" అన్నాడు శ్రీనివాసరావు.

దుర్గ పడుకున్న గదిలోకి డిటెక్టివ్‌లను శ్రీనివాసరావు తీసుకువెళ్ళాడు. శ్రీనివాసరావు భార్య కమల, మహలక్ష్మమ్మ ఆ గదిలో ఉన్నారు. యుగంధర్ రాగనే యిద్దరూ గదిలోంచి వెళ్ళిపోయారు. యుగంధర్నీ, రాజునీ వొదిలి శ్రీనివాసరావుకూడా వెళ్ళిపోయాడు.

"మీ భర్త హత్య దర్యాప్తు చెయ్యడానికి వచ్చాను. హత్య చేసిన మనిషిని పట్టుకోడానికి నా సర్వశక్తులా ప్రయత్నిస్తాను. దయచేసి నా ప్రశ్నలకి సమాధానాలు చెపుతారా?" అడిగాడు యుగంధర్ మృదువుగా.

దుర్గ యుగంధర్ని రెప్పవాల్చకుండా చూసి "ఆయన్ని ఎవరు హత్యచేస్తారు? అనవసరమైన శ్రమ. దెయ్యాన్ని పట్టుకోగల శక్తి మీకు లేదు" అన్నది దుర్గ.

"దెయ్యం అని నాకు నమ్మకం లేదు."

"అయితే ఎవరు ఆయన్ని హత్య చేశారు?"

"ఆ విషయం తెలుసుకోడానికే వచ్చాను. నిన్నరాత్రి మీరు ఎప్పుడు నిద్రలేచారు? లేవగానే ఏం చేశారు?" అడిగాడు యుగంధర్.

"కిందినించి కేకలు వినబడ్డాయి. ఉలిక్కిపడి నిద్రలేచాను. గోడకి తగిలించిన బుడ్డి దీపం సన్నగా వెలుగుతోంది. చూద్దునుగదా ఆయన లేరు. పిల్లలు ఇద్దరూ నిద్రపోతున్నారు. తలుపువైపు చూశాను. కొద్దిగా తెరిచి ఉంది" అన్నది దుర్గ.

"తర్వాత?"

"ఆ కేకలు వినపడి నిద్రలేచి గుమ్మం అవతల నిలుచుని వింటున్నారేమో అనుకుని 'ఏవండీ! ఏవండీ!' అని పిలిచాను. పలకలేదు. లేచి వెళ్ళి తలుపు తెరిచి చూశాను. బయట చీకటిగా ఉంది. కిందనించి మాటలు వినిపిస్తున్నాయి. ఆయన కిందకి వెళ్ళారనుకుని నేనూ కిందికి వెళ్ళాను" అన్నది దుర్గ.

"మీరు గాఢంగా నిద్రపోతారా? లేక ఏ చిన్నచప్పుడయినా నిద్రలేస్తారా?" అడిగాడు యుగంధర్.

"రెండూకాదు. ఏదయినా చప్పుడయితే నిద్రలేస్తాను. కొందరిమల్లే చీమ చిటుక్కుమంటే నిద్రలేవను, మొద్దు నిద్రాపోను"

అన్నదామె.

"సుబ్బమ్మ, లచ్చి పెద్దపెద్ద కేకలు పెట్టారు. మేడమీది గదుల్లో పడుకున్న శ్రీనివాసరావుగారూ, తతిమ్మా వాళ్ళూ నిద్రలేచారు. కనుక సుబ్బమ్మ కేకలకి మీరు నిద్రలేచి ఉండవచ్చు. అనుకోవచ్చుకదూ!" అడిగాడు యుగంధర్.

"అనుకోవడం దేనికి? ఆ కేకలకే నిద్రలేచాను."

"అలాకాదు. సుబ్బమ్మ మొదట వేసిన కేకలకి నిద్రలేచారా, లేక అందరూ కిందికి దిగి వెళ్ళిన తరవాత నిద్రలేచారా, అనేది ప్రశ్న."

"అందరూ దిగి వెళ్ళిన తరవాత సుబ్బమ్మ కేకలు ఎందుకు వేస్తుంది? అందరూ కలిసి మాట్లాడుతూ ఉంటారు. సుబ్బమ్మ కేకలకే నిద్రలేచాను."

"అయితే మీరు నిద్ర మేల్కొనేలోగానే రామచంద్రరావుగారు గదిలోంచి ఎలా వెళ్ళివుంటారు? ఆయన నిద్ర కలత నిద్ర అయివుండాలి."

"కాదు, ఆయన మొద్దు నిద్రపోయారు."

"అయితే అప్పటికి ఆయన నిద్రపోలేదేమో?"

"ఆయన నాకన్నా ముందు నిద్రపోయారు. పిల్లల్ని నిద్రపుచ్చిన తర్వాత నేను లేస్తే పిల్లలు లేస్తారేమోనని తలుపు గడియపెట్టడానికీ, దీపం తగ్గించడానికీ ఆయన్ని పిలిచాను. పలకలేదు. నిద్రపోతున్నారనుకుని నేనే లేచి వెళ్ళాను" అన్నది దుర్గ.

"అయితే సుబ్బమ్మ కేకలు వినపడే ముందే మీ వారు లేచి గదిలోంచి వెళ్ళివుండాలి" అన్నాడు యుగంధర్.

దుర్గ మౌనంగా ఉండిపోయింది.

"మీవారికి యీ ఊళ్ళో ఉండడమే ఇష్టమనీ, ఆస్తి అమ్మటం యిష్టంలేదనీ విన్నాను. నిజమేనా?" అడిగాడు యుగంధర్.

దుర్గ తలూపింది. "ఆయన చదువుకున్నవారు. పట్నవాసాల్లో నివసించినవారు. అటువంటి మనిషి యీ పల్లెటూళ్ళో ఉండడానికి ఎందుకు ఇష్టపడ్డారు?"

"ఏమో?" అన్నది దుర్గ.

"అంతకు పూర్వం కూడా ఆయన మీ పోరు పడలేక ఉద్యోగం వెతుక్కుని యీ ఊరినుంచి వెళ్ళారని విన్నాను. నిజమేనా!"

"అవును"

"పెళ్ళయినప్పట్నించీ కూడా ఆయనకి ఈ ఊళ్ళో ఇల్లరికం ఉండడం యిష్టమా?" అడిగాడు యుగంధర్.

"కాదు. పెళ్ళి అయేముందు బొంబాయిలో ఏదో కంపెనీలో ఉద్యోగం చేస్తుండేవారు. పెళ్ళయినాక అంతదూరం ఎందుకు, దగ్గర్లో ఎక్కడయినా ఉద్యోగం చూసుకోమన్నారు నాన్నగారు. మద్రాసులో ఉద్యోగం సంపాదించారు. ఆ రోజుల్లో యీ ఊళ్ళో క్షణం ఉండడం కూడా ఇష్టంలేదు ఆయనకి. ఏమీ తోచదనీ, మాట్లాడేందుకు కూడా ఎవరూ ఉండరనీ తిడుతూండేవారు. మద్రాసులో ఉద్యోగం పోయిన తర్వాత ఇక్కడికి వచ్చాం. ఏడాదికి పైగా ఇక్కడే ఉన్నాం. అప్పుడు వచ్చింది ఆయనలో మార్పు. ఈ ఊరు మీద ఇష్టం కలిగింది" అన్నది దుర్గ.

"మీ మనస్సు నొచ్చుకుంటే క్షమించండి. అడగక తప్పదు కనుక అడుగుతున్నాను. మీవారు మిమ్మల్ని సరిగా చూసేవారా?"

"అంటే?" అడిగింది దుర్గ.

"ఆయనకి ఇతర స్త్రీలు ఎవరితోనయినా?" ప్రశ్న పూర్తి చెయ్యకుండా ఆపేశాడు యుగంధర్.

"ఆయన అలాటి మనిషి కాదు. ఆయనకి ఆ ధ్యాసే లేదు" అన్నదామె.

"మిమ్మల్ని శ్రమ పెట్టినందుకు క్షమించండి" అని యుగంధర్ లేచి వెళ్ళిపోయాడు.

## 20

భోజనాలయ్యాయి. అందరూ వాళ్ళవాళ్ళ గదులలోకి వెళ్ళారు. పెరటి తలుపు, వీధి తలుపు లోపల గడియపెట్టి వెళ్ళిపడుకున్నారు లచ్చీ, వీరయ్య.

యుగంధరూ, రాజూ ఆ ఇంట్లోనే ఉండడం వల్ల అందరికీ ముఖ్యంగా ఆడవాళ్ళకి కొంచెం ధైర్యంగా ఉంది.

యుగంధర్ పెట్టెలోంచి రిటాలిన్ మాత్రలు సీసా తీశాడు. రాజుకి ఒకటిచ్చి, తనొకటి వేసుకున్నాడు. "పొరపాటున కూడా నిద్రపోకుండా ఉండడానికి" అన్నాడు నవ్వుతూ.

"దీపం కూడా ఆర్పేయాలా?" అడిగాడు రాజు.

"ఆర్పేస్తే మంచిది. అందరిలా మనం కూడా నిద్రపోయాము అనుకోవడం మంచిది" అన్నాడు యుగంధర్.

రాజు దీపం ఆర్పేశాడు. బల్లమీద రేడియం డయల్ గడియారం టకటకమంటోంది. నిమిషాలు నెమ్మదిగా గడుస్తున్నాయి. ఆ డిటెక్టివ్‌లు ఇద్దరూ వారి వారి ఆలోచనల్లో ఉండిపోయారు. గంటల ముల్లు కదులుతోంది.

ఆ జాగారం అనవసరమేమో, వృధాయేమో అనే ఆలోచనే రాలేదు యిద్దరికీ. ఆ రాత్రి ఏమో జరుగుతుందనీ, జరిగి తీరాలనీ ఇద్దరికీ నమ్మకం ఉంది. ఆ ఇంట్లో దెయ్యం ఉన్నదని ఆ డిటెక్టివ్‌లు నమ్మేటట్లు చెయ్యడానికి సర్వశక్తులా ప్రయత్నిస్తాడు హంతకుడు.

ఉయ్యాల బల్ల కీచుకీచు మనడం ప్రారంభించింది. యుగంధర్ చెవులు రిక్కించుకుని విన్నాడు. ఉయ్యాల బల్ల యింకొంచెం వేగంగా ఊగడం ప్రారంభించింది. యుగంధర్, రాజూ లేచారు. రాజూ, యుగంధరూ గదిలోంచి బయటికి వెళ్ళారు. ఉయ్యాల బల్లవున్న గదికి రెండు తలుపులున్నాయి. ఒకటి నడవాలోంచి భోజనాల సావిట్లోకి ఉన్నది. రెండవది యుగంధరూ, రాజూ ఉన్న గదులవైపు ఉన్నది.

"నువ్వు అటు భోజనాల సావిట్లోంచి రా" అన్నాడు రాజు చెవిలో యుగంధర్. రాజు అటు వెళ్ళాడు.

అడుగుల చప్పుడు కాకుండా యుగంధర్ ఉయ్యాల బల్లవున్న గదివైపు నడిచాడు. ఉయ్యాల బల్ల జోరుగా ఊగుతోంది. యుగంధర్ తలుపు దగ్గర ఆగి టార్చిలైటు వెలిగించి గది చుట్టూ తిప్పాడు టార్చిని. ఎవరూ లేరు. ఉయ్యాల బల్ల మాత్రం ఊగుతోంది. అటువైపు వెళ్ళిన రాజు యింకా ఎందుకు రాలేదు. ఉయ్యాల బల్ల ఊపి వెళ్ళిపోతున్న మనిషి రాజుకి ఎదురయి ఉంటాడా అనుకున్నాడు యుగంధర్. యుగంధర్ నడవాలోకి వెళ్ళే తలుపు వైపు వెళ్ళి, నడవాలోకి టార్చి వేసి చూశాడు. నేలమీద బోర్లా పడుకున్నాడు రాజు.

"రాజూ! రాజూ! ఏమైంది?" అంటూ యుగంధర్ రాజు పక్కన మోకాళ్ళ మీద ఒంగి చెయ్యిపట్టుకున్నాడు.

రాజు మూలిగాడు.

"రాజూ! రాజూ!" అంటూ టార్చి వెలుగు రాజు మొహంమీద వేశాడు యుగంధర్. రాజు కళ్ళు తెరిచి ఛటుక్కున లేచి కూర్చుని చేత్తో తల తడుముకున్నాడు.

"ఏమైంది రాజూ?" అడిగాడు యుగంధర్.

"చప్పుడు చెయకుండా యీ నడవాలోకి వచ్చాను. చీకటిగా ఉంది. రెండడుగులు వేశానో లేదో తలమీద ఏదో తగిలింది. అంతే. పడిపోయాను. ఎంతసేపయింది?"

"నిమిషం క్రితం జరిగి ఉండాలి. ఆడమనిషో, మొగవాడో చూశావా?"

"లేదు. వెనకనించి తగిలింది దెబ్బ" అన్నాడు రాజు.

రాజు యీ మాటలు అంటూండగానే గంట గణగణ మోగడం వినపడింది.

"పూజ గంట గణగణమంటోంది" అన్నాడు రాజు.

"త్వరగా రా" అని యుగంధర్ గంట మోగుతున్న వైపు పరిగెత్తాడు.

యుగంధర్ వెనకే రాజు నడవాలోంచి, భోజనాల సావిట్లోంచి పూజ గదివైపు పరిగెత్తాడు. వాళ్ళు పరిగెత్తుతుండగానే గంట మోగడం ఆగిపోయింది. పూజ గది దగ్గరికి వాళ్ళు వెళ్ళేటప్పటికి అంతా నిశ్శబ్దంగా ఉంది. యుగంధర్ టార్చి వెలుగు పూజ గది తలుపు మీద వేశాడు. తలుపు బయట గడియపెట్టి ఉంది. అంతలో శ్రీనివాసరావూ, వెంకటరత్నం హడావిడిగా వచ్చారు.

"ఈ గంట పూజ గదిలో మోగలేదు. ఎవరయినా పూజగదిలోకి వెళ్ళి గంట మోగించి ఉంటే మనం వచ్చేలోగా తలుపు గడియపెట్టి పారిపోయేందుకు వ్యవధి లేదు" అన్నాడు యుగంధర్.

"మనిషి అయితే మీరు చెప్పినది సబబే" అన్నాడు వెంకటరత్నం.

"అవును. దెయ్యమే. అయితే తలుపు తాళం వేసివున్నా లోపలికి వెళ్ళి గంట మోగించగలదు. లేదా యీ పనులు చేస్తున్న మనిషి దెయ్యమే చేసిందని నాకు నిరూపించడానికి శ్రమపడి ఉండవచ్చు" అన్నాడు యుగంధర్.

తలుపులు తెరిచి, తలుపు దగ్గరే నిలుచుని "ఏమిటి మళ్ళీ ఈ గొడవ?" అడిగాడు క్రిష్ణమూర్తి.

శ్రీనివాసరావు చెప్పాడు. రాజు తలకి దెబ్బ తగిలిన విషయం యుగంధర్ శ్రీనివాసరావుకి చెప్పాడు.

"ఏదీ చూడనివ్వండి" అంటూ శ్రీనివాసరావు పరీక్షచేసి "పెద్ద దెబ్బకాదు" అన్నాడు.

"రాజూ! నువ్వు యిక్కడే ఉండు. క్షణంలో వస్తాను" అంటూ యుగంధర్. తన గదిలోకి వెళ్ళి కొన్ని పరికరాలతో తిరిగివచ్చి "రా! ఉయ్యాల బల్ల వున్న గదిలోకి వెళదాం" అన్నాడు రాజుతో.

శ్రీనివాసరావు, వెంకటరత్నం కూడా వాళ్ళతో వెళ్ళారు. ఉయ్యాల బల్ల మీదా, గొలుసుల మీదా పౌడర్ చల్లడం ప్రారంభించాడు యుగంధర్.

"వేలిముద్రలు దొరుకుతాయనా?" అడిగాడూ వెంకటరత్నం.

"ముందే జాగ్రత్తపడ్డాను. రాత్రి అందరూ నిద్రపోయాక బల్లనీ, గొలుసులనీ శుభ్రంగా తుడిచాను. బల్లకి పాలిష్ రుద్దాను. గొలుసులకి మైనం పూశాను. ఎవరు ముట్టుకున్నా వాళ్ళ వేలిముద్రలు పడేటట్లు చేశాను" అన్నాడు యుగంధర్.

"ఏమండీ! ఏమండీ! పిల్లలనీ, నన్నూ వొదిలి ఎక్కడికి వెళ్ళారు?" అహల్య కేకేసింది.

"ఇక్కడే ఉన్నాను. వొస్తున్నాను" అన్నాడు వెంకటరత్నం.

"నువ్వు వెళ్ళు బావా! అహల్య హడలిపోతూ ఉంటుంది" అన్నాడు శ్రీనివాసరావు.

వెంకటరత్నం వెళ్ళిపోయాడు నవ్వుతూ.

యుగంధర్ ఉయ్యాల బల్లమీద ఏవైనా వేలిముద్రలు దొరుకుతాయేమోనని పదినిమిషాలు జాగ్రత్తగా పరిశీలించాడు. తర్వాత కెమెరా తీసి ఫ్లాష్ బల్బుతో కొన్ని ఫోటోలు తీశాడు. "వేలిముద్రలున్నాయా?" అడిగాడు శ్రీనివాసరావు. యుగంధర్ తల ఊపాడు.

"ఏమండీ! అక్కడ్నించి ఎంతసేపయినా ఊడిపడరేం?" అరిచింది అహల్య.

"బావరాలేదా?" అంటూ శ్రీనివాసరావు ఆ గదిలోంచి బయలుదేరాడు. అతని వెనకే యుగంధరూ, రాజుకూడా వెళ్ళారు.

''అన్నయ్యా! నాకు తోడుండండి. భయం వేస్తోంది'' అరిచింది అహల్య.

''వస్తున్నాను'' అంటూ శ్రీనివాసరావు నడవాలోకి వెళ్ళి నాలుగు అడుగులు వేశాడో లేదో ఆగిపోయాడు. ఎక్కడయితే రాజు పడున్నాడో అదే స్థలంలో వెంకటరత్నం బోర్లాపడున్నాడు.

**''బావా! బావా!''** అంటూ శ్రీనివాసరావు ఒక్క పరుగున అతని దగ్గరికి వెళ్ళి చెయ్యిపట్టుకుని చూశాడు.

వెంకటరత్నం నెమ్మదిగా లేచి కూర్చుని కళ్ళు నలుపుకుని ''నేనెక్కడ వున్నాను?'' అడిగాడు.

''నడవాలో పడున్నావు. ఏమైంది?''

''నాకు తెలియదు. అహల్య పిలిచింది. బైలుదేరాను. ఈ నడవాలోకి వచ్చాను. చీకటిగా ఉంది. ఏదో తలకి తగిలింది. పడిపోయాను'' అన్నాడు వెంకటరత్నం.

''ఏదీ? ఎక్కడ తగిలింది?'' అడిగాడు శ్రీనివాసరావు.

వెంకటరత్నం నుదురుపైన జుట్టులో చెయ్యిపెట్టి చూపించాడు. ''అవును. చిన్నబొప్పికట్టింది. అంతకన్నా ఏంలేదు'' అన్నాడు శ్రీనివాసరావు.

వెంకటరత్నం లేస్తూ బలవంతంగా నవ్వి ''దెయ్యం నా జోలికి కూడా వస్తోందా?'' అన్నాడు.

''నీకేం కొమ్ములు మొలిచాయా?'' అడిగాడు శ్రీనివాసరావు నవ్వుతూ. అంతలో అహల్య అక్కడికి వచ్చింది.

ఇంతలో రాధ పరిగెత్తుకుంటూ వచ్చి ''అన్నయ్యా! త్వరగా రా!'' అన్నది.

''ఎందుకు?'' అడిగాడు శ్రీనివాసరావు.

''వసంతక్కయ్య -'' పొంగి వస్తున్న దుఃఖం అణచుకుంటూ ''చాలా విషం మింగింది'' అన్నది.

శ్రీనివాసరావు పరిగెత్తాడు. వసంత పక్కమీద ఇటూఅటూ దొర్లుతోంది. బరువుగా ఊపిరి పీలుస్తోంది. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతోంది. శ్రీనివాసరావు చెయ్యిపట్టుకుని చూశాడు. వళ్ళు కాలిపోతోంది.

రాధని తన మందుల సంచి తెమ్మన్నాడు శ్రీనివాసరావు. వసంత పిచ్చి పిచ్చిగా మాట్లాడుతోంది. తను దెయ్యాన్ని చూసిందిట. దెయ్యం తనకెదురుగా నిల్చుడిందిట. దెయ్యం తనని చూసి నవ్విందిట - యిలాటి మాటలు. సంచి తీసుకురాగానే శ్రీనివాసరావు ఇంజక్షన్ యిచ్చాడు. ''రాధా! నువ్వు మెలుకువగా ఉండు. వసంత లేస్తే నాకు చెప్పు'' అన్నాడు.

అప్పటికి దాదాపు యింటిల్లిపాదీ ఆ గది బయట గుమికూడారు. సుందరరావు గదిలోంచి బయటికి వచ్చి క్రిష్ణమూర్తిని చూసి ''బావా! ఈ యింట్లోనే వుండాలని నిర్భంధించే హక్కు పోలీసులకి ఉన్నదా?'' అడిగాడు.

''లేదు. తమ దర్యాప్తు పూర్తి అయేంతవరకూ యీ ఊరొదిలి వెళ్ళవద్దని చెప్పే అధికారం ఉంది. ఈ ఇంట్లో ఉండవలసిన అవసరంలేదు'' అన్నాడు క్రిష్ణమూర్తి.

''అయితే రేపు పొద్దున్నే వసంతని తీసుకుని కేశవరావు ఇంటికి వెళతాను'' అన్నాడు సుందరరావు.

''నీ యిష్టం'' అన్నాడు అప్పుడే అక్కడికి వచ్చిన శ్రీనివాసరావు.

యుగంధర్ దగ్గాడు. అందరూ అటు తిరిగారు.

''ఒక విన్నపం. వసంత, పిల్లలు మినహా తతిమ్మావాళ్ళందరూ దయచేసి వాళ్ళ చేతి వేలిముద్రలు తీసుకునేందుకు అనుమతిస్తారా?'' అడిగాడు యుగంధర్.

"వేలి ముద్రలా! ఎందుకు?" అడిగాడు క్రిష్ణమూర్తి.

"ఉయ్యాలబల్ల మీద వేలిముద్రలు సంపాదించాను. అవి ఎవరివో తెలుసుకోవడానికి" అన్నాడు యుగంధర్.

"నాకెటువంటి అభ్యంతరమూ లేదు. తీసుకోండి" అన్నాడు శ్రీనివాసరావు.

"మీలో ఎవరికయినా అభ్యంతరం వున్నదా?" అడిగాడు యుగంధర్. అభ్యంతరం ఉన్నదని ఎవరూ అనలేదు. యుగంధర్ ఒక్కొక్కరినే తన గదిలోకి తీసుకువెళ్ళి వేలిముద్రలు తీసుకున్నాడు.

ఆఖరికి వచ్చిన సుధాకర్ వెళ్ళిపోయిన తర్వాత "ఉయ్యాల బల్లమీద వేలిముద్రలు లేవు కదా! ఎందుకు అబద్ధం చెప్పి వేలిముద్రలు తీసుకున్నారు?" రాజు రహస్యంగా యుగంధర్ని అడిగాడు. యుగంధర్ నవ్వి ఊరుకున్నాడు. అందరూ వాళ్ళవాళ్ళ గదుల్లోకి వెళ్ళి నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నారు. రాజూ, యుగంధర్ మాత్రం మేలుకుని కూర్చునున్నారు.

ఒంటి గంట దాటింది. రాత్రి రెండు గంటలయింది. ఎక్కడో పీటలులాగుతున్న చప్పుడు, నీళ్ళు ఒలకబోస్తున్న చప్పుడు స్పష్టంగా వినబడింది ఆ డిటెక్టివ్‌లకి.

"సుబ్బమ్మ ఈ చప్పుళ్ళు వినిపించే లేచింది నిన్న" అన్నాడు రాజు రహస్యంగా.

"నేను వెళ్ళి చూసి వస్తాను. నువ్వు యీ గదిలోనే ఉండు. ఆ బీరువా పక్కన చీకట్లో కూర్చో" అన్నాడు యుగంధర్. రాజు బీరువా పక్కకి వెళ్ళాడు. యుగంధర్ భోజనాల సావిట్లోకి వెళ్ళాడు. అడుగుల చప్పుడు విని "ఎవరది?" అడిగింది లచ్చి.

"నేను యుగంధర్ని. లచ్చీ! దీపం పెద్దది చెయ్యి."

లచ్చి దీపం పెద్దది చేసింది. యుగంధర్ వంట యింటి తలుపు దగ్గరికి వెళ్ళాడు. లోపల్నించి పీటలు లాగిన చప్పుదు, నీళ్ళు ఒలకపోసిన చప్పుడు స్పష్టంగా మళ్ళీ వినపడింది. వంట యింటి తలుపు గడియతీశాడు. దీపం తీసుకుని లోపలికి ఒక అడుగువేశాడు. కిటికీలు మూసి ఉన్నాయి. గదిలో ఎవరూ లేరు. బయటికి వచ్చి తలుపు మూసి గడియపెట్టాడు. "ఆ చప్పుళ్ళు ఎలా వస్తున్నాయి అయ్యగారూ?" అడిగింది లచ్చి.

"ఎలుక" అన్నాడు యుగంధర్. లాంతరు కిందపెట్టేసి గబగబా తన గదిలోకి వెళ్ళాడు. యుగంధర్ లోపలికి రాగానే రాజు బీరువా పక్కనుంచి వచ్చాడు.

"ఎవరైనా వచ్చారా?" అడిగాడు యుగంధర్ రాజుని.

"ఎవరూ రాలేదు."

యుగంధర్ కుర్చీలో చతికిలపడి "ఇదంతా దెయ్యమే చేసిందని నమ్మవలసి వచ్చేటట్లున్నది" అన్నాడు.

"ఏం?" అడిగాడు రాజు.

"వంట యింటి తలుపు గడియపెట్టి వుంది. లోపల పీట లాగిన చప్పుడు. నీళ్ళు ఒలకపోసిన చప్పుడు స్పష్టంగా వినిపించాయి. గడియ తీసి చూస్తే లోపల ఎవరూ లేరు. ఎలికో, పిల్లో రావడానికి వీలులేకుండా కిటికీలు మూసి ఉన్నాయి" అన్నాడు యుగంధర్.

"రామచంద్రరావుని హత్య చేసింది దెయ్యమేనని చెబితే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య మీకు మతి చలించిందని అనుకుంటాడు" అన్నాడు రాజు.

"ఈ ఇంట్లో దెయ్యం వుండి యీ అఘాయిత్యాలూ, యీ హత్యా ఆ దెయ్యమే చేసి వుంటే యీ యింట్లోంచి అందరూ ఎంత త్వరగా ఇంకోచోటికి వెళితే అంత మంచిది" అన్నాడు యుగంధర్.

"ఉన్నట్లుండి యింత నిరుత్సాహపడుతున్నారు ఎందుకు?" అడిగాడు రాజు.

"చెప్పానుగా! వంట యింట్లో చప్పుళ్ళకి యితర కారణం ఏదీ ఊహించలేకుండా ఉన్నాను. మనిషే చేశాడని నిరూపించేందుకు గానీ, అనుమానించేందుకు గానీ యే చిన్న సాక్ష్యమూ కనిపించలేదు" అన్నాడు యుగంధర్. అంతలో తలుపు దగ్గర ఏదో చప్పుడయి యిద్దరూ అటు చూశారు. యుగంధర్ గదిలోకి వచ్చినప్పుడు తలుపు వేసి లోపలి గడియపెట్టాడు.

"చూడు" అన్నాడు యుగంధర్.

రాజు చప్పుడు చెయ్యకుండా లేచి వెళ్ళి గడియ నెమ్మదిగా తీసి తలుపులాగాడు. తెరుచుకోలేదు. వెనక్కి వచ్చి యుగంధర్‌తో ఆ విషయం రహస్యంగా చెప్పాడు. యుగంధర్ జేబులోంచి అగ్గిపెట్టె తీసి బల్లమీద వున్న దీపం వెలిగించి తలుపు దగ్గరికి వెళ్ళి గట్టిగా లాగిచూశాడు. తెరుచుకోలేదు. "క్విక్" అన్నాడు.

"ఏమిటి?" అడిగాడు రాజు.

"ఏదో జరగబోతోంది. మనం ఈ గదిలోంచి బయటికి వెళ్ళకుండా" అని యుగంధర్ అంటూండగానే కెవ్వుమని కేక వినిపించింది. ఒకసారికాదు. ఆగకుండా కేక మీద కేక వినపడుతోంది.

యుగంధర్ తలుపుని ఒక్క తన్ను తన్నాడు. వెంటనే రాజు ఒక తన్ను తన్నాడు. మొదట వినిపించిన కేక ఆడమనిషిదని యుగంధర్ గ్రహించాడు. ఆ కేక తర్వాత యింట్లో అందరూ లేచారు. పిల్లలు గుక్కపట్టి ఏడుస్తున్నారు. పెద్దవాళ్ళు కంగారుతో అస్పష్టమైన అరుపులు అరుస్తున్నారు. తలుపులు విరగగొడుతున్నారు.

"రాజూ! త్వరగా" అన్నాడు యుగంధర్.

ఆ డిటెక్టివ్‌లు ఇద్దరూ కలిసి తలుపు విరగగొట్టడానికి చాలా శ్రమపడుతున్నారు. పాతకాలపు ఇల్లది. దొంగకి సాధ్యం కాకుండా కట్టుదిట్టంగా కట్టిన యిల్లది. బలంగా తంతే విరిగే తలుపులు కావు.

"ఉహూ! కదలడంలేదు" అన్నాడు రాజు.

ఆ తలుపు విరగగొట్టలేనని యుగంధర్ కూడా తెలుసుకున్నాడు. రాజుని పిస్తోలు తెమ్మన్నాడు. రాజు తోలు పెట్టె తెరిచి అందులోంచి పిస్తోళ్ళు తీశాడు. తూటాలు ఉన్నాయో లేదో సరిచూసి ఒకటి యుగంధర్‌కి అందించాడు. "తలుపుకి అవతల యెవరయినా ఉంటే అడ్డం లేవండి. ఈ ప్రాంతాల నించి వెళ్ళిపొండి" అన్నాడు యుగంధర్. పిస్తోలు తలుపు బయట గడియ ఎక్కడ ఉంటుందో అటు గురిపెట్టాడు. గడియకి తగిలిన తర్వాత గుండు నేలమీద్ పడేటట్లు గురిపెట్టాడు.

"ఢాం! ఢాం!" గుళ్ళు గడియకి తగిలాయి. తలుపుకి గడియను బిగించిన మేకులు ఊడాయి. యుగంధర్ తలుపు లాగాడు, తెరుచుకుంది.

చెవులు చిల్లులు పడేటట్లు కేకలు వినబడుతున్నాయి. ఒక చోటినించి కాదు ఒక వైపునించి కాదు. యుగంధరూ, రాజూ నడవాలోకి పరిగెత్తారు. నడవలోకి వెళుతుండగా ఒక గదిలోంచి తలుపు బాదుతున్న చప్పుడు వినిపించింది. బయట గడియవేసి ఉండడంవల్ల ఆ గదిలో వాళ్ళు తలుపు తెరవడానికి ప్రయత్నిస్తున్నారని గ్రహించి యుగంధర్ ఆ తలుపు సమీపించి గడియలాగాడు.

"ఏమిటిది? ఎవరు గడియపెట్టారు? ఏమిటీ కేకలు? పిస్తోలు పేలింది ఎక్కడ?" గబగబా ప్రశ్నల వర్షం కురిపించాడు సుధాకర్.

"నాకేం తెలియదు. నా గది తలుపూ ఎవరో బయట గడియపెట్టారు. పిస్తోలుతో పేల్చి తలుపు గడియ విరగగొట్టి బయటపడ్డాను. బహుశా అన్ని గదుల తలుపులూ ఇలాగే బయట గడియలు పెట్టి ఉన్నాయని అనుకుంటాను. వెళ్ళి తలుపు తీయండి. రాజూ! నువ్వు కూడా వెళ్ళు" అని యుగంధర్ వంట యింటివైపు పరిగెత్తాడు.

యుగంధర్ వంటయింటివైపు ఎందుకు పరిగెత్తాడా అని సుధాకర్ ఆశ్చర్యపోయాడు. భోజనాల సావిడికీ, నడవాకీ మధ్య ఉన్న తలుపు దగ్గర వంటమనిషి సుబ్బమ్మ, దాసీది లచ్చి ఒకర్నొకరు కావలించుకుని భోరుమని ఏడుస్తున్నారు.

"భయంలేదు. ఏడవకండి. వీరయ్య ఏడీ?" అడిగాడు యుగంధర్. వాళ్ళిద్దరినీ సముదాయించి, వాళ్ళనించి జవాబు సంపాదించడానికి ఆలస్యం అవుతుందని యుగంధర్ అవతల వసారాలోకి పరిగెత్తాడు. వీరయ్య దుప్పటి ముసుగు పెట్టుకుని నిద్రపోతున్నాడు.

"వీరయ్యా! వీరయ్యా లే!" అన్నాడు యుగంధర్.

వీరయ్య లేవలేదు. యుగంధర్ దుప్పటి లాగేసి, వీరయ్యని ఒక్క కుదుపు కుదిపాడు వీరయ్య ఓ మూలుగు మూలిగి, చటుక్కున లేచి కూర్చున్నాడు. "ఏమిటయ్యగారూ?" అన్నాడు తడబడుతూ. లేచి నిలబడపోయాడు కాని లేవలేకపోయాడు.

"ఇంతగొడవ జరుగుతూ ఉంటే నువ్వు నిద్ర ఎలా పోతున్నావు? మెలుకువ రాలేదా?"

"లేదయ్యగారూ!" అన్నాడు వీరయ్య లేచి నిలబడి.

యుగంధర్ వీరయ్యని పడిపోకుండా పట్టుకున్నాడు.

మీరిటు వెళ్ళారని రాజు చెప్పాడు" అంటూ శ్రీనివాసరావు వచ్చాడు అక్కడికి.

"మీ గది తలుపు కూడా బయట గడియపెట్టి ఉన్నదా?" అడిగాడు యుగంధర్.

"అవును. రాజు వచ్చి తీశాడు. అన్ని గదుల తలుపులూ బయట గడియలు పెట్టి ఉన్నాయి."

"శ్రీవాసరావుగారూ! వెంటనే వీరయ్యని పరీక్ష చెయ్యాలి మీరు."

"దేనికి?"

"ఇంత గొడవ జరుగుతున్నా వీరయ్యకి మెలుకువ రాలేదు. మత్తుమందో, నిద్రమందో యిచ్చి ఉండాలి అతనికి, మీరు పరీక్ష చేసి నా ఊహ రైటో కాదో చెప్పండి" అన్నాడు యుగంధర్.

"రా, వీరయ్యా!" పిలిచాడు శ్రీనివాసరావు వీరయ్యని. తర్వాత యుగంధర్ సుబ్బమ్మ, లచ్చి వున్న చోటికి వెళ్ళాడు. అప్పటికి వాళ్ళు అరుపులు మానారు.

"ఎందుకలా అరిచారు? ఏమైంది?" అడిగాడు యుగంధర్ వాళ్ళని.

"లచ్చి కేకలు వేసింది. ఏమైందో అని నా గుండె దడదడమన్నది. నేనూ దానితోపాటు కేకలు వేశాను."

"లచ్చీ! నువ్వెందుకు కేకలు వేశావు?"

"నిద్రపోతున్నాను. నా కాలు ఎవరో తొక్కారు. విరిగిపోయినంత బాధ పెట్టింది. కెవ్వున కేకవేశాను" అంటూ పాదం చూపించింది లచ్చి.

"ఎవరు నీ పాదం తొక్కారో చూడలేదా?"

"లేదండీ! చీకటిగా వుంది. నేను కేకవేసి లేచి కూర్చున్నాను. ఎవరూ కనపడలేదు. సుబ్బమ్మగారు నన్ను పట్టుకుని నాతోపాటు కేకలు వెయ్యడం ప్రారంభించారు" అన్నది లచ్చి. యుగంధర్ తనలో తను నవ్వుకుంటూ వెనక్కి తిరిగాడు. లచ్చి, సుబ్బమ్మ యుగంధర్ వెనకే బయలుదేరారు. నడవాదాటి ఉయ్యాలబల్ల వున్న గదిలోకి వెళ్ళాడు యుగంధర్. రాజు ఒంటిగా నిలుచున్నాడు అక్కడ.

"ఏం రాజూ! అందర్నీ వాళ్ళ వాళ్ళ గదుల్లోంచి చెరవిడిపించావా?" అడిగాడు యుగంధర్.

రాజు తలవూపి "ఆఁ అన్ని గదులూ బయట గడియపెట్టి వున్నాయి" అన్నాడు మొహం వేలాడేసుకుని.

"ఏం అలా నీరసించావ్?" అడిగాడు యుగంధర్ నవ్వుతూ. "ఏమున్నది? దెయ్యమే ఈ పనులన్నీ చేస్తున్నదని ఒప్పుకోక తప్పదు" అన్నాడు రాజు.

"ఏమో! దెయ్యమే చేస్తుంటే మాత్రం యేం? దెయ్యాన్ని పట్టుకుని పోలీసులకి ఒప్పచెప్పలేమా?" అన్నాడు యుగంధర్. అంతలో శ్రీనివాసరావు వచ్చి "వీరయ్యని క్షుణ్ణంగా పరీక్ష చేశాను. నిద్రమందు కానీ, మత్తుమందు కానీ యిచ్చిన లక్షణాలు యేమీలేవు" అన్నాడు

"సరే, నువ్వు వెళ్ళి పడుకో వీరయ్యా!" అన్నాడు యుగంధర్. "శ్రీనివాసరావుగారూ! నా గదిలోకి ఒకసారి రండి" అని పిలిచాడు. గదిలోకి వెళ్ళాక శ్రీనివాసరావుని కూర్చోమని చెప్పి దీపం పెద్దదిచేసి "వీరయ్య మీ యింట్లో ఎంతకాలం నించి పనిచేస్తున్నాడు?" అడిగాడు యుగంధర్.

"నాకు ఊహ తెలిసినప్పట్నించీ, నా కన్నా రెండు మూడేళ్ళు పెద్దవాడనుకుంటాను. చిన్నప్పట్నించీ వీరయ్య మా యింట్లోనే ఉన్నాడు" అన్నాడు శ్రీనివాసరావు.

"వీరయ్యకి సంసారం లేదా? మీ యింట్లో ఎందుకు ఉన్నాడు?" అడిగాడు యుగంధర్.

"వీరయ్య పుట్టినప్పుడే అతని తండ్రిపోయాడట. వీరయ్య తల్లి మా యింట్లో పనిచేసేది. అందుకే వీరయ్య ఎప్పుడూ మా యింట్లోనే ఉండేవాడు."

"వీరయ్య తల్లి చనిపోయి ఎంతకాలం అయింది?"

"పదేళ్లయింది. ఎందుకు అడుగుతున్నారు?"

"వీరయ్యకి ఈ ఇంట్లోవాళ్ళమీద ఎవరి మీదనయినా పరిమితమైన ద్వేషం ఉన్నదా?"

శ్రీనివాసరావు కనుబొమలు చిట్లించి "ఎందుకుంటుంది? లేదు. అతనికి ద్వేషం కలిగేటంతవరకూ ఎవరు అతనితో చనువుగా ఉంటారు? పోనీ ఎవరయినా అతన్ని తిట్టి హీనపరుస్తున్నారేమో అనుకోడానికి వీరయ్య పనిలో చాలా సమర్థుడు. బద్ధకస్తుడు కాదు. ఏ విషయంలోనూ అతన్ని తప్పుపట్టడానికి ఉండదు" అన్నాడు శ్రీనివాసరావు.

"పోనీ అతనికి ఎవరిమీదనయినా ఎక్కువ యిష్టం వున్నదా?" అడిగాడు యుగంధర్.

"చిన్నప్పట్నించీ పోషించిన మా నాన్నా, అమ్మా మీద ఉండాలి" అని చిన్నగా నవ్వి "బహుశా రామచంద్రరావు మీద ఎక్కువిష్టం ఉండవచ్చు" అన్నాడు.

"ఎందువల్ల?"

"నాలుగేళ్ళ క్రితం నాన్నగారు వీరయ్యని చెడతిట్టి యిక యింట్లో ఉండవద్దన్నారు. అప్పుడు రామచంద్రరావు బావా, దుర్గా యిక్కడ ఉన్నారు. రామచంద్రరావు వీరయ్యకి కొంత డబ్బు ఇచ్చాడు. తను ఊరికి బయలుదేరేటప్పుడు వీరయ్యని తనతో తీసుకు వెళ్ళాడు. నాన్నగారికి ఆ విషయం తెలియదు."

"మళ్ళీ వీరయ్య ఎట్లా యిక్కడికి వచ్చాడు?"

"ఆ ఊళ్ళో వీరయ్యకి తోచలేదు. నాలుగునెలలు బావ దగ్గర వుండి ఓ రోజున రైలు ఎక్కి యిక్కడికి వచ్చేశాడు. నాన్నగారు పళ్ళు తోముకుంటూండగా ప్రత్యక్షమై బతిమాలుకున్నాడుట. నాన్నగారు నవ్వి 'చెంబులో నీళ్ళు పట్టుకురా!' అన్నారుట."

యుగంధర్ దీర్ఘాలోచనలో పడ్డాడు.

"ఎందుకు వీరయ్యని గురించి ఇన్ని ప్రశ్నలు వేశారు? అతను చేస్తున్నాడనా మీ అనుమానం?"

"ఇంకా ఆలోచించాలి. తర్వాత చెపుతాను" అన్నాడు యుగంధర్.

శ్రీనివాసరావు చేతి గడియారం చూసుకుని "మూడు గంటలయింది. కాసేపన్నా నిద్రపోవాలి. పొద్దున్నే సర్కిల్ యిన్‌స్పెక్టర్ రాఘువయ్య వస్తాడు" అని లేచాడు. యుగంధర్ తల ఊపాడు.

యుగంధర్ సిగిరెట్ తర్వాత సిగిరెట్ వెలిగిస్తూ గదిలో పచార్లు చెయ్యనారంభించాడు. "హత్య జరిగిన రాత్రి శ్రీనివాసరావు, మిగతా వాళ్ళు వంట యింటి దగ్గరికి వెళ్ళినపుడు జరిగిన విషయాలు వ్రాసుకున్నావుగా! చదువు" అన్నాడు యుగంధర్ రాజుతో.

రాజు డైరీ తీసి దీపం పక్కన కూర్చుని నెమ్మదిగా చదవడం ప్రారంభించాడు. యుగంధర్ కళ్ళు మూసుకుని మనస్సంతా లగ్నం చేసి వింటున్నాడు. పెరట్లో దిష్టిబొమ్మ ఉన్నదీ లేనిదీ చూసి రమ్మని వీరయ్యకి శ్రీనివాసరావు చెప్పడం, వీరయ్య కదలకపోవడం, సరిగా ఆ సమయానికి ప్రభాకరరావు వచ్చి తను చూస్తానని చెప్పడం చదివాడు రాజు.

"చాలు" అన్నాడు యుగంధర్. "ఈ పనులన్నీ వీరయ్య చేశాడనా మీ అనుమానం?" అడిగాడు రాజు.

"నాకటువంటి అనుమానం కలిగిందని నువ్వెందుకు అనుకున్నావు?" అడిగాడు యుగంధర్.

"ఇంట్లో అంత గొడవ జరుగుతున్నా వీరయ్య గాఢ నిద్రలో ఉన్నాడు. మీరు లేపితే కానీ లేవలేదు. నిద్రమందో, మత్తుమందో యివ్వబడిందేమోనని శ్రీనివాసరావుని పరీక్ష చెయ్యమన్నారు. అటువంటి లక్షణాలు ఏమీలేవని చెప్పాడు ఆయన. అన్ని గదుల తలుపుల గడియలు బయట వేసి ఉన్నాయి. ఆ పనిమనిషి చేసి ఉంటే భోజనాల సావిట్లో పడుకున్న సుబ్బమ్మ, లచ్చి వీరయ్య ఈ ముగ్గురిలో ఎవరో చేసి ఉండాలి. లచ్చి కాలు తొక్కినట్లయి లేచానని చెప్పింది. బహుశా వీరయ్య గడియలు పెట్టి వెళుతూ చూసుకోకుండా లచ్చికాలు తొక్కివుండవచ్చు" అన్నాడు రాజు.

"నీ హేతువాదం చాలా సబబుగా వుంది. అయితే వీరయ్య ఎందుకు ఈ పనులు చేశాడంటావు?" అడిగాడు యుగంధర్. తెలియదని రాజు తలతిప్పాడు.

"పూజ గంటని వేలిముద్రలకోసం పరీక్ష చేశాము. అలాగే పూల తొట్టెనీ పరీక్ష చేశాము. వాటిమీద మనకి వేలిముద్రలు దొరకలేదు. అంటే వేలిముద్రలు తడిచెయ్యాలనే జ్ఞానం అతనికి ఉంటుందా?" రాజు జవాబు చెప్పలేదు.

"అంతేకాదు. ఈ విషయమూ ఆలోచించు. ఈ యింట్లో దెయ్యం ఉన్నదని అందరూ భయపడడానికి చేసిన పనులన్నీ చాలా తెలివిగా చేయబడ్డాయి. దుప్పట్లు మీద పేడముద్రలు, సిరా ముద్రలు గురించి ఆలోచించు. వెంకటరత్నం వెళ్ళి శ్రీనివాసరావుని పిలుచుకుని వచ్చేలోగా దుప్పటి మార్చి వేయబడ్డది. శ్రీనివాసరావు మళ్ళీ తన గదికి వెళ్ళేటప్పటికి పేడ ముద్రలున్న దుప్పటి తలుపుకి తెరగా కట్టబడింది. అలాగే గంట మోగటం గురించి ఆలోచించు. తెలివిగా ఆలోచించి చాకచక్యంతో ఈ పనులన్నీ చేయబడ్డాయి. మనిషి ఎవరూ ఈ పనులు చెయ్యలేడు అనిపించేలాగా మంచి నేర్పుగా జరిగాయి ఈ సంఘటనలన్నీ. అంత తెలివైన మెదడు, అంత చాకచక్యంవున్న మనిషి వీరయ్యే అయితే ఈ రాత్రి ఈ గడియలు పెట్టడం యింత తెలివి తక్కువగా ఎందుకు చేస్తాడు? ఇంట్లో అందరూ గదుల్లో పడుకున్నారు. బయట పడుకున్న మగ మనిషి వీరయ్య ఒక్కడి మీదికే పోదు. లచ్చి, సుబ్బమ్మ అక్కడ పడుకున్నారని తెలిసి కూడా చూసుకోకుండా వీరయ్య లచ్చి కాలుతొక్కి వుంటే అది అతని కంగారుకి సూచన కదూ. అంత నిబ్బరంగా ఇన్ని పనులు చేసిన అతను అలా కంగారు పడతాడా! ఇంకొక విషయం. వీరయ్య కూడా లేచి కేకలు పెట్టివుంటే అనుమానం అతని మీదికి పోదుకదా! అతను ముసుగుతన్ని నిద్రపోతున్నాడనే కదా అనుమానం అతని మీదికి వెళ్ళింది. నేర్పుగా నిన్నా మొన్నా అన్ని పనులు చేసిన వీరయ్య ఈ రాత్రి ఇంత తెలివితక్కువగా ఎందుకు ప్రవర్తిస్తాడు?" అడిగాడు యుగంధర్.

"వీరయ్యకాదు. ఇంకెవరో చేసి ఉండాలి" అన్నాడు రాజు.

**"ఇంకెవరో** చేయడానికి వీలు ఏదీ? వీరయ్య ఒక్కడికే ఆ అవకాశం ఉంది. తతిమ్మా వాళ్ళందరూ వాళ్ళ వాళ్ళ గదుల్లో నిర్బంధింపబడ్డారు కదా! హేతువాదంతో వీరయ్యే అయి వుండాలి అని నువ్వే తేల్చావు కదా యిందాక" అన్నాడు యుగంధర్.

"హేతువాదంతో వీరయ్య అయి ఉండడానికి వీలులేదని మీరు తేల్చారు కదా!" అన్నాడు రాజు.

యుగంధర్ నవ్వి "మనం యింత చర్చించడం అనవసరం. మన తలుపు గడియమీద వేలిముద్రలు ఉండాలి. పరీక్షించు" అన్నాడు యుగంధర్. రాజు వేలిముద్రల సరంజామా తీసుకుని వెళ్ళాడు. కాసేపట్లో తిరిగి వచ్చి "అవును. ఎవరివో వేలిముద్రలు వున్నాయి" అన్నాడు.

"అనుమానం ఎందుకు? వీరయ్య వేలిముద్రలు తీసుకుని పోల్చి చూడు" రాజు వేలిముద్రలు తీసుకునేందుకు నల్లసిరా, కాగితం తీసుకుని వెళ్ళిపోయాడు. పది నిమిషాల తర్వాత తిరిగి వచ్చి "వీరయ్య వేలిముద్రలు తీసుకున్నాను. గడియ మీది వేలిముద్రలతో పోల్చి చూసి చెపుతాను" అన్నాడు.

యుగంధర్ తల ఊపాడు.

"సార్!"

"ఆ!"

"గడియమీది వేలిముద్రలు వీరయ్యవే" అన్నాడు రాజు ఉద్రిక్తంగా.

"అయ్యుండాలి" అన్నాడు యుగంధర్.

"కనుక నా వాదనే సరయినది" అన్నాడు రాజు గదిలోకి వచ్చి.

"అంటే?"

"ఈ యింట్లో దెయ్యం ఉన్నట్లు అందరూ అనుకోడానికి వీరయ్యే ఈ పనులు చేశాడు" అన్నాడు రాజు.

యుగంధర్ తల విదిలించి "తలుపులు గడియపెట్టడం చాలా తెలివి తక్కువగా ఉన్నదని చెప్పానుగా! గడియ మీద వున్న వీరయ్య వేలిముద్రలని బట్టి ఈ రాత్రి తలుపులన్నీ బయట గడియపెట్టింది వీరయ్యేనని తేలింది. అంతే. వీరయ్యకి యిదివరకు జరిగిన సంఘటనలతో సంబంధం వున్నదని కానీ, అతనే చేశాడని కానీ నిరూపితం కాలేదు. పైగా హేతువాదంతో ఆలోచిస్తే ఆ పనులు అతను చేసి ఉండడనీ, చాలా తెలివిగల మనిషి - మేధస్సుతో ఆలోచించగల మనిషి ఎవరో చేసి ఉండాలనీ బోధపడుతోంది" అన్నాడు యుగంధర్.

రాజు అయోమయంగా యుగంధర్‌ని చూస్తూ "అంటే ఈ రాత్రి తలుపులు గడియలు పెట్టడం ఒక్కటే వీరయ్య చేశాడనీ, ఇదివరకు జరిగినవన్నీ ఇంకెవరో చేశారనీ అంటున్నారా?" అడిగాడు.

"అవును."

"వీరయ్య తలుపులు ఎందుకు గడియపెట్టాడు?" అడిగాడు రాజు.

"అదే ప్రశ్న. ఆ ప్రశ్నకి తార్కికంగా సమాధానం ఆలోచిద్దాం. ఈ యింట్లో దెయ్యం ఉందని అందర్నీ నమ్మించేందుకు వీరయ్య ఎందుకు ప్రయత్నిస్తాడు? రామచంద్రరావు హత్యకి కారణం దెయ్యమేనని అందరూ నమ్మడానికి కాకపోతే. అవునా?" రాజు తల ఊపాడు.

"కానీ యింకో సందేహం కలుగుతోంది. ఈ దెయ్యాన్ని సృష్టించి, మొదట ఈ అఘాయిత్యాలు ప్రారంభించిన మనిషి ఏమయ్యాడు? అతనెందుకు ఈ రాత్రి ఎటువంటి అఘాయిత్యానికి పూనుకోలేదు? రామచంద్రరావు హత్యతో అతని పని అయిపోయి యిక దెయ్యం అనవసరం అనుకునుండాలి కదా! కానీ అలా అనుకుంటాడా? ఇంకా ఒకటి రెండు రోజులు ఏవో అఘాయిత్యాలు చేస్తే దెయ్యమే రామచంద్రరావును హత్య చేసిందని అందరూ అనుకుంటారు కదూ! అయినా అఘాయిత్యాలు ఏవీ చెయ్యకపోవడానికి కారణం మనం కాచుకునుండడం వల్ల పట్టుబడతానేమో అనే భయం అయి ఉండాలి. అది అంత సబబుగా లేదు. దూరంగా గంట మోగించడం, చప్పుళ్ళు చేయడంలాంటి పనులు చేస్తే ఎలా పట్టుబడతాడు? పోతే ఆ మనిషి యింకా ఇటువంటి పనులు చేసే స్థితిలో వుండి ఉండకపోవచ్చు" అన్నాడు యుగంధర్.

"నన్నూ, వెంకటరత్నాన్నీ తలమీద కొట్టింది వీరయ్యేనని మీ అనుమానమా?" అడిగాడు రాజు.

"సందేహం లేదు. వీరయ్యే" అన్నాడు యుగంధర్.

"వీరయ్య ఎందుకు చేశాడు? హత్యచేసిందెవరో తెలిస్తే అతనికి ఏం?" అడిగాడు రాజు.

"చిన్నతనం నించీ ఈ యింట్లో ఒకడుగా పెరిగాడు వీరయ్య. వీళ్ళని చూస్తే అతనికి ఎంతో గౌరవమూ, యిష్టమూ వుండి ఉండాలి. ఈ రోజుల్లో పల్లెటూళ్ళల్లో పెద్ద కుటుంబాలలో తప్ప ఇటువంటి పనివాళ్ళు ఉండడం అరుదు. ఈ కుటుంబంలోని వ్యక్తిని ఎవరినీ హంతకుడుగా పట్టుకోవడం వీరయ్యకి యిష్టం ఉండదు. బహుశా అతని దృష్టిలో ఈ హత్య సమర్థనీయం కూడా కావచ్చు. అతని సానుభూతి హంతకుడి మీద ఉండి ఉండవచ్చు" అన్నాడు యుగంధర్.

"మీ మాటలని బట్టి హత్య ఎవరు చేసిందీ, ఎందుకు చేసిందీ కూడా మీరు గ్రహించినట్లే ఉన్నది" అన్నాడు రాజు. యుగంధర్ తల ఊపాడు.

"ఎవరు?" అడిగాడు రాజు.

"ఆలోచించు. నీకే స్ఫురిస్తుంది" అన్నాడు యుగంధర్.

## 21

"సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య వచ్చారు. అన్నయ్య ఆయనతో మాట్లాడుతున్నాడు. మిమ్మల్ని ఒకసారి రమ్మని చెప్పమన్నాడు" అన్నాడు క్రిష్ణమూర్తి యుగంధర్ గదిలోకి వచ్చి.

"వస్తున్నాను" అన్నాడు యుగంధర్.

"రాత్రి మళ్ళీ గొడవ జరిగిందటగా!" అన్నాడు రాఘవయ్య యుగంధర్ గదిలో ప్రవేశించగానే.

"అవును. శ్రీనివాసరావుగారు వివరాలన్నీ చెప్పే ఉంటారు. పోస్టుమార్టం అయిందా?" అడిగాడు యుగంధర్ కుర్చీలో కూర్చుంటూ.

"ఆ! రిపోర్టు యిదుగో. కొత్త విషయాలు ఏమీలేవు" అంటూ ఓ కవరులోంచి కాగితం తీసి యుగంధర్‌కి ఇచ్చాడు రాఘవయ్య. యుగంధర్ ఆ కాగితం చూసి మడిచి రాఘవయ్యకి ఇచ్చేశాడు.

"మీరుండగా కూడా ఈ ఇంట్లో అఘాయిత్యాలు జరిగాయంటే ఆశ్చర్యంగా ఉంది. హత్యకి సంబంధించిన విషయాలు ఏమైనా తెలిశాయా?" అడిగాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య.

"నా ఊహ సరయినదయితే –" అని వాక్యం పూర్తి చెయ్యకుండా వొదిలేశాడు యుగంధర్.

"అయితే?" అడిగాడు రాఘవయ్య.

"తర్వాత చెపుతాను. వీరయ్యని పిలిపించండి. అతన్ని కొన్ని ప్రశ్నలు అడగాలి" అన్నాడు యుగంధర్.

"నేను వెళ్ళి పిలుచుకు వస్తాను" అన్నాడు రాజు.

తలుపు గడియమీద వీరయ్య వేలిముద్రలుండడం, హేతువాదంతో అతనే తలుపు గడియపెట్టాడని నిర్ణయించడం యుగంధర్ శ్రీనివాసరావుకీ, రాఘవయ్యకీ చెప్పాడు. "వీరయ్య ఎందుకు చేస్తాడు? వాడికి ఏమిటి లాభం? మతిపోయి ఉండాలి" అన్నాడు శ్రీనివాసరావు.

అంతలో వీరయ్యని పిలుచుకుని రాజు గదిలోకి వచ్చాడు. "తలుపు మూసెయ్యి రాజూ!" అని చెప్పి "వీరయ్యా!" అన్నాడు యుగంధర్.

"అయ్యా!"

"రాత్రి తలుపులు గడియపెట్టింది నువ్వేకదూ!"

"అదేమిటయ్యా! నేనెందుకు గడియలు పెడ్తాను?"

"ఎందుకు పెట్టావో నాకు తెలుసు వీరయ్యా! నువ్వే నా గది తలుపు బయట గడియ పెట్టావని సాక్ష్యం ఉంది. నీ వేలిముద్రలు ఆ గడియ మీద ఉన్నాయి" అన్నాడు యుగంధర్.

వీరయ్య ఖంగారుగా రాఘవయ్యనీ, యుగంధర్ని చూసి "ఏమో! ఎందుకున్నాయో?" అన్నాడు.

"చేత్తో తలుపు గడియ పెట్టావు గనుక నీ వేలిముద్రలు పడ్డాయి."

"నేనెందుకు మీ గది తలుపు పెట్తానయ్యా!"

"చెప్పమంటావా ఎందుకు గడియపెట్టావో! ఈ యింట్లో దెయ్యం ఉన్నదని అందరూ - ముఖ్యంగా నేనూ, పోలీసులూ నమ్మడానికి."

"ఈ యింట్లో దెయ్యం ఇన్ని పనులు చేస్తుంటే మిమ్మల్ని నమ్మించడం దేనికి?" అన్నాడు వీరయ్య.

"అలా ఎదురు ప్రశ్నలు వేసి తప్పించుకోలేవు వీరయ్యా! రామచంద్రరావు యీ అఘాయిత్యాలు చేస్తుండగా నువ్వు చూడలేదా?" అడిగాడు యుగంధర్. శ్రీనివాసరావూ, రాఘవయ్య ఆశ్చర్యంతో చూశారు యుగంధర్ని.

"రామచంద్రరావయ్యా! ఆయన పోయారు గదయ్యా!" అన్నాడు వీరయ్య ఖంగారుగా.

యుగంధర్ శ్రీనివాసరావు వైపు తిరిగి "మీ కుటుంబ గౌరవం నాశనమౌతుందని వీరయ్య నిజం చెప్పడం లేదు. హత్య దెయ్యమే చేసిందని పోలీసులు నమ్మి వెళ్ళిపోతారని నిన్న రాత్రి అతనే చేశాడు ఆ గొడవంతా. అతను నిజం చెప్పడంలేదు కనుక యిక చెయ్యగలిగిందేమీ లేదు. శ్రీనివాసరావుగార్నీ, ఆయన ముగ్గురు తమ్ముళ్ళనీ అరెస్టు చేసి తీసుకువెళ్ళండి. వాళ్ళు నలుగురూ కలిసి రామచంద్రరావుని హత్య చేశారు" అన్నాడు.

"అదేమిటి యుగంధర్ -?" రాఘవయ్య అన్నాడు ఆశ్చర్యంతో.

"యుగంధర్! పరిహాసానికా!" అన్నాడు శ్రీనివాసరావు.

"పరిహాసానికి కాదు. నిజంగానే చెపుతున్నాను. వీరయ్య నిజం చెప్పాడంటే హత్య చేసిన మనిషిని పట్టుకోడానికి అవకాశం ఉంటుంది. అతను నిజం దాచే పక్షంలో మిమ్మల్ని నలుగుర్నీ అరెస్టు చెయ్యక తప్పదు" అన్నాడు యుగంధర్.

"అయ్యయ్యో! అంత పని చెయ్యద్దు బాబూ! నిజం చెప్పేస్తాను" అన్నాడు వీరయ్య.

"ఊ! త్వరగా చెప్పు" అన్నాడు యుగంధర్.

"మీరు చెప్పింది నిజమేనయ్యా! రాత్రి నేనే మీ గది తలుపులు బయట గడియ పెట్టాను. అందరి గదులకీ గడియలు పెట్టింది నేనే" అని ఒప్పుకున్నాడు వీరయ్య.

"లచ్చి కాలు తొక్కిందీ?"

"నేననయ్యా!"

"అంతకుముందు ఉయ్యాల ఊయిందీ?"

"నేనే."

"రాజుని తలమీద కొట్టిందీ?"

"నేనే."

"పూజ గంట మోగించిందీ?"

"నేనేనయ్యా"

"ఎందుకు అలా చేశావు?"

"రామచంద్రరావు అయ్యగార్ని చంపింది దెయ్యం అని మీరనుకునేందుకు."

"మొదట ఉయ్యాల ఊపిందీ, పూజగంట మోగించిందీ ఎవరు?" అడిగాడు యుగంధర్.

"రామచంద్రరావు అయ్యగారు."

"ఆయనే అని నీకెలా తెలుసు?"

"నా కళ్ళారా చూశానయ్యా!"

"ఏం చూశావో వివరంగా చెప్పు."

"ఉయ్యాల ఊపడం చూశానయ్యా. ఉయ్యాల ఎందుకు ఊగుతోందని చూడ్డానికి క్రిష్ణమూర్తి అయ్యగారికంటే ముందు వెళ్ళాను. రామచంద్రరావు అయ్యగారు ఊపేసి నడవాలోకి పరిగెత్తుకు రావడం చూశాను. మర్నాడు పొద్దున్న ఆయన పుజ గదిలోంచి బైటికి రావడం చూశాను. పేడ చెయ్యి కడుక్కుంటూండగా చూశాను" అన్నాడు వీరయ్య గుక్క తిప్పుకోకుండా.

"చూసిన వాడిని నాతో ఆ విషయం ఎందుకు చెప్పలేదు?" అడిగాడు శ్రీనివాసరావు.

"చెప్పవద్దన్నారు ఆయన."

"ఓహో! అయితే నువ్వు చూశావని రామచంద్రరావుకి తెలుసునన్నమాట. ఎందుకు చేశాడో చెప్పాడా?" అడిగాడు శ్రీనివాసరావు.

"లేదయ్యా! అడిగాను. అందరి మంచికోసం అలా చేస్తున్నానని చెప్పారు."

"అబద్ధం చెప్పక వీరయ్యా! ఎందుకు చేస్తున్నదీ నీకు చెప్పాడు ఆయన. అందుకే నువ్వు ఎవరికీ చెప్పకుండా ఊరుకున్నావు. ఆస్తి పంచేసుకుని, అమ్మివేసి, ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతారనీ, అది శ్రీనివాసరావుగారి తండ్రి ఇష్టానికి వ్యతిరేకమనీ, ఆయన ఆత్మకు శాంతి ఉండాలంటే అలా చెయ్యకూడదనీ రామచంద్రరావు నీకు చెప్పాడు. అందుకే ఆయన అశాంతితో దెయ్యంగా వచ్చి తన అయిష్టం చూపిస్తున్నాడని అందరూ నమ్మి ఆస్థి అమ్మేసే ఆలోచన మానుకునేందుకు యీ అఘాయిత్యాలు చేస్తున్నాననీ చెప్పాడు. అవునా?" అడిగాడు యుగంధర్. వీరయ్య తల ఊపాడు.

"రామచంద్రరావుని హత్య చేసిందెవరో కూడా తెలుసా నీకు?" అడిగాడు యుగంధర్. వీరయ్య జవాబు కోసం అందరూ ఊపిరి బిగపట్టి కాచుకున్నారు.

"నాకు తెలీదు బాబయ్యా!"

"ఇంట్లో వాళ్ళే యెవరో చేశారని నీకు తెలుసుకదూ!" వీరయ్య తల ఊపాడు.

"నేనూ, పోలీసులూ వచ్చిన తర్వాత యింట్లో అఘాయిత్యాలు జరగడం ఆగిపోతే రామచంద్రరావు హత్యకు కారణం దెయ్యం కాదని మేము అనుకోకుండా ఉండేందుకు నిన్నరాత్రి నువ్వు ఆ పనులు చేశావు కదూ!"

"అవునయ్యా"

"ఇదివరకు నిన్ను ప్రశ్నలు అడిగితే ఎన్నో అబద్ధాలు చెప్పావు కదా! రామచంద్రరావుని హత్య చేసింది ఎవరో తెలిసీ, తెలియదని అబద్ధం చెపుతున్నావేమో" గర్జించాడు యుగంధర్.

"లేదయ్యా! నిజం చెబుతున్నాను. నాకు తెలియదు."

"నువ్వే చేశావా?"

"నేనా! రామచంద్రరావు అయ్యనా! లేదయ్యా లేదు. భగవంతుడి సాక్షిగా లేదు" అన్నాడు వీరయ్య.

"నువ్వింక వెళ్ళు" అన్నాడు యుగంధర్.

వీరయ్య లేచి ఒకసారి భయంతో అందర్నీ చూసి గదిలోంచి వెళ్ళిపోయాడు.

"గుడ్! వెరీ గుడ్ యుగంధర్. ఈ ఇంట్లో అఘాయిత్యాలు దెయ్యం చెయ్యలేదనీ, మనిషే చేశాడనీ ఋజువు చేశారు మీరు. వెరీ గుడ్ అంతకన్నా యేం కావాలి? ఇక హంతకుణ్ణి పట్టుకోవడం ఒక్కటే తరువాయి" అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘువయ్య. యుగంధర్ నవ్వి "థాంక్‌యు. కానీ ఇంకో సందేహం మిగిలింది. వంట యింట్లో చప్పుళ్ళు మనిషెవరూ చేసి ఉండడానికి వీలులేదు. నేను వెళ్ళిచూశాను" అన్నాడు యుగంధర్.

"ఎందుకని?" అడిగాడు రాఘువయ్య.

వంట యింట్లో చప్పుళ్ళు విని తను వెళ్ళాననీ, తలుపు బయట గడియపెట్టి ఉన్నదనీ, లోపల యెవరూ లేరనీ, ఎలిక కూడా లోపలికి వెళ్ళడానికి అవకాశం లేదనీ యుగంధర్ చెప్పాడు.

"అందులో ఉన్న గుఢార్థం నాకు అవగాన కాలేదు" అన్నాడు రాఘువయ్య.

"అంటే మానవాతీతమైన శక్తి యేదో చేసింది అని నా అనుమానం అన్నాడు యుగంధర్.

"వీరయ్యని లక్ష ప్రశ్నలు వేసి, రామచంద్రరావు ఈ అఘాయిత్యాలన్నీ చేశాడని తేల్చి, చివరికి మళ్ళీ మీరే దెయ్యాన్ని ప్రవేశపెడుతున్నారే? కొంపతీసి దెయ్యం ఈ హత్య చేసిందని అంటారా? ఏమిటి?" అన్నాడు రాఘువయ్య.

యుగంధర్ నవ్వి "అవును. కానీ రామచంద్రరావుని ముందుగా ఆలోచించి హత్యచెయ్యలేదని నా అభిప్రాయం. క్షణికోద్రేకంలో, ఆగ్రహం పట్టలేక చేసిన హత్య అని నా నమ్మకం. అందుకే మనకి యెటువంటి సూచనగాని, నిదర్శనంగానీ దొరకలేదు. హత్య చేసిన మనిషి తనకై తాను నేరం ఒప్పుకుంటే గానీ నేరం మోపలేము" అన్నాడు.

"హత్య చేసినదెవరో మీకు తెలిసినట్లున్నదే" అడిగాడు రాఘువయ్య.

"ఊహించాను. అంతే. ఒక్క ఋజువు కూడా లేదు"

"ఎవరో చెప్పండి."

"చెప్పలేను. నా ఊహ సరయినదో కాదో! బాధ్యతారహితంగా ఒక మనిషి మీద యెలా అటువంటి నింద మోపుతాను? మీరు ఈ రాత్రి పదిగంటలకి రండి. ఆ లోగా చేతనయితే హంతకుని చేత నేరం ఒప్పిస్తాను. రాత్రి యిక్కడే ఉందురుగాని. వంట ఇంట్లో చప్పుళ్ళ గురించి యిద్దరం కలిసి దర్యాప్తు చేద్దాం" అన్నాడు యుగంధర్.

22

"ఇప్పుడయినా నిజం చెపుతావా లక్ష్మీ?" యుగంధర్ ఈ ప్రశ్న అడగ్గానే ఉలిక్కిపడి తలెత్తి "నేను మీతో అబద్ధం చెప్పలేదు" అన్నది లక్ష్మి.

"అబద్ధం చెప్పావు. అబద్ధం చెప్పావని నాకు అప్పుడే తెలుసు. చూడమ్మా! నీ నైతిక ప్రవర్తన ఖండించేందుకు నేనిక్కడికి రాలేదు. నేను కోరేదల్లా నిజం చెప్పమని."

లక్ష్మి మాట్లాడలేదు. "పోయిన ప్రియుడు ఎలాగూ పోయాడు, కాపురమయినా నిలబెట్టుకుందామని అబద్ధాలు చెపుతున్నావు" అన్నాడు యుగంధర్.

లక్ష్మి కళ్ళల్లోనించి నీళ్ళు జలజలా రాలి చేతులమీద పడ్డాయి. చటుక్కున చీరకొంగుతో చెయ్యి తుడుచుకుని ఆ గదిలోంచి వెళ్ళిపోయింది.

యుగంధర్ ఆ రోజంతా చాలా చికాగుగా, పరధ్యానంగా ఉన్నాడు. రాత్రి భోజనాలయ్యాయి. అందరూ వాళ్ళ వాళ్ళ గదులకి వెళ్ళిపోయారు. సరిగా పది గంటలకి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవయ్య హాజరయ్యాడు "మీరూ, నేనూ, శ్రీనివాసరావుగారు ఈ రాత్రి భోజనాల సావిట్లో పడుకునేందుకు ఏర్పాటయింది" అన్నాడు యుగంధర్.

"రాత్రి ఏదో జరగబోతున్నదని తెలిసీ నిద్ర ఎలా పోతాం? నిద్ర ఎలా పడుతుంది?" అడిగాడు రాఘవయ్య.

"నిద్రపోవద్దు" అన్నాడు యుగంధర్.

"ఎన్ని గంటలకి చప్పుళ్ళు అవుతాయి?" అడిగాడు రాఘవయ్య.

"ఏమో?"

తర్వాత కబుర్లలోకి దిగారు. పన్నెండు గంటలైంది. మాట్లాడి మాట్లాడి అందరూ అలిసిపోయారు. నెమ్మదిగా తలలు దిళ్ళమీదికి వాల్చారు. దీపం ఆర్పేశారు.

గలగలమని నీళ్ళు ఒలికిన చప్పుడయింది. కిర్రుమని పీటలాగిన చప్పుడయింది. యుగంధర్ లేచి కూర్చున్నాడు. రాఘవయ్యని నెమ్మదిగా తట్టాడు. ఒక నిమిషంపాటు నిశ్శబ్దం. మళ్ళీ అదే చప్పుడు. రాఘవయ్య మంచం మీదనించి లేచి నెమ్మదిగా వంట యింటి తలుపు వద్దకు వెళ్ళాడు. చెవి తలుపు సందుకి ఆనించి పెట్టాడు.

కాసేపయిన తర్వాత మళ్ళీ గలగలమని నీళ్ళ చప్పుడు వినిపించింది. పీట లాగిన చప్పుడయింది.

రాఘవయ్య జేబులోంచి టార్చిలైటు తీశాడు. వంట తలుపు గడియ లాగాడు కానీ తలుపు తెరవలేదు.

మళ్ళీ చప్పుడయింది. చటుక్కున టార్చి వెలిగించి, కాలితో తలుపుని ఒక తన్ను తన్నాడు. తలుపు తెరుచుకుంది. టార్చి వెలుగు వంట యింట్లో అటూ ఇటూ తిప్పాడు. ఎవరు లేరు నీళ్ళ బిందె వుంది కానీ నీళ్ళు ఒక బొట్టయినా ఒలకలేదు.

"ఈ చప్పుళ్ళు వంట యింట్లోంచే వచ్చాయా?" అడిగాడు యుగంధర్. అక్కడికి వచ్చి.

"అవును. వంట యింట్లోంచే వినిపించాయి. సందేహం లేదు. దెయ్యమే!" అన్నాడు రాఘవయ్య.

"దెయ్యమో, భూతమో! మనకి తెలియని శక్తులు కొన్ని ఉన్నాయి అన్నాడు యుగంధర్.

"దెయ్యమైతే నన్ను పిలిచి నాకు ఇది చూపించడంలో మీ ఉద్దేశం ఏమిటి? దెయ్యాలలో నాకు నమ్మకం కలగడానికా?" అడిగాడు రాఘవయ్య.

"అందుకు కాదు. కారణం ఉండే ఈ పని చేశాను. రామచంద్రరావుని ఎవరు హత్య చేసిందీ, ఎందుకు హత్య చేసిందీ ఊహించగలిగాను. కేవలం హేతువాదంతో తెలుసుకోగలిగాను. అయితే ఆ మనిషి హత్య చేసినట్లు ఋజువేమీ లేదు. అందువల్ల ఆ మనిషి నేరం తను చేసినట్లు ఒప్పుకుంటే తప్ప ఆ మనిషి మిద ఛార్జి దాఖలు చేసి ప్రయోజనం లేదు. కేసు నిలబడదు."

"అయితే?" అడిగాడు రాఘవయ్య.

"నా అనుమానం ఎవరిమీద ఉన్నదో, నేను ఏ కారణాల వల్ల అట్లా ఊహించానో యిప్పుడు చెప్పను. ఆ మనిషి చేత నేరం ఒప్పించగలిగితే చెపుతాను. లేదా అసలు చెప్పను. అటువంటప్పుడు మీరు ఈ రాత్రి వంట యింట్లో స్వయంగా విన్న, చూసిన విషయాల ఆధారంతో రిపోర్టు రాసుకోవలసి వస్తుంది."

"అంటే దెయ్యం హత్య చేసిందని" అన్నాడు రాఘవయ్య. యుగంధర్ తల ఊపి "మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తాను. మీరిక్కడే ఉండండి. రాజుని యిక్కడ కాపలా ఉండమంటాను" అని వెళ్ళిపోయాడు.

"మీ అన్నయ్య క్రిష్ణమూర్తితో మాట్లాడిన తర్వాత సర్కిల్ ఇన్స్పెక్టర్ని కలుసుకోండి" అన్నాడు యుగంధర్ ప్రభాకరరావుతో.

"థాంక్స్" అన్నాడు ప్రభాకరరావు.

అరగంట తర్వాత యుగంధర్ భోజనాల సావిట్లోకి తిరిగి వచ్చి "హంతకుడు తన లాయర్‌తో సహా యింకో పది నిమిషాల్లో ఇక్కడికి వస్తాడు. నేరం ఒప్పుకున్నాడు" అన్నాడు రాఘవయ్యతో.

"ఎవరు?" అడిగాడు శ్రీనివాసరావు.

"ప్రభాకరరావు."

"ప్రభా! వాడా! ఎందుకు చేశాడు? రామచంద్రరావుని హత్యచేశాడా! తన చెల్లెలు మొగుణ్ణి హత్యచేశాడా! పొరపాటు. వాడలాటి వాడు కాడు. మంచివాడు" అన్నాడు శ్రీనివాసరావు.

"ఎందుకు హత్య చేశాడు? కారణం ఏమిటి?" అడిగాడు రాఘవయ్య.

"దెయ్యం గురించిన గందరగోళం అడ్డులేకపోతే కారణం సులభంగానే గ్రహించవచ్చు. రామచంద్రరావు హత్యకి కారకుడు ప్రభాకరరావే అయ్యుండాలని మొట్టమొదటే నాకు అనుమానం కలిగింది" అన్నాడు యుగంధర్. "ఎందుకని? " అడిగాడు రాఘవయ్య.

"ప్రభాకరరావు భార్య లక్ష్మి భోజనాల సావిడికి ముందున్న నడవాలో పడుకున్నది. ఆమెని దెయ్యం ఎత్తుకు వచ్చి అక్కడ పడుకోపెట్టిందని ఆమె చెప్పిన దాన్ని బట్టి అనుకోవలసి వచ్చింది. మనిషెవరూ ఆ పని చేసి ఉండడానికి వీల్లేదు కదా! ఆ పని దెయ్యం చెయ్యనట్లయితే లక్ష్మి నడవాలో పడుకోవడానికి కారణం ఏమిటి? ఆమె అలా అబద్ధం చెప్పడానికి కారణం ఏమిటి? అర్ధరాత్రి ఆమె తన గదిలోంచి రావడానికి కారణమేమిటి? అర్ధరాత్రి రామచంద్రరావు తన గదిలోంచి రావడానికి కారణమేమిటి? రామచంద్రరావు గురించి కొన్ని విషయాలు తెలుసుకున్న తర్వాత ఈ ప్రశ్నకి సమాధానం ఊహించగలిగాను. ఉద్యోగం కోసం మద్రాసుకి వెళ్ళాడు అతను. ఉద్యోగం పోగానే ఈ ఊరికి వచ్చాడు. ఆ తర్వాత ఈ ఊరినించి వెళ్ళేందుకు అతను యిష్టపడలేదు. ఆస్తి అమ్మేసి ఈ ఊరినుంచి వెళ్ళిపోవడానికి

ఇష్టం లేదని తెలిసింది. ఈ ఊరు విడిచి వెళ్ళడానికి అతనికి ఎందుకు ఇష్టం లేదు? ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని ఆలోచించి లక్ష్మికీ, రామచంద్రరావుకీ సంబంధం ఉన్నదనీ, హత్య జరిగిన రాత్రి రామచంద్రరావుని రహస్యంగా కలుసుకోవడానికి లక్ష్మి తన గదిలోంచి బయటికి వెళ్ళిందనీ ఊహించగలిగాను.''

అంతలో క్రిష్ణమూర్తి, ప్రభాకరరావు అక్కడికొచ్చారు.

''ఏమిటి ప్రభా! యుగంధర్ చెప్పేది నిజమా?'' అడిగాడు శ్రీనివాసరావు. ప్రభాకరరావు తల ఊపాడు.

''రాఘవయ్యగారూ ప్రభాకరరావు స్టేట్‌మెంటు ఇస్తున్నాడు. తమరు వ్రాసుకోవచ్చు'' అన్నాడు క్రిష్ణమూర్తి.

''నాన్నగారు దెయ్యమై వచ్చి ఉయ్యాల ఊపడంలాంటి అఘాయిత్యాలు చేస్తున్నారని నేను నమ్మలేదు. రామచంద్రరావు చేస్తున్నాడని కానీ, అతనికి నా భార్యతో సంబంధం ఉన్నదని కానీ నాకు ఏ మాత్రమూ అనుమానం లేదు. హత్య జరిగిన రాత్రి ఓ రాత్రి వేళ మెలుకువ వచ్చింది. తలుపు తెరుచుకుని లక్ష్మి బయటికి వెళుతూ ఉండడం చూశాను. ఎందుకు వెళుతోందా అని ఆశ్చర్యపోతూ ఆమె వెనకే నేను వెళ్ళాను. బయట చీకట్లో ఆమె ఎవర్నో కలుసుకున్నది. వాళ్ళిద్దరి మాటలు వినిపించాయి. గొంతు బట్టి అది రామచంద్రరావు అని తెలిసింది. అప్పుడు అర్థమయింది అతను ఆడుతున్న నాటకం అంతా. నాలో కలిగిన విరక్తి, కోపం ఉద్రేకం చెప్పలేను. ఆ ఇద్దరూ వరసకి అన్నాచెల్లెలు. ఎంత నీచానికి పూనుకున్నారా అనిపించి అసహ్యంతో నా గదిలోకి వెళ్ళిపోయి తలుపు లోపల గడియపెట్టుకున్నాను. కాసేపటికి తలుపు లాగిన చప్పుడైంది. మండిపోతూ లేచాను. లక్ష్మి అనుకుని నిలదీసి అడుగుదామని తలుపు తెరిచాను. లక్ష్మి, అతనూ మెట్లు దిగుతున్నారు. నేను వాళ్ళ వెనకే చప్పుడు చెయ్యకుండా మెట్లు దిగాను. ఎక్కడికి వెళతారో చూద్దామని మెట్ల పక్కన దాక్కున్నాను. అంతలో వంట యింటివేపునించి పొలికేకలు వినపడ్డాయి. రామచంద్రరావు పరిగెత్తుకు వస్తున్నాడు. అతనికి కనిపించకుండా ఉండేందుకు మెట్ల కిందవున్న గూడులోకి వెళ్ళాను. అతని దురదృష్టం, నా దురదృష్టం అతనూ అక్కడికే వచ్చి దాక్కున్నాడు. కోపం ఆపుకోలేకపోయాను. నా భార్యతో సంబంధం పెట్టుకున్న దుర్మార్గుడు అందుబాటులో ఉండగా సహించలేకపోయాను - గొంతు నులిపి చంపేశాను' అన్నాడు ప్రభాకరరావు.

''క్షణికోద్రేకం ఆగ్రహం భరించలేక చేసిన నేరం యిది'' అన్నాడు క్రిష్ణమూర్తి.

''కోర్టులో మీరిలా వాదించేందుకు మీకు తగినంత అవకాశం ఉంటుంది. అయినా నేను ప్రభాకరరావు మీద హత్యానేరం ఎలా మోపగలను. కల్పబుల్ హోమీసైడ్ నాట్ ఎమౌంటింగ్ టు మర్డర్'' అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవయ్య.

డిటెక్టివ్ యుగంధరూ, రాజూ మద్రాసుకి బయలుదేరారు క్రిజ్లర్ కారులో, ''ప్రభాకరరావుకి ఏ మాత్రం శిక్ష పడుతుంది?'' అడిగాడు రాజు.

''చాలా స్వల్పమైన శిక్ష పడుతుంది. హత్య ఏ పరిస్థితులలోనూ సమర్థనీయం కాదు కాని, ఈ కేసులో సానుభూతి హంతకుడిమీదే ఉంటుంది'' అన్నాడు యుగంధర్.

''అన్నట్టు ఒక విషయం అడగడమే మర్చిపోయాను దెయ్యం చేసినట్లు గల్లంతు చేసింది రామచంద్రరావు అయితే వంట యింట్లో చప్పుళ్ళు చేసి, దిష్టి బొమ్మ పెట్టడం ఎలా చేశాడు? ఆ సమయంలో అతను లక్ష్మితో ఉన్నాడుగా'' అడిగాడు రాజు.

''ఆప్రశ్న రాఘవయ్య అడుగుతాడనే వంట ఇంట్లో చప్పుళ్ళు వినమన్నాను. దిష్టిబొమ్మ అంతకు ముందే పెట్టి ఉంటాడు రామచంద్రరావు.''

''మరి ఆ చప్పుళ్ళు?'' అడిగాడు రాజు.

"రాజా! ఆ చప్పుళ్ళు మనిషి ఎవరూ చేసి ఉండడానికి వీలులేదని తేలింది. మనం నలుగురం కళ్ళారా చూశాం. మన హేతువాదానికి అందని విషయాలు కొన్ని ఉన్నాయి. మన ఈ స్వల్ప జ్ఞానంతో అంతా తెలుసుకున్నామనిగానీ, తెలుసుకోగలమని కానీ భ్రమపడకూడదు" అన్నాడు యుగంధర్.